EMESCO



# రక్షరేఖ

సి. ఆనందారామం

**RAKSHA REKU**

A novel by

C. ANANDARAMAM

Publishers :

M. SESHACHALAM & Co.,

Machilipatnam, Secunderabad, Madras,

First Edition :

September 1976

Cover Design :

BAPU

Printers :

SRI KALA PRINTERS,

Madras – 33.

Distributors :

ANDHRA PRADESH BOOK DISTRIBUTORS,

Rashtrapathi Road, Secunderabad.

Price: Rs. 3-50

281

శ్రీ సిద్ధార్థ బుక్ పాయింట్,
వ త్రైఖాన్ పేట - నెల్లూరు-3.

ఈ నవలలో జై హింద్ బాబు అనే కార్మిక యువకుడు రైల్వే బ్రిడ్జికి రంగువెయ్యబోతూ క్రింద ప్రవహించే మురికి కాలువకు బలిఅయిపోవటం యధార్థ సంఘటన - ఆ రకంగా మరికొందరు కూడా బలి అయిపోయారు - మిగిలినదంతా వాస్తవ పరిస్థితుల్ని ఆధారంగా చేసుకుని సాగిన యధోచిత కల్పన. ఈ నవలలోని ఏ సన్నివేశమూ ప్రత్యేకించి ఏ ఒక్కరికీ సంబంధించింది కాదు.

—రచయిత్రి

శ్రీ సిద్ధార్థ బుక్ పాయింట్,
వ త్రైఖాన్ పేట - నెల్లూరు-3.

శ్రీ సిద్ధార్థ బుక్ పాయింట్,
ట్రంకు రోడ్ పేట - నెల్లూరు-1.

ఆ ఇంట్లో ప్రభాతగానం ప్రారంభమయింది. ప్రభాతగానమంటే, భజనగీతాలుకావు-ప్రార్థనా శ్లోకాలూకావు - కోటయ్యఅరుపులు. తెల్లవారి లేస్తూనే అంబలిలో ఉప్పు ఎక్కువయిందనో, తక్కువయిందనో, రొట్టె ఎక్కువ కాలిందనో, సరిగా కాలలేదనో, అన్నమ్మ మీద అరవటం ప్రారంభిస్తాడు కోటయ్య....అప్పుడప్పుడు అరుపులతోపాటు, అన్నమ్మ వీపుమీద దరువులు కూడా వేస్తుంటాడు— అవన్నీ కోటయ్య కళాకళలు-అన్నమ్మ అదృష్టం....

ఆరోజు దభీ దభీమని గుద్దులుకూడా వినిపిస్తోంటే, గుడిసెలో మట్టిగోడకి కరుచుకుపోయి బిక్కచచ్చి కూచుండి పోయారు పిల్లలు ముగ్గురూ....

పెద్దవాడు జై హింద్ బాబు-కోటయ్యకి దేశభక్తి బాగా ముదిరి 'జై హింద్ బాబు'అని కొడుక్కి పేరుపెట్టుకున్నాడు-ఆపేరు పిలవటం చేతకాక 'జయన్ బాబు'లోకి దింపాడు-అతని దేశభక్తిలాగే కొడుక్కి పెట్టుకున్న పేరుకూడా అనేక అపభ్రంశ రూపాలని పొందింది-ఆ తరువాతది రత్నమ్మ....సామాన్యమైన రూపురేఖలు - ఆఖరు పిల్ల సుందరీబాయి-సార్థక నామధేయురాలు.

అరిచి, అరిచి, అలిసిపోయి బయటకు పోయాడు కోటయ్య-

రేగిన జుట్టుగోళ్ళతో వెనక్కు దువ్వుకుంటు-కన్నీటి చారికలు కట్టిన మొఖాన్ని కొంగుతో తుడుచుకుంటు పిల్లల దగ్గిర కొచ్చింది

అన్నమ్మ—పిల్లలు ముగ్గురూ భయంగా తల్లిముఖంలోకి చూశారు- ఆ ముఖాల్లోకి చూస్తూ నవ్వింది అన్నమ్మ. అదిచూసి పిల్లలూ నవ్వారు-

"లెగండి! రొట్టె తిందురుగాని—" అని ముగ్గుర్ని పిలిచింది అన్నమ్మ-పిల్లలు ముగ్గురూ లేచిమొహాలు కడిగిన తరువాత, వాళ్ళకు రొట్టె పెట్టింది అంబలి ఇచ్చింది.

"ఒరేయ్! జయన్! మొన్న పండుక్కి కుట్టించిన నిక్కరు చొక్కా యేసుకోరా! అమ్మగారు నిన్ను బళ్ళో ఏస్తానన్నారు—" అంది.

జై హింద్ బాబు హుషారుగా తయారయ్యాడు-

గుడిసెముందు ఎత్తుగా ఇటుకరాళ్లు పేర్చి వాటిమీద బల్ల పెటి చిన్న దుకాణం తయారుచేసింది అన్నమ్మ-ఆ బల్లమీద చిన్న చిన్న సీసాలలో వేరుసెనగ ఉండలు, మరమరాల ఉండలు, పిప్పరమెంట్లు, మొదలైనవి పెట్టింది. ఒక జంగిట్లో చక్కిలాలు పెట్టింది.

చిన్నకూతురు సుందరీబాయిని బల్లముందు కూచోబెట్టి "ఇదిగో! జాగరతగా అమ్మ! ఆడకీడకీ పోబోకు-ఆ ఉండలు మూడు పైసలకొకటి-ఈ ఉండలు పదిపైసలకొకటి....చక్కిలాలు చిన్నయి మూడుపైసలు-పెద్దయి ఆరుపైసలు-డబ్బులు లెక్కబెట్టి తీసుకో!" అంది-బుద్ధిగా తల ఊపింది సుందరీబాయి-

పెద్దకూతురు రత్నమ్మని "రాయేరత్తీ! ఇద్దరం చూసుకుంటే పని తొరగా తెములుద్ది.నీకూ అలవాటవుద్ది-" అని రత్నమ్మని తనతో బయలుదేర దీసింది—

రత్నమ్మతోనూ జై హింద్ బాబు తోనూ కలిపి అన్నమ్మ నాలుగడుగులు వేసేసరికి చంద్ర చెయ్యి పుచ్చుకుని నాగమ్మకూడా కలిపింది....

"జయన్ బాబుని బళ్ళో యేస్తన్నారా? మా చెంద్రిని కూడా యేస్తున్నా!" అంది నాగమ్మ-

"యెయ్యి వదినా! ఇద్దరూ జతగా ఉంటారు-మా అమ్మగారి



పున్నెమా అని ఈణ్ణి బళ్ళో యేస్తన్నాను-మనం జీతంగీతం కట్టక్కర్లేదంట! యెదురు ఆల్లే మన కులాళ్ళకి సాలర్ సిప్ప, ఆదేదో ఇస్తారంట! అయ్యన్నీ అమ్మగారు చూసుకుంటా నన్నారు" అంది అన్నమ్మ.

"మా అమ్మగారు కర్కోటకపుముండ! ఎంతసేపూ చాకిరీ చెయ్యమంటదేకాని, యెంగిలి చెయ్యి యిదపదు-అమ్మాయిని నేను బళ్ళో యేస్తన్నా! జీతం గీతం, అయ్యన్నీ మావోడు సూసుకుంటాడులే!" గర్వంగా అంది నాగమ్మ-

అది చాలా పెద్దసిటీ! అంతపెద్ద సిటీలో సిటీనడి బొడ్డునకాక కొంతదూరంగా ఉన్న లొకేలిటీలో మధ్య తరగతి గృహస్థుల ఇళ్ళలో పనిచేస్తున్నారు అన్నమ్మ, నాగమ్మ—

ఆ లొకేలిటీకి కొంచెందూరంలో సువిశాలమైన మైదానం ఉంది-అది కంటోన్ మెంట్ వారికి చెందినది-అక్కడ ఇళ్ళు కట్టుకోవటానికి అనుమతి లేకపోవటంవల్ల, ఆ స్థలం అధికారులు ఆ స్థలాన్ని అలా ఖాళీగా వదిలేశారు-కూలినాలిజనం చాలామంది అధికారులకు చెప్పి కొందరూ, చెప్పక కొందరూ, బ్రతిమాలుకుని కొందరూ, పోగరుబోతులై కొందరూ....ఇలా రకరకాలుగా ఎలాగో ఒకలాగ ఆ స్థలాన్ని ఆక్రమించుకుని గుడిసెలు వేసేసుకున్నారు—

చూస్తూఉండగా ఆ ప్రాంతం ఒక కూలివాడగా తయారయి పోయింది-వాళ్ళకు తమ తరతరాల వారసత్వంగా చెప్పుకోవటానికి సంపదలూలేవు-పేరు ప్రఖ్యాతులూ లేవు-అంచేత తమకున్న మూఢ విశ్వాసాలనూ, మూర్ఖాచారాలనూ ప్రాణప్రదంగా పట్టుకు ప్రాకులాడుతుంటారు-

అన్నమ్మ ఒక స్కూల్ టీచర్ ఇంట్లో పనిచేస్తోంది. అన్నమ్మ చాలా మంచిది. ఒళ్ళు దాచుకోకుండా పని చేస్తుంది. నిజాయితీగా ఉంటుంది-అంచేత ఆ టీచరమ్మకి అన్నమ్మ అంటే అభి

మానం-జైహింద్ బాబును బళ్ళో చేర్పించమని టీచరమ్మే చెప్పింది స్కాలర్‌షిప్ వచ్చేలా చూస్తానని కూడా అంది.

టీచరమ్మ భర్త ఆఫీస్‌లో అప్పర్ డివిజన్ గుమాస్తా. వాళ్ళకి ఇద్దరు పిల్లలు-ఆ పిల్లల్నికూడా అభిమానంగా చూస్తుంది అన్నమ్మ అంచేత పిల్లలికీ, గుమాస్తాగారికీ, కూడా అన్నమ్మ అంటే అభిమానమే!

అన్నమ్మ మొగుడు కోటయ్య తిన్ననైన వాడుకాదు— ఎన్నడూ ఒక ఉద్యోగంలో సరిగా ఉండడు-బాగా తాగుతాడు-తాగిన మైకంలోనే కాక, కోపం వచ్చినప్పుడల్లా భార్యని కొడతాడు. అతనికి కోపం ఎప్పుడూ వస్తుంది. తండ్రిని కోపంలేకుండా ఎప్పుడూ చూడలేదు పిల్లలు-

అన్నమ్మ మంచితనాన్ని బట్టి, కోటయ్య ప్రవర్తనను గురించి తెలుసుకున్న టీచరమ్మకి, అన్నమ్మమీద మరింత సానుభూతి.

నాగమ్మ పరమగయ్యాళిది-దాన్ని రాజయ్య లేవదీసుకొచ్చాడు-మొదటి పెళ్ళాన్నీ, కొడుకునీ, తన ఊళ్ళో వదిలేసి నాగమ్మతో సిటీ కొచ్చేశాడు-రాజయ్యకీ, కోటయ్యకీ దూరపు బంధుత్వముంది— అంచేత నాగమ్మ, అన్నమ్మ, 'వదినా,' అంటే 'వదినా' అని పిలుచుకుంటారు.

రాజయ్య నాగమ్మను లేవదీసు కొచ్చినందుకు బంధువులు గొడవచేశారు మొదట్లో-కానీ, రాజయ్య పెద్దకు 'తప్పు' కట్టెయ్యడంతో అంతా సమసిపోయింది-ఆ 'తప్పు' కట్టిన డబ్బుతో అందరూ తాగి తందనా లాడినతరువాత, నాగమ్మ, రాజయ్య సంఘంలో కలిసిపోయారు.

రాజయ్య బాగా సంపాదిస్తాడు-తాగుతాడు, కానీ మరీ విపరీతంగా తాగడు-రాజయ్య దగ్గిర కాస్తో, కూస్తో డబ్బుంది. కంటోన్‌మెంట్ ఆవరణలోనే ఒక ఎకరం స్థలం కవులుకి తీసుకుని కూరగాయలతోట వేసుకుని వ్యాపారం ప్రారంభించారు—బాగానే నడుస్తోంది-ఈ వ్యాపారంగాక, అతడు రోడ్డు వేస్తున్నప్పుడు, ఇళ్ళు కడుతున్నప్పుడూ, కూలికికూడా పోతాడు-దానా, దీనా, రాజయ్య సంసారం సుఖంగానే సాగుతోంది. అంచేత నాగమ్మకి, బడాయి గర్వం.



నాగమ్మ వరదాచార్యులు గారింట్లో పనిచేస్తోంది-ఎంత పెద్ద సిటీలోనైనా కోవెలలు లేకుండా ఉండవు-జనం ఏంలేకపోయినా బ్రతకగలరు కాని, తమ పాపపుణ్యాలభారం గుమ్మరించి తాము నిశ్చింతంగా ఉండగలిగే ఒక దేవుడు లేకపోతే బ్రతకలేరు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు వరదాచారి— తరతరాలుగా ఆ కుటుంబం అర్చకవృత్తిలోనే ఉంది-జనానికున్న దైవభక్తి పుణ్యమా అని ఆ కుటుంబం సంపన్న కుటుంబాల-జాబితాలోకి చేరుకుంది—

వరదాచారికి ఒక వెర్రి బాగుల తమ్ముడున్నాడు. నాదముని-పేరు ఎంత గొప్పదో, మనిషి అంత ఎందుకూ పనికిరానివాడు.

అతడి భార్య సరళమాత్రం సార్థక నామధేయురాలు—తోటికోడలు వరదాచార్యులు భార్య రంగనాయకమ్మ ఎప్పుడూ ఏదో రోగాన్ని కల్పించుకుని నడిమంచమెక్కి మూలుగుతూ ఉంటె, ఇంటెడు చాకిరీ సరళ ఒక్కర్తే చేస్తుంది-ఇంత చాకిరీ చేసినా సరళ నెవ్వరూ గౌరవంగా చూడరు ఆ ఇంట్లో....

సరళ ఏమీలేని ఇంటిపిల్ల కావటమే అందుకు కారణం-పాపం-సరళకు చిన్నతనంలోనే తల్లీ తండ్రీ పోయారు-ఆధారం లేకపోయినా, తాను ఆదరించి పెద్ద చేయవలసిన తమ్ముడు మిగిలాడు-బంధువులంతా బెదిరిపోతూ ఎక్కడివాళ్ళక్కడ ఆ అక్కా తమ్ముళ్ళను వదిలించుకోవాలని చూశారు.

సరళ తన తమ్ముడు పార్థసారధితో కలిసి తన మేనమామను ఆశ్రయించక తప్పలేదు. ఆ మేనత్తా మేనమామలూ సరళను.

తమ్ముణ్ణి మెడపట్టుకు బయటకు ఈడవటం మినహా, ఇంట్లోంచి వెళ్ళగొట్టడానికి ఎన్ని చెయ్యాలో అన్నీ చేశారు-సరళ మొండిగా అచూరు పట్టుకు వేళ్ళాడింది—

ఎలాగైనా తమ్ముడికి చదువు చెప్పించాలనే సరళ ప్రయత్నం మాత్రం ఫలించలేదు-సరళ మేనమాఁవ తన మేనల్లుణ్ణి తన చేతి క్రింద పనిపాటలు చెయ్యటానికి ఉపయోగించు కున్నాడే కాని, బడికి పంపలేదు—ఫలితంగా పద్నాలు గేళ్ళువచ్చినా పార్థసారధికి చదవటం రాయటం మించి ఏమీ రాకుండా పోయింది.

ఇలాంటి సందర్భంలో వరదాచార్యులు తన వెర్రి బాగుల తమ్ముడికి పెళ్ళి సంబంధాలు చూస్తూ సరళ అన్నివిధాలా తగినదని నిర్ణయించుకుని సరళ మేనమాఁవను అడిగాడు-ఎలాగైనా పీడ వదిలించుకోవాలని అరాటపడుతున్న మేనమాఁవ ఒప్పుకున్నాడు-

వరదాచార్యులు కుటుంబం బాగా ఉన్న కుటుంబం అనివింది సరళ.అంచేత నాదముని వెర్రిబాగులవాడని తెలిసినా, తనకూ, తన తమ్ముడికీ, ఇంత ఆశ్రయం దొరుకుతుందనే ఆశతో....తన తమ్ముణ్ణి అప్పటికైనా చదివించి ప్రయోజకుణ్ణి చేయాలనే తపనతో ఆ పెళ్ళికి ఒప్పుకుంది....

అత్తింట్లో అడుగుపెట్టిన మరుక్షణమే తన ఆశ అడియాన అని సరళకు తెలిసిపోయింది....ఆ ఇల్లు సంపన్న కుటుంబమే! అయితేనేం? పెత్తనమంతా వరదాచారిది-వెర్రిబాగుల వాడైన నాదమునికి ఆ ఇంట్లో గడ్డిపోచ విలువలేదు-అతనిభార్య అయిన సరళకు అసలే విలువలేదు—

వంటమనిషికి మించినస్థానం ఆ ఇంట్లో సరళకి లభించలేదు-వంటమనిషికీ సరళకీ కొంచెమేతేడా? సరళను వంటమనిషి అనరు-వరదాచార్యులుగారి మరదలు అంటారు—వంటమనిషికి చేసినపనికి జీతం వస్తుంది-యథేచ్ఛగా వ్యవహరించే స్వాతంత్ర్యం ఉంటుంది-



సరళకు ఇవి రెండూ లేవు....తన తమ్ముణ్ణి ప్రయోజకుణ్ణి చేయాలన్న సరళ తపన తపనగానే ఉండిపోయింది.

సారధి తన మేనమాఁవ గారింట్లో బదులు, బావగారింట్లో చాకిరీ చెయ్యవలసి వచ్చింది-సారధి మంచివాడు-తెలివైనవాడు. తనంతట తనే ఎలాగో ఒకలాగ పుస్తకాలు సంపాదించి చదువుకోవాలని తాపత్రయ పడేవాడు-పాపం, అదీ కుదిరేదికాదు, కొన్ని సందర్భాల్లో....

సరళకి కాని, సారధికి కాని నయాపైస కావలసి వచ్చినా వరదాచారి ముందు చెయ్యి జాపవలసిందే! ఎన్నెన్నో ప్రశ్నలు అడిగి విసుక్కుంటూ, విదిలిస్తూ అడిగినదానిలో సగం ఇచ్చేవాడు వరదాచారి....విలాసాలూ, వినోదాలూ, దేవుడెరుగు-దైనందిన జీవితావసరాలకి కూడా కటకటలాడ వలసివచ్చేది ఆ కలిగిన వారింటికోడలు....

చదువులేదు—ఆర్థికస్తోమతులేదు—అండదండలులేవు— ఒక ఆడది ఏం చెయ్యగలదు?

ఎన్ని కష్టాలనైనా మౌనంగా భరించడమే అలవాటు చేసుకుంది సరళ—సంతానమైనా ఉంటే తనకొక ఆధారమేర్పడు తుందని ఆశపడింది కొన్నాళ్లు....అదేం దురదృష్టమో, ఆ ఆశకూడా ఫలించలేదు....

ఆ ఇంట్లో సరళ స్థానమేమిటో నాగమ్మకు బాగా తెలుసు—తనకు ఏదైనా పెట్టాలన్నా, పెట్టగలిగే స్వాతంత్ర్యం సరళకు లేదని తెలుసు-అంచేత సునాయాసంగా సరళను "కర్కోటకపు ముండ-" అనేసింది.

## 2

ఎంత పెద్ద సిటీఅలోనైనా సిటీ సెంటర్‌లో మాత్రమే ఆధునికనాగరకతా లక్షణాలన్నీ కనిపిస్తూ ఉంటాయి. సెంటర్‌కి దూరంగా

ఉంటే లోకేలిటీల్లు వేటికవి చిన్న చిన్న పల్లెటూళ్ళలాగానే ఉంటాయి, కొద్ది భేదాలతో—

పబ్లిక్ స్కూల్స్ ఉన్నాయి-కాన్వెంట్స్ ఉన్నాయి-కానీ, అవి దూర దూరంగా ఉంటాయి—సిటీ నాలుగు మూలలనుంచీ అందరూ తమ పిల్లల్ని అలాంటి స్కూల్స్‌కి పంపలేరు.

మామూలు మధ్య తరగతి కుటుంబీకులు తమ పిల్లల్ని తమకు దగ్గిరలో అందుబాటులో ఉండే గవర్నమెంట్ స్కూల్స్‌కి పంపక తప్పదు-గవర్నమెంట్ స్కూల్స్‌లో మధ్యతరగతి కుటుంబీకుల పిల్లలేకాదు-కూలిజనం పిల్లలుకూడా ఉంటాడు.

సమాజంలో చెక్కు చెదరక స్థిరపడిపోయిన వర్గభేదాలకు బీజాలు ఇక్కడే ఈ విద్యార్థి దశలోనే ఏర్పడి పోతుంటాయి-జరుగు తున్న దేమిటో ఎవరికీ తెలియరానంత విచిత్రంగా అత్యంత సహ జంగా పెరిగిపోతుంటాయి ఈ గోడలు....

ప్లే గ్రౌండ్‌లో ఏదో గలాటా జరుగుతోంటే, ఒక మూలకు కూచుని చదువుకుంటున్న జైహింద్‌బాబు తలెత్తి చూశాడు. నలుగురు అబ్బాయిలు కలిసి ఒక అబ్బాయిని తంతున్నారు-చూడలేక పోయాడు జైహింద్‌బాబు-వెంటనే వెళ్ళి వాళ్ళతో కలియబడ్డాడు-జైహింద్ బాబుది చాలా బలిష్ఠమైన శరీరం - జైహింద్‌బాబు తాకిడికి వాళ్ళు నిలవలేక పారిపోయారు.

క్రిందపడ్డ అబ్బాయిని లేవనెత్తాడు జైహింద్‌బాబు—అతనికి వంటిమీద చాలాచోట్ల గాయాలు తగిలాయి-ముక్కులోంచి నెత్తురు కారుతోంది. నిలబడలేక పోతున్నాడు—అతడు జైహింద్‌బాబు క్లాస్‌మేటు! పేరు సుధీర్.

సుధీర్‌కి జైహింద్‌బాబు పని చేసుకునే అన్నమ్మ కొడుకని తెలుసు. అందుకే జైహింద్‌బాబుతో ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడే వాడు కాదు. పైగా తప్పుకు తిరిగేవాడు. అది అర్థం చేసుకున్న జైహింద్‌బాబు కూడా సుధీర్‌కి దూరంగానే ఉండేవాడు.



ఈ నాడు తనను దెబ్బలనుండి కాపాడింది జైహింద్‌బాబు అని గుర్తించగానే సుధీర్‌కి సిగ్గుతో తల వాలిపోయింది.

"వాళ్ళు నా పెన్సిల్ లాక్కున్నారు. ఇయ్యమని అడిగితే అన్యాయంగా ముగ్గురూ కలిసి నా మీద కలబడ్డారు." నెత్తురు చొక్కాతో తుడుచుకుంటూ అన్నాడు సుధీర్.

"ఇంక ఇక్కడ ఉండకు. ఇంటి కెళ్ళిపో! దెబ్బలు బాగా తగిలాయి" అన్నాడు జైహింద్‌బాబు.

సుధీర్‌లో భయం ఇంకా తగ్గలేదు.

"నువ్వు వస్తావా?" బెదురుతూ ప్రాధేయ పడుతున్నట్లు అడిగాడు.

"వస్తాను పద!" అని బయలుదేరాడు జైహింద్‌బాబు.

సుధీర్‌ది పెద్ద సంపన్న కుటుంబమూ కాదు, అంత లేని కుటుంబమూ కాదు. అతని తండ్రి పోస్ట్‌మాస్టర్. తల్లి కూడా ఏదో ఆఫీసులో టైపిస్ట్‌గా పని చేస్తోంది.

సుధీర్ కాక ఇంకా ఇద్దరు పిల్లలున్నారు వాళ్ళకి. ఒకడు సుధీర్ కంటె పెద్దవాడు. మరొక అమ్మాయి సుధీర్ కంటె చిన్నది.

రెండు గదులూ, ఒక వంటిల్లూ, వున్న చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు.

సుధీర్ ఇంటికి రాగానే తల్లి హడిలిపోయి "ఏమిటిరా? ఏమిటా దెబ్బలు?" అని అడిగింది.

సుధీర్ కూడా ఉన్న జైహింద్‌బాబుని ఒక్కసారి చూపి "కూచో! ఏం జరిగింది?" అని అడిగింది.

ఆవిడ కూచోమనడం వల్ల అక్కడి కుర్చీలో కూచుని— "సుధీర్‌ని ముగ్గురు అబ్బాయిలు కొట్టారు. నేను కలియబడి విడిపిం చాను" అన్నాడు జైహింద్‌బాబు గర్వంగా.

"అయ్యయ్యో! అనవసరంగా కొట్లాటల్లోకి ఎందుకు దిగావురా?...."

"వాళ్ళు నా పెన్సిల్ లాక్కున్నారు-ఇయ్యమంటే, ఇవ్వమని అంటున్నారు. మళ్ళీ నా పెన్సిల్ నేను లాక్కోబోతే, దెబ్బలాటలోకి దిగారు."

"వెధవ పెన్సిల్! దాని కోసం దెబ్బలాటల్లోకి దిగారా?"

"ఇప్పుడిలాగే అంటావు. తీరా 'నా పెన్సిల్ వాళ్ళు లాగేసుకున్నారు - కొత్త పెన్సిల్ కొనియ్య'మంటే 'వెధవా! రోజుకొక పెన్సిల్ కొనమంటావా?' అని తిట్టవూ?"

"చాల్లే! మాటలు నేర్చావు" అని కొడుకుని కసురుకుని,

"కాఫీ త్రాగుతావా?" అని జైహింద్‌బాబుని అడిగింది తల్లి.

వచ్చీ రాని వయసులో ఉన్న జైహింద్‌బాబు ఉత్సాహంగా తల ఊపాడు.

సుధీర్ తల్లి ముందు తడిగుడ్డతో అతని గాయాలన్నీ తుడిచి అయోడిన్ రాసి, సుధీర్‌కీ, జైహింద్‌బాబుకీ కాఫీ ఇచ్చింది.

జైహింద్‌బాబు కాఫీ తాగేసి సుధీర్‌లాగే కప్పు కింద పెట్టేసి "వస్తానండీ!" అని బయటికి వచ్చేశాడు.

కొంచెం దూరమైనా రాకుండానే తన టిఫిన్ డబ్బా అక్కడ మరిచిపోయినట్లు చూసుకుని మళ్ళీ వెనక్కి వచ్చాడు.

లోపలినుంచి తన పేరు వినిపించడంతో గుమ్మం దగ్గిరే ఆగిపోయాడు.

"ఏమిటీ? వాడు కూలివాడి కొడుకా? వాడి తల్లి పాచి పని చేసుకునే మనిషా? ఆ సంగతి నాకు ముందే ఎందుకు చెప్పలేదూ?"

కోపంగా అడుగుతోంది సుధీర్ తల్లి. ఆవిడ కంఠంలో అసహ్యం, చీదరింపు స్పష్టంగా ధ్వనిస్తున్నాయి.

"జైహింద్‌బాబు మంచివాడు." బెదురుతూ అన్నాడు.

"మంచి! గెడ మంచి! ఇలాటి అడ్డమైన వెధవలతో తిరుగు,



నీ పని చెప్తాను. ఛీ! ఛీ! ఆ వెధవని మనింట్లో కుర్చీలో కూచోబెట్టాను నీతో సమంగా మన కప్పులో కాఫీ యిచ్చాను. ఆ కూలి వెధవ తాగిన కాఫీ కప్పు నేను స్వయంగా కడిగాను-నా కర్మ! ఆ వెధవ కెంత పొగరో చూడు! 'అమ్మగారూ! నా కప్పు నేను కడుక్కుంటాను' అనైనా అనలేదు. దర్జాగా టీ తాగేసి, కప్పు క్రింద పెట్టేసి వెళ్ళిపోయాడు, కలెక్టర్‌లాగా...."

ఇంక చాటుగా నిలబడి వినలేక పోయాడు జైహింద్‌బాబు. చటుక్కున లోపలికి వచ్చేశాడు.

సుధీర్ తల్లి నోరు టక్కున మూత పడింది. సుధీర్ ముఖం పాలిపోయింది.

"నా టిఫిన్ డబ్బా మరిచిపోయాను" అని ఏదో మహాపరాధం చేసిన వాడిలా తల వంచుకుని టిఫిన్ డబ్బా తీసుకుని గబగబ ఇవతలకు వచ్చేశాడు.

ఆ క్షణంలోనే అతని వయసు ఒక్కసారిగా ఒక దశాబ్దం పెరిగిపోయింది.

తన కొడుక్కి దెబ్బలు తగలకుండా కాపాడి ఇంటికి తీసుకొచ్చినందుకు ఆ తల్లి కృతజ్ఞత చూపించింది మొదట! కానీ తనెవరో తెలుసుకోగానే 'కూలి వెధవ' అని చీదరించుకోకుండా ఆ కృతజ్ఞత కూడా అడ్డుకోలేక పోయింది. తన కొడుకుతో కలిసి ఒకే స్కూల్లో, ఒకే క్లాసులో చదువుతోన్న వ్యక్తి తమ ఇంటికి వచ్చి తమతోపాటు కుర్చీలో కూచుంటే సహించలేక పోయింది ఆ తల్లి మనసు.

అంతకు ముందు ఏనాడూ ఆలోచనలోకి రాని విషయాలు ఒక్కసారిగా మనసును చుట్టుముట్టి అల్లకల్లోలం చేయసాగాయి— ఎదిగీ, ఎదగని ఆ పసివాణ్ణి.

చీదరింపుగా ఆ తల్లి అన్న 'కూలి వెధవ!' అన్నమాట అతనిని వెన్నాడి వెన్నాడి వేధించసాగింది.

ఆ మరునాడు బడికి వచ్చి సుధీర్‌ని పలకరించకుండానే తన

స్థానంలో తను కూచున్నాడు. సుధీర్ పలకరించబోయినా వినిపించు పించుకో లేదు. లంచ్ టైంలో సుధీర్ తను తెచ్చుకున్నది పెట్టబోతే తీసుకోలేదు.

ఆ మరునాడు సాయంత్రం బడి వదిలేసిన తరువాత సుధీర్ తన గుప్పిట్లో రహస్యంగా ఏదో పట్టుకుని "నీకోసం మంచి బహు మతి తెచ్చాను. చాలా మంచి బహుమతి!" అన్నాడు.

ఆ వయసుకు సహజమైన కుతూహలంతో "ఏమిటది?" అని అడిగేశాడు జై హింద్.

"నువ్వు నా జట్టు ఉంటానంటే, చెపుతాను."

జై హింద్‌బాబు మాట్లాడలేదు.

"జై హింద్ బాబూ! నామీద కోపం తెచ్చుకోకు - మా అమ్మ తిడితే నన్నేం చెయ్యమంటావు చెప్పు? మీ అమ్మ తిడుతుందనుకో! నువ్వెదిరించగలవా చెప్పు!"

"మా అమ్మ తిట్టదు!"

"తిట్టదూ? ఎప్పుడూ తిట్టదూ?"

"తిట్టదు-అమ్మెందుకు తిడుతుంది?"

"నేను మీ ఇంటికి రానా?"

"రా!"

"ఇది నువ్వు తీసుకుంటావా? ఆంజనేయస్వామి తాయెత్తు- మా అత్తయ్య తెచ్చింది. ఇది మెళ్ళో వేసుకుంటే ఆంజనేయస్వామి మననెప్పుడూ కాపాడతాట్ట! మా అత్తయ్య నా మెళ్ళో వేసింది-నేను నీకోసం కూడా అడిగి తెచ్చాను."

"నాకెందుకూ? నా మెళ్ళో మైసమ్మ తాయెత్తు ఉంది."

"మీ దేవుడు చిన్న దేవుడు-మా దేవుడు గొప్ప దేవుడు...."

"ఏమిటి? చివరకు దేవుడి విషయంలో కూడా మా దేవుడు చిన్న దేవుడేనా? నీ తాయెత్తు నాకేం అక్కర్లేదు."



సుధీర్ చిన్న బుచ్చుకున్నాడు. అతని కళ్ళలో నీళ్ళు తిరి గాయి....

"మా అత్తయ్యని ఎంతో బ్రతిమాలి బ్రతిమాలి తెచ్చాను, నీకోసం...." కష్టంగా అన్నాడు.

జై హింద్ బాబు తన నెదిరించిన వాళ్ళతో ఎంతైనా పోట్లాడ గలడు. కానీ, బేలతనానికీ, కన్నీళ్ళకూ లొంగిపోతాడు. ముఖ్యంగా తనపై అభిమానం చూపించే వ్యక్తిని అతడు అసహ్యించుకోలేడు.

"అయితే ఇయ్యి" అని చెయ్యి జాపాడు.

సుధీర్ పరమానందంగా ఆ తాయెత్తు తనే జై హింద్ బాబు మెళ్ళో కట్టాడు. జై హింద్ బాబు గుండెల మీద పైన నిలిచిన ఆంజనేయస్వామిని, క్రిందకు జారిన మైసమ్మని వెర్రిగా, బేలగా చూసింది.

"మీ ఇంటికి రానా?" మళ్ళీ అడిగాడు సుధీర్.

"రా!" అన్నాడు జై హింద్ బాబు.

తీరా ఆ గుడిసెల దగ్గరకు వచ్చాక ఎందుకొచ్చానా అని పశ్చా త్తాప పడ్డాడు సుధీర్. శుచీ శుభ్రం లేని ఆ గుడిసెల చుట్టూ పేరు కున్న దుర్గంధం అతడు భరించలేక పోయాడు. దిశ మొలలతో ఉన్న పిల్లల్ని చూడలేక పోయాడు.

జై హింద్ బాబు తమ గుడిసె చూపించి "రా!" అన్నాడు లోపలికి ఆహ్వానిస్తూ.

సుధీర్ ఆ గుడిసె లోపలికి అడుగు పెట్టలేక పోయాడు.

"నేను వెళ్తాను" అన్నాడు.

జై హింద్ బాబు అర్థం చేసుకున్నాడు. అతడికి సుధీర్ మీద కోపం రాలేదు. సుధీర్ అవస్థ చూసి జాలి కలిగింది.

"పద! అక్కడిదాకా వస్తాను" అని సుధీర్‌తో కలిసి తనూ బయలుదేరాడు.

సుధీర్ కొంచెం తటపటయిస్తూ "నేను మీ ఇంటికి వచ్చినట్టు మా అమ్మకి చెప్పవుగా?" అన్నాడు భయంగా.

జై హింద్‌బాబు నవ్వి "అది అసంభవం!" అన్నాడు.

"ఎందుకని?"

"ఇంక నేను మీ యింటికి రానుగా"

సుధీర్ తల వంచుకున్నాడు. తన ఇంటికి రమ్మని బలవంతం చెయ్యలేదు. ఆ 'కూలి వెధవ'ని మళ్ళీ ఇంటికి తీసుకొస్తే వీపు చిట్లగొడతానంది తల్లి. 'వాడితో స్నేహం చేశావంటే కాళ్ళు విరగ్గొడతా'నని బెదిరించింది. అలా బెదిరించిన తరువాతే జై హింద్‌బాబు స్నేహం ఎంత గొప్పదో అర్థమయింది సుధీర్‌కి. అయినా అతని సంకెళ్ళు అతనికున్నాయి. వాటిని అతనెలా ఛేదించుకోగలడు?

ఈ సంఘటన తరువాత మరింత పెరిగాడు జై హింద్‌బాబు. అతనికింకా అనేక విషయాలు అర్థం కాసాగాయి. కానీ, సుధీర్ అభిమానంగా తన చేతులతో కట్టిన తాయెత్తును మాత్రం అలాగే అప్యాయంగా గుండెల మీద దాచుకున్నాడు.

# 3

"అత్తా! అరిసెలు తెచ్చాను, బావ కోసం...." అంటూ వచ్చింది చంద్రి, చేతిలో చిన్న గిన్నెలో అరిసెలు పట్టుకుని.

అన్నమ్మ నవ్వి "అయితే, అరిసెలన్నీ బావకే నేంటీ! మాకు లేవా?" అంది.

చంద్రి సిగ్గుపడి మాట్లాడలేదు. చంద్రిని చిన్నతనంలోనే బళ్ళో వెయ్యలేదు. అంచేత చదువుతున్నది ఏదో క్లాసే అయినా అది ఓణీలు వేసుకునే వయసులోకి వచ్చేసింది.

అన్నమ్మ చంద్రి చేతిలో గిన్నె అందుకుని చంద్రి బుగ్గ చిదిమి

శ్రీ సిద్ధార్థ బుక్ పాయింట్,
[illegible]ఖాన్ పేట - నెల్లూరు-1.



ముద్దుచేసి, "వరస కాకపోయిందే! వరసయితే మీ అమ్మని బతిమాలి బతిమాలి నిన్ను నా కొడుక్కి కట్టుకునే దాన్ని...." అంది.

చంద్రి ముఖం ఇంతలో వికసించి అంతలో వడిలిపోయింది.

అటు అన్నమ్మా, నాగమ్మా ఇద్దరూ రోజుకి రెండుసార్లైనా చంద్రినీ, జై హింద్‌బాబునీ భార్యాభర్తలుగా ఊహిస్తూ మాట్లాడక మానరు. అంతలో వరస లేదని గుర్తు చేసుకోక మానరు. ఆ మాటలు పిల్లల ఎదురుగా మాట్లాడకూడదనే జ్ఞానం వాళ్ళకి లేదు....

ఆ మాటలన్నీ వింటోన్న చంద్రి, జై హింద్‌బాబుల మనసుల్లో వాళ్ళకు తెలియకుండానే ఏవో అల్లిబిల్లిగా ఆలోచనలు అల్లుకునేవి. 'వరస కాదు—' అనే మాట మాత్రం వాళ్ళ గుండెమీద బండలాగే పడేది. ఆ సంఘం ఏదైనా ఆమోదిస్తుంది కాని వరసకాని వివాహాన్ని మాత్రం ఆమోదించదు.

"బావ నాకు పాఠాలు చెపుతాడు కదత్తా! బావ కోసం తేవద్దా నేను?" అంది అమాయకంగా చంద్రి.

ఆ కుటుంబాల మధ్య పెద్ద అరమరికలు లేవు. లేనిపోని నిషేధాలూ లేవు. అటు చంద్రీ, ఇటు జై హింద్‌బాబూ ఇద్దరూ చదువుకోవటంతో, చంద్రి "బావ చేత పాఠాలు చెప్పించుకుంటాను" అని జై హింద్‌బాబు దగ్గిర చేరేది. పెద్దవాళ్ళు ఏమీ అనేవారు కాదు సరి కదా, బుడ్డిదీపం వెలుగులో చదువుకునే ఆ ఇద్దర్నీ ఏదో అపూర్వ దృశ్యం చూస్తున్నట్లు చూసేవారు.

అన్నమ్మ చంద్రిని వాత్సల్యంగా చూస్తూ "గమ్మత్తుకన్నానే! ఉడుక్కోకు! అరిసెలెందుకు చేసింది మీ అమ్మ?" అంది.

"ఊర్కెనే! నేను అడిగాను...." ముద్దు ముద్దుగా చెప్పింది చంద్రి.

ఎంత అణచుకున్నా అన్నమ్మ గుండెలను చీల్చుకుని ఒక్క నిట్టూర్పు బయట పడింది. అన్నమ్మ కుటుంబం కంటె నాగమ్మ కుటుంబం పెద్ద గొప్పదేం కాదు. అయినా కూతురు కోరినంత

మాత్రాన నాగమ్మ అరిసెలు వండగలిగింది. ఏ పూటకా పూట ఎలా గడుస్తుందా, అని దిగులుతో గడుపుతోంది తను. తన మొగుడు తాగుబోతు. సంపాదించింది ఇంట్లో ఇవ్వడు-తాగి వస్తాడు-ఎదురు తంతాడు-అప్పుడప్పుడు తను దాచింది కూడా ఎత్తుకు పోతుంటాడు. ఇక తన గతి ఇంతే! తన సంసారానికి విముక్తి లేదు.

జై హింద్ బాబు వయసుకి మించి ఎదిగి పోయాడు. బడి నుంచి ఇంటికి రాగానే అందరిలా ఆటలకి వెళ్ళటం లేదు. తల్లినడిగి డబ్బులు సంపాదించి గాలిపటాలు కొని మూరు బేరానికి తమ గుడిసెలలో పిల్లలకే అమ్ముతున్నాడు.

అలా గాలిపటాలు అమ్మి ఇంటి కొచ్చిన జై హింద్ బాబు చంద్రిని చూసి ఉత్సాహంతో "చంద్రి వచ్చిందే! నాకేదో తెచ్చే ఉంటది" అన్నాడు.

"అవును-అరిసెలు తెచ్చాను."

గిన్నెలోంచి అరెసెలు తీసి ఒకటి తనే అందించింది. అది తిని "బాగుంది-చేపలు పడదాం! వస్తావా?" అన్నాడు.

అక్కడికి కొంచెం దూరంగా చిన్న చెరువులాంటిది ఉంది. ఎండాకాలంలో ఎండిపోతుందికాని, వానాకాలంలోనూ, చలికాలంలోనూ కూడా నీళ్ళు ఉంటాయి. అప్పుడప్పుడు ఆ గుడిసెల్లో పిల్లలు ఆ చెరువులో చేపలు పడుతూ ఉంటారు. మిలిటరీ ఆఫీసర్లు చూస్తే తిడుతూ ఉంటారు. జై హింద్ బాబు రమ్మంటే చంద్రికూడా వచ్చింది కొన్నిసార్లు.

కానీ, ఇప్పుడు మాత్రం సిగ్గుపడిపోతూ "చేపలు పట్టేదానికా నేను రాను బాబూ?" అంది.

"ఏం?"

కొడుకు అమాయకత్వానికి నవ్వుకుంటూ అన్నమ్మ "అదెట్లా వొస్తాదిరా? పెద్దదయిందిగా?" అంది.



చంద్రిని చిత్రంగా చూశాడు జై హింద్ బాబు. అది సిగ్గుపడి పారిపోయింది.

ఆ రోజు మొదటిసారిగా మరో పెద్దరికం కూడా జై హింద్ బాబు అనుభవించాడు.

అతని మనసు చిత్రమైన మాధుర్యంతో నిండిపోయింది. "అమ్మా! నీ దగ్గిర దాచుకున్న డబ్బులియ్యి-చెప్పులు కొనుక్కుంటాను." అన్నాడు.

ఒక్క అకు చెప్పులజత కొనుక్కోవాలని ఎన్నాళ్ళుగానో కలలు కంటున్నాడు జై హింద్ బాబు. సుధీర్ కొనుక్కున్న లాంటి చెప్పులు కొనుక్కోవాలని అతని ఆశ. ఆ చెప్పులు పన్నెండు రూపాలని చెప్పాడు సుధీర్. "చవకరకంవి! రోజూ తొడుక్కోటానికనకుంది మా అమ్మ. మంచివి కూడా ఇంకో జత ఉన్నాయి" అని చెప్పాడు.

చవకంటే పన్నెండు రూపాయలా? చాలా ఖరీదు అనిపించింది జై హింద్ బాబుకి. అప్పటికే అతను ఇంటికి కాపలసిన బజారు పనులన్నీ చేస్తున్నాడు. వస్తువుల ధరలు-బేరసారాలూ అతనికి తెలుసు.

"అంతకంటే చవకలో రావా? మూడు రూపాయలకూ, నాలుగు రూపాయలకూ వస్తాయిగా!"

"ఛ! రోడ్డుమీదవి! ఎందుకవి? ఇవాళ తొడుక్కుంటే రేపటికి చిరిగిపోతాయి. లేకపోతే ఎవరో విప్పి పారేసిన పాతచెప్పులు రిపేర్ చేసినవి కొనుక్కోవాలి. అవీ అంతే! పాతడొక్కులు.

సుధీర్ మాటలు నచ్చాయి జై హింద్ బాబుకి. అప్పటినుండీ ఎలాగైనా పన్నెండు రూపాయల చెప్పులు కొనుక్కోవాలని భగీరథ ప్రయత్నం చెయ్యసాగాడు. అతి కష్టంమీద డబ్బు పోగుచేసుకుంటూ తల్లిదగ్గర దాస్తున్నాడు. ఎప్పటికప్పుడు ఎంతపోగయిందో లెక్క చూసుకుంటున్నాడు. ఆ రోజుతో పన్నెండు రూపాయలూ

పోగయ్యాయని లెక్కచూసుకుని పరమానందంతో తల్లిని డబ్బ గాడు.

పాత ఇనప్పెట్టిలో అడుగున దాచిన కర్రపెట్టి తెరిచిం అన్నమ్మ. నిర్ఘాంతపోయి నిలబడిపోయింది.

అమ్మా? డబ్బు!" అంటూ తల్లి దగ్గిరకు వచ్చిన జైహిం బాబు తల్లి ముఖం చూసి ఏమీ మాట్లాడకుండా నిలబడిపోయాడు అతనికి సంగతి అర్థమయిపోయింది.

తను చెమటోడ్చి కూడబెట్టుకున్న డబ్బు....తల్లి ఇంట్లో అవసరాలకు కూడా వాడకుండా జాగ్రత్త పెట్టుకున్న డబ్బు తం తీసికెళ్ళి పోయాడు. అంతా ఖర్చుపెట్టి తప్పతాగి పశువులా ఇం కొస్తాడు తల్లిని బాదటానికి.

అన్నమ్మ కింద కూలబడి ఏడ్చేసింది. ఏడుపువిని బ దుకాణం వదిలి సుందరీబాయి కూడా వచ్చి తల్లి పక్కన కూలబ ఏడవటం మొదలుపెట్టింది. అప్పుడే తల్లిబదులు పనిలోకి వెళ్ళివచ్చిన రత్న ఏమిటో ఎందుకో తెలియకుండానే తనూ ఏడుపు మొద పెట్టింది.

అలా ఏడుస్తున్న తల్లినీ, చెల్లెళ్ళనూ చూడలేకపోయాడు జైహింద్‌బాబు. ఈ శోకాలనుండి తమ కుటుంబానికి....ఇంకా త లాంటి అనేక కుటుంబాలకు విముక్తిలేదా? అనిపించింది.

"ఏడవకమ్మా! ఇప్పుడు నాకు చెప్పులు లేకపోతేనేం?" అన్నాడు లోపలిబాధ దిగమింగుకుంటూ.

ఆ మాటలు విని మరింత ఏడ్చింది అన్నమ్మ. ఆ చెప్పు కోసం జైహింద్‌బాబు ఎంతగా ఆశపడ్డాడో ఆ తల్లికి తెలుసు.

కాస్త పెద్దదయిన రత్నమ్మ విషయం అర్థం చేసుకుంది.

"ఒరే! అన్నయ్యా! దిగులుపడబోకురా! పైనెల అమ్మగారు



జీతండబ్బు లియ్యగానే అట్నించి అటేపోయి నీకు చెప్పులట్టుకొస్తా...." అంది.

జైహింద్‌బాబు చెల్లెల్ని జాలిగా చూశాడు. ఇదే తమకు మిగిలిన అపురూప సంపద. ఒకరిపై మరొకరు చూపించుకోగలిగే ప్రేమాభిమానాలు.

ఎలాగైనా చదువుకుని పైకి రావాలని పట్టుదలగా చదువుతున్నాడు జైహింద్‌బాబు.

ఆ పై నెల నిజంగానే అన్నమ్మ కొడుకుచేతిలో పన్నెండు రూపాయలు పెట్టి "జయన్ చెప్పులు కొనుక్కోరా?" అంది.

తల్లి ముఖం చూసేసరికి చెప్పులు కొనుక్కోగలుగు తున్నానన్న ఆనందం ఏమీ కలగలేదు జైహింద్‌బాబుకి. ఆ డబ్బుదాచి తనకియ్యడానికి తల్లి ఎంత అవస్థపడిందోనన్న బాధే మిగిలింది.

"వద్దమ్మా! ఇప్పుడు చెప్పులు లేకపోతేనేంటి? ఎప్పుడో కొనచ్చులే!" అన్నాడు.

అన్నమ్మ ఒప్పుకోలేదు. "అట్టా కుదర్సురా! పోయి కొనుక్కురా! ఈ ఇబ్బందులు ఒకనాటితో తీరేయికావు. జయన్! నువ్వు కొనకపోతే నా మనసుకి కష్టంవేస్తాదిరా."

ఇంక కాదనలేకపోయాడు జైహింద్‌బాబు. వెళ్ళి చెప్పులు కొనుక్కొచ్చాడు. కానీ, ఆరు రూపాయలవే కొన్నాడు. మిగిలిన ఆరు రూపాయలూ తల్లికి తెలియకుండా రహస్యంగా తనదగ్గరే దాచాడు. ఆ డబ్బుపైన ఇంకా పోగుచేసి తల్లికి చీర కొనాలనుకున్నాడు.

జైహింద్‌బాబు కొనుక్కున్న చెప్పులను తనివితీరా తృప్తిగా చూసింది అన్నమ్మ. అన్నమ్మకీ, ఇంకా అక్కడి వాళ్ళందరికీ 'జైహింద్' అని సరిగా పలకటం రాదు. అంచేత వాళ్ళందరూ అతణ్ణి 'జయన్' అనే అంటారు.

"జయన్! నీ కాళ్ళకీ సెప్పులు సానా బాగున్నాయ్‌రా!" అంది మెరుస్తున్న కళ్ళతో.

తన కాళ్ళకున్న చెప్పులకంటే తల్లి కళ్ళలో కనిపించిన మెరుపు ఎంతో సంతృప్తినిచ్చింది జైహింద్‌బాబుకి. ఈ తల్లి రుణం ఎన్ని జన్మలకైనా తీర్చుకోగలనా? అనుకున్నాడు.

వాళ్ళలో ఒకడైన సింహాచలం చాకలి లచ్చమ్మను పెళ్ళి చేసుకొచ్చేశాడు. అందరూ గుండె బాదుకున్నారు. పెద్ద గుర్రెర్ర చేశాడు. వాళ్ళిద్దర్నీ ఎవరు సంఘంలో కలవనివ్వలేదు.

వాళ్ళుండేది కంటోన్‌మెంట్ ప్రదేశం కావటంవల్ల అక్కడ పంపులుకాని, కరెంట్‌కాని లేవు. ఏదైనా కూరగాయల తోటలేసే ఉద్దేశంతో, ఎప్పుడో ఆ స్థలం ఆసామీ ఒక మోటబావి తవ్వించి, దానికి సరిగా గట్టూ అదీ కట్టించకుండానే వదిలేశాడు. అక్కడి వాళ్ళందరూ ఆ బావిలోంచే అవసరాలకు నీళ్ళు తెచ్చుకుంటారు.

ఆ బావి దగ్గిరకు వీళ్ళిద్దరినీ రానియ్యలేదు. ఎవరో అగ్ర వర్గాలవాళ్ళు తమ బావిదగ్గిరకు రానీయకపోవటంకాదు-తమలో ఒక డైన వ్యక్తినే తమ కట్టుతప్పి స్వతంత్రంగా ప్రవర్తించినందుకు బావిదగ్గిరకు రానియ్యలేదు. ఒక్కరూ వీళ్ళ గుడిసెకు రారు. వీళ్ళని తమ గుడిసెలకు రానియ్యరు, మంచికీ చెడ్డకీ దేనికీ ఆదుకోరు.

ఇదంతా చూసి నిర్ఘాంతపోయాడు జైహింద్‌బాబు. ఈ ఆధు నిక యుగంలో....ఎంతో ప్రగతి సాధించామనుకుంటూన్న ఈనాడే. మహానగరంలో జరుగుతోన్న తతంగమిది!

"ఏమిటమ్మా! ఇదంతా? లచ్చమ్మ, సింహాచలం ఏం తప్పు చేశారని? వాళ్ళని మీరంతా ఎందుకింత వెలేసినట్లు చూస్తున్నారు?" అన్నాడు తల్లితో.

అన్నమ్మ గుండె బాదుకుని "హమ్మో! పెద్దమాట తప్పితే ఇంకేమన్నా వుందా? ఆళ్ళు తప్పుకట్టేస్తే పోలా?" అంది, తప్పంతా వాళ్ళదేనని మనసారా నమ్ముతూ.



"ఏం తప్పు చేశారని తప్పు కట్టాలి?"

"అదేంటి? కట్టుతప్పి ఈడు చాకలిదాన్ని పెళ్ళాడలా?" కొడుకుని అమాయకుణ్ణి చూసినట్లు చూస్తూ అంది అన్నమ్మ.

"ఏం పెళ్ళి చేసుకుంటే? ఇద్దరికి ఇష్టమయింది, చేసుకున్నారు. అందుకు పెద్దకు తప్పుకట్టటందేనికి! వీళ్ళంతా ఆ డబ్బుతో తాగి తందనాలాడితేకాని, సింహాచలం చేసిన తప్పుపోదా?"

కోపంగా అంటున్న కొడుకుని వింతగా, భయంగా చూసింది అన్నమ్మ.

"సాల్లే ఊరుకో! కట్టుదాటితే ఊరుకుంటారా? పెద్దమాట కాదని బ్రతగ్గలమా?" అని కసిరింది.

లచ్చమ్మ, సింహచలం ఈ తాకిడికి తట్టుకోలేకపోయారు. తప్పు కట్టడానికే సిద్దమయ్యారు. పెద్ద రెండువందలు తప్పుకట్టమ న్నాడు. సింహాచలం కాళ్ళావేళ్ళాపడితే, నూటయాభై కట్టమన్నాడు. అందరూ పెద్ద ఔదార్యాన్ని పొగిడారు. సింహాచలం అప్పుచేసి నూట యాభై రూపాయలు తప్పుకట్టాడు. ఆ డబ్బుతో సింహాచలంతోసహా అందరూ తాగి తందనాలాడారు.

ఆ దృశ్యాన్ని దూరంనుంచి చూసిన జైహింద్‌బాబు, చంద్రి ఒకరి నొకరు భయంగా చూసుకున్నారు.

## 4

వెర్రాకాలి వరకు పంచెకట్టి, వదులచేతుల చొక్కాతొడిగి, భుజాన్న పెద్ద సంచీ పట్టుకుని వెంకడు రాజయ్య గుడిసె ముందు నిలబడ్డాడు.

నాగమ్మ బయటికొచ్చి "ఎవరు నువ్వు?" అంది.

వెంకడు భయంగా "అయ్య....రాజయ్యున్నాడా?" అన్నాడు.

రాజయ్య గుడిసెలోనే వున్నాడు. తన పేరువిని భయటకు వచ్చాడు.

వేనే రాజయ్యని! ఏం కావాల నీకు." అన్నాడు.

"నేను నీ కొడుకుని-వెంకణ్ణి...." అన్నాడు వెంకడు ఏడుపు గొంతుతో.

"ఏంటి?" తెల్లబోయి చూశాడు రాజయ్య. నాగమ్మ ముఖంలో అప్పుడే రంగులు మారుతున్నాయి.

"అమ్మ చచ్చిపోనాది!" ఏడుపు మొదలు పెట్టబోయాడు వెంకడు.

రాజయ్య "సాల్లే!" అని విసుక్కుని "మీ తాత ఏమయి పోయినాడు?" అన్నాడు.

"తాత కూడా చచ్చిపోనాడు. నన్ను నీకాడకి పొమ్మన్నాడు. నువ్వీడున్నావని తాత కెవరో సెప్పారంట!"

"సర్లే! లోపలికిరా?" అన్నాడు రాజయ్య.

తలవంచుకుని లోపలికి నడిచాడు వెంకడు.

"ఇదో కొత్త తగలాటమా?" అని గింజుకుంది నాగమ్మ.

"ఊరుకోయ్యే! ఎవుడి నెవుడు సాకాల? ఆడి బతుదాడు బతుకుతాడు. మనతో వుంటాడు." కసిరాడు రాజయ్య.

రాజయ్య సాధారణంగా నాగమ్మను కసురుకోడు. ఆడింది ఆటగానే సాగనిస్తాడు. కానీ, ఎప్పుడైనా కసిరినప్పుడు నాగమ్మ తగ్గిపోతుంది. రాజయ్యకు మరీ కోపం తెప్పించకూడదని దానికి తెలుసు.

లోపలి కొచ్చాడు వెంకడు భయంగా-బెదురుగా తన కొత్త అన్నను కుతూహలంగా చూసింది చంద్రి.

"ఆ సంచీలో దేంటన్నా?" అంది.

'అన్నా' అనే పిలుపు ఎంతో తియ్యగా వినిపించింది వెంకడికి. ఇక్కడ తన చెల్లెలు తన్నంత తియ్యగా పిలుస్తుందని అతడు ఆశ పెట్టుకోలేదు.



శ్రీ సిద్ధార్థ బుక్ ...
... పేట - నెల్లూరు-1.

"అయ్యన్నీ మూలికలు. మా తాత మూలికల వయిద్దెం చేస్తాడుగద! అయ్యి! నాకూ వచ్చు వయిద్దెం. నీ కోసం దెచ్చినా ఇది...."

రంగు రంగుల పూసలదండ ఒకటి చంద్రికి అందించాడు. చంద్రి ఆప్యాయంగా అందుకుని "బాగుంది" అంది.

"యెండా? బంగారమా? యేంటి బాగుండాది నీకు?" అంది గులు ఈసడించుకుంటూ.

"వెండీ, బంగారం కొట్లల్లో దొరుకుతాయిలే అమ్మా? ఇది కావాలంటే దొరికేదికాదు. అన్న తేబట్టి దొరికింది."

వెంకడి ముఖం వికసించింది. వాడికి చంద్రి మాటలుపూర్తిగా అర్ధంకాలేదు. కానీ, చంద్రికి తనమీద ఉన్న అభిమానం మాత్రం అర్దమయింది.

ఆ ఇళ్ళలో ఊరకే కూచుంటే ఎవరికీ జరగదు. అంచేత అప్పుడే వెంకడు ఏం చెయ్యాలన్న ఆలోచన జరిగింది.

"నువ్వేం పని చేస్తావురా?" అన్నాడు రాజయ్య.

"వయిద్దెం తెలుసు. మూలికల వయిద్దెం-తాతకాక నేర్చుకున్నా...."

"పోపోరా! ఈడ మూలికల వయిద్దెం ఎవడికి కావాల? అందరికీ గోళీల మందులే కావాల. అయ్యేవాడతన్నారు. కూలి పనికి పోతావా! ఆడ ఏడనో రోడ్డేస్తన్నారంట...."

వెంకడు బిక్కముఖం వేసుకున్నాడు. "సిన్నప్పుడు దెబ్బ తాకి నా కాలు సొట్టపోయినా దయ్యా, కూలిపని సెయ్యలేను...."

"ఆ! కూకుని మింగుతావు!" అంది నాగమ్మ కల్పించుకుని.

"నువ్వూరుకోయే!" అని నాగమ్మని కసిరి "మరి నీ కేపని చేతనవుద్దిరా? నీ వయిద్దెం ఈడ పనికిరాదు" అన్నాడు రాజయ్య.

"తైలంపట్టించి వళ్ళు తోముతా! తాతకి తోమేవాడిని. నొప్పులన్ని తగ్గిపోతాయి...."

ఆ మాటలినగానే నాగమ్మ సంబరంగా "మా వరదయ్యగోరి కెప్పుడూ కీళ్ల నొప్పులే! వొళ్లు తోమేవోడు కావాలని ఇదవుతున్నార ఆడ కుదురుస్తాను అందాకా...." అంది.

అప్పటికి అంతకంటే చెయ్యగలిగినది లేదు గనుక రాజయ్య ఒప్పుకున్నాడు.

పాపం వెంకడు సహజంగా సాత్వికుడు. దానికి తోడు చిన్న తనంలోనే తనసూ తల్లినీ వదిలేసి మారుమనువు చేసుకున్న తండ్రి తనను ఆదరిస్తాడో లేదోనని భయపడుతూ వచ్చాడు. ఈ మాత్ర ఆశ్రయం దొరికితే ఎంత చాకిరీ చెయ్యటానికైనా అతడు సిద్ధమే

ఆ మరునాడే వెంకణ్ణి తనతోపాటు వెంటబెట్టుకెళ్ళింది నాగమ్మ.

వరదాచారికి దణ్ణపెట్టి "అయ్యగారూ! ఈడు మావోడే! చమురు రాసి వొళ్ళు బాగా మాలిస్ సేస్తాడు, నొప్పులన్నీ తగ్గిపోతాయి. ఏదొ మీకాళ్ళకాడ పడిఉండనీయండి!" అంది.

వరదాచారి ఘటికుడు. మహాలౌకికుడు. కొన్ని సంవత్సరాలుగా దేవుడికి అర్చకుడుగా ఉంటున్నందుకు దివ్యత్వం ఏ మాత్రము అందుకోకపోయినా, ఘటనా ఘటనాచాతుర్యం మాత్రం అబ్బింది. అంచేత అతడు వెంకణ్ణి వెంటనే అనుగ్రహించలేదు.

"ఇవాళ ఒకసారి తోమించుకుని చూస్తాను. నాకు నచ్చితే నెలజీతంమీద పెట్టుకుంటాను...." అన్నాడు.

"అట్టాగే అయ్యగారు!"అని వరదాచారికి దణ్ణంపెట్టి, వెంకణ్ణి పక్కకు పిలిచి,

"ఒరేయ్! యెంకా! ఇయ్యాల్టొక్కనాటికి బాగాతోమరా పనిలో కుదిరినాక అప్పుడప్పుడు బాగా తోమకపోయినా బాధలేదులే! అని సలహా ఇచ్చింది.

వెంకడు తలూపాడు. ప్రతిదానికీ తలూపటం వాడికి బాగా అలవాటైపోయింది.



ఆ రోజు వెంకడు వరదాచారి ఒంటికంతా బాగా నూనెరాసి మాలిష్ చేశాడు. వరదాచారి వెంకడ్ని మనసులో బాగా మెచ్చుకున్నాడు. పైకి మెచ్చుకోకూడదని అతనికి తెలుసు. తను మామూలుగా మాలిష్ చేసేవాణ్ణి పిలిపించుకుంటే వచ్చినట్టు రోజుకి రెండుమూడు ఇచ్చుకోవాలి. వీడినే నెలజీతానికి కుదుర్చుకుంటే మంచిది.

"ఆఁ ఏదో చేసాడు ఎంత యియ్యమంటావ్ నెలకి"

"మీరే సెప్పాలి! మే మే వడుగుతాం అయ్యగోరూ?...."

"నెలకి పదిరూపాయ లిస్తాను."

"అదేం టయ్యగోరూ! ఈ రోజుల్లో పదిరూపాయలకే మొస్తంది. పదిరూపాయలకోసం పనిలో కెవరొస్తారండీ!"

"ఎంతియ్యమంటావో చెప్పు."

"పాతిక రూపాయ లిప్పించండి!"

"అమ్మో! ఇరవై అయిదు రూపాయలా? ఆశకి అంతుం డాలే? ఎవడిస్తాడే నీకు పాతిక రూపాయలు, ఒకగంట పనికి?"

"పని గంటే కానియ్యండి అయ్యగోరూ, అందరికీ రాదు కదండీ! కుదరదంటే సెప్పండి. మరోకాడ చూసుకుంటాడు." వరదాచారి మెత్తబడుతున్నాడని గ్రహించిన నాగమ్మ గట్టిగా బేరానికి దిగింది.

వెంకడు ఒళ్ళు తోమినప్పటి హాయి మరిచిపోలేక పోతున్నాడు వరదాచారి. నాగమ్మ గయ్యాళితనం అతనికి తెలుసు. నిజంగానే వెంకణ్ణి మరోచోట కుదురుస్తుందేమోనని భయపడ్డాడు.

"సరేరా! ఇరవై ఇస్తాను. అంతకంటె ఇయ్యను" అన్నాడు తను బెదిరిస్తూ.

"సర్లేండి! యిరవై యిచ్చి ఓపూట అన్నం పెట్టండి. మీ కాడే ఉండి ఆ పనీ, ఈ పనీ సేస్తాడు."

ఈ ఏర్పాటు వరదాచార్యులికి బ్రహ్మాండంగా నచ్చింది. దేవుడి ప్రసాదం దండిగా లభించే ఆ ఇంట్లో తిండికేం తక్కువ?

వరదాచార్యునికి ఇద్దరు కూతుళ్ళున్నారు. ఇద్దరినీ కాన్వెంట్‌లో

చేర్పించాడు. వాళ్ళిద్దరినీ కాన్వెంట్ లో దింపి, తిరిగి తీసుకురావటానికి ఒక మనిషిని పెట్టుకోవాలని అనుకుంటున్నారు, వీడుంటే అందుకు పనికొస్తాడు? ఇంకా ఆ పనీ, ఈ పనీ చేయించుకోవచ్చును.

"ఇవాళనుంచే పనిలో ఉండనియ్యి. నమ్మకం ఉండాలి సుమా! నేను చాలా నిక్కచ్చి మనిషిని. ఏదైనా హెచ్చు తగ్గులు వస్తే ఊరు కోను."

"అదేంటండీ! మే మటువంటివాళ్ళం కాము. మావోడి నమ్మకం మీకే తెలుస్తాది" అంది నాగమ్మ.

ఆ రకంగా ఆ రోజునుంచే వెంకడు వరదాచార్యులుగా రింట్లో పనికి కుదిరిపోయాడు. నాదముని బయటికివచ్చి వెంకణ్ణి చూపి ఒళ్ళు తోముతావా? ఇహిహి; నాకు తోముతావా?" అన్నాడు.

వరదాచార్యులు గట్టిగా నవ్వి "పోరా వెర్రివెధవా? నీకు ఒళ్ళు తోమటానికి నౌకరు దేనికి? మీ ఆవిడ తోముతుందిలే!" అన్నాడు.

"ఇహిహి? నేను వెర్రివెధవని కదూ? అవును. నా కెందుకూ వళ్ళు తోమటం?" అని వెర్రినవ్వు నవ్వాడు నాదముని.

సొంత అన్నగారే తమ్ముణ్ణి వెర్రివెధవ అని ఈసడిస్తున్నాడు. పరాయివాళ్ళు అవహేళన చేస్తే ఆదుకోవలసిన వ్యక్తి తనే అపహ సిస్తున్నాడు. పాపం! ఆ అభాగ్యుడు మరింత మతిపోయి వెర్రిగా నవ్వుకుంటున్నాడు.

పొయ్యిముందు కూచుని వంటచేస్తున్న సరళ ఈ మాటలన్నీ వింది. పొయ్యిమీద ఉన్న అన్నంలాగే ఉడికిపోయింది సరళమనసు. ఎంతగా ఎన్నిసార్లు విన్నా, ఈ రకమైన మాటలు సరళ మనసును చిత్రవధ చెయ్యక మానవు.

"అక్కా! ఇవిగో కూరలు!"అంటూ కూరలసంచితో వచ్చి పార్థసారధి అక్క ముఖంలోకి చూస్తూ నిలబడిపోయాడు.

అక్క కళ్ళనుండి ధారలుగా కారుతోంది కన్నీరు. ఆ కన్నీరు పొగవల్ల వచ్చినది కాదు. పొయ్యి భగభగ మండుతోంది.... అక్క



కంట నీరు పెడుతుండగా చూడటానికి ఎంతగా అలవాటు పడినా, ఎప్పటికప్పుడే ఆ ముఖం సారధిని నిలువునా కాల్చేస్తుంది. ఏం చెయ్యగలదు? ఆ కన్నీటిని తుడవగలిగే శక్తి తనకులేదు.

తనకోసమే....తన బ్రతుకు చక్కబడుతుందన్న వృధా భ్రమతోనే తనఅక్క ఈ నరకంలోకి అడుగుపెట్టిందని సారధికి తెలుసు. ఎలాగైనా చదువుకుని ఏదో ఒక ఉద్యోగం చూసుకోగలిగితే అక్కని ఆదుకోగలడు-కానీ, ఎలా సాధ్యం అది?

ఒకవంక వయసు మించిపోయింది. మరొకవంక చదువుకునే అవకాశాలు ఏమాత్రం లేవు. తనంతట తను ఎలాగో సంపాదించి రాత్రిళ్ళు చదువుకునే పుస్తకాలవల్ల విజ్ఞానం వస్తుందేమో కాని, డిగ్రీ రాదుగా? జీవితంలో ఈ ఆర్థికసమస్య ఎంత భయంకరమైనది!

# 5

ఎప్పటిలా జబర్దస్తీగా పెట్టెలో బట్టలన్నీ ఇవతలకు లాగిపారేసి డబ్బుల కోసం వెతకసాగాడు కోటయ్య!

ఎప్పటిలా అన్నమ్మ కోటయ్యతో కలియబడి అతని ప్రయత్నాన్ని ఆటంకపరచటానికి ప్రయత్నించలేదు. చూస్తూ కూచుంది.

వెతికివెతికి విసిగిపోయాడు కోటయ్య. అతనికి నయాపైసా దొరకలేదు.

ఎప్పటిలా తనతో పోట్లాడకుండా మూల కూచుని తనను గుర్రుగా చూస్తున్న అన్నమ్మను చూస్తే అతనికేదో అనుమానం తోచింది. "డబ్బు లెయ్యే!" అని అరిచాడు.

"డబ్బులు! నువ్వు సంపాదించి పోగేసినయి మూలుగుతున్నయ్యి! ఇంటినిండా...."

"దొంగ లంజా! నోరు మూసుకొని యిస్తావా? యియ్యవా?"

"యెతుక్కుంటున్నావుగా! యెతుక్కో! దొరికినయ్యన్నీ పట్టుకుపో! ఏదీ దొరక్కపోతే నన్నమ్ముకో!"

విరగబడి నవ్వాడు కోటయ్య.

"విన్నమ్ముకుంటే యేటొస్తాదే! యేటుంది నీలో? నాలుగు బొమికలూ, ఆటిపైన తోలూ...."

కుతకుత లాడింది అన్నమ్మ....

"ముదనష్టపోడా! నీ మూలంగానే కాదంట్రా నే నిట్లా తగలడింది. బంగారంలాటి బతుకుని తాగుబోతు ముండాకొడుకువై బుగ్గి పేస్తున్నావు!"

"నోరు ముయ్యే! డబ్బెక్కడ దాచిపెట్టావే? మీ యమ్మగారి దగ్గరా?"

"డబ్బూలేదు. యేమీలేదు"

"యిస్తావా? లేదా?"

"లేదంటా ఉంటే నీక్కాదూ?"

కోటయ్య అన్నమ్మ జుట్టుపట్టుకుని వంగదీసి గుద్దుతూ "ఆ డబ్బు అట్టుకురా! లేకపోతే సంపేస్తాను" అని అరవసాగాడు.

"ఓరి సచ్చినోడా! నీ సేతులు కాలిపోనూ!" అని రాగాలు తీస్తూ అన్నమ్మ తప్పించుకోటానికి ప్రయత్నించ సాగింది.

పిల్లలు ముగ్గురూ భయభ్రాంతులై చూడసాగారు.

జైహింద్ బాబు ఇంక భరించలేక తండ్రి చెయ్యి పట్టుకుని "అమ్మని కొట్టావంటే ఊరుకోను. కొట్టకు" అన్నాడు కోపంగా.

నిర్ఘాంతపోయాడు కోటయ్య. తన కొడుకు తనకు ఎదురు తిరగటమా?

"యేంటిరా! వాగు మళ్ళీ...." అని అన్నమ్మను వదిలి జైహింద్ బాబుని చాచి లెంపకాయ కొట్టాడు.

బాధ భరించలేక "అమ్మా!" అని కెవ్వున కేక పెట్టాడు జైహింద్ బాబు.



అన్నమ్మ రివ్వున పోయి పొయ్యిలో మండుతున్న కొరకంచు చేత్తో పట్టుకుని నిలబడి,

"సచ్చినోడా! ఎవురి ఒంటిమీదనయినా మళ్ళీ చెయ్యేసినావంటే ఇదెట్టి కాల్చేస్తా!" అంది.

భయపడిపోయాడు కోటయ్య. అప్పటి అన్నమ్మ ముఖం చూస్తోంటే నిజంగా కాల్చేసేలాగనే ఉంది. పిల్లిలా బయటకుపోయాడు.

ఈ పరిణామానికి జైహింద్ బాబు చాలా ఆశ్చర్యపోయాడు. తనతల్లి ఇలా తనతండ్రిని ఎదిరించగలదని అతనెన్నడూ అనుకోలేదు.

"భలే అమ్మా! భలే బాగాచేశావు" అన్నాడు సంబరంగా.

కానీ ఈ పొగడ్తలకి అన్నమ్మ ఆనందించలేదు. కొరకంచు కిందపడేసి కుమిలి కుమిలి ఏడ్చింది.

తెల్లబోయాడు జైహింద్ బాబు. అతనికి మరొక విషయం అర్థమయింది, తలుచుకుంటే తన తల్లి తండ్రిని ఎదిరించగలదు....కానీ ఎదిరించలేదు. ఇన్నాళ్ళకు తనను కొడ్తూంటే చూడలేక ఎదిరించింది. అలా ఎదిరించినందుకు కుమిలిపోతోంది.

జైహింద్ బాబు పదోక్లాసులోకి వచ్చాడు. అతనికి లోకజ్ఞానం బాగా పెరిగింది. వయసుకు మించి అన్ని విషయాలూ అర్థం చేసుకోగలుగుతున్నాడు.

పదోక్లాసుతో మంచి ఉద్యోగమేదీ దొరకదు. కాలేజీలో చదవాలి. కాలేజిలో స్కాలర్‌షిప్ వస్తుందో? రాదో? ఒకవేళ వచ్చినా ముందు చేరి అప్లై చెయ్యాలికదా! అందుకు డబ్బుకావాలి, ఎలా పోగు చెయ్యడం?

పాపం! తల్లి రెక్కలు ముక్కలు చేసుకుని పని చేస్తోంది. రత్నమ్మకూడా మరో ఇల్లు చూసుకుంది. సుందరీబాయి చిన్నదయినా చాకచక్యంగా బల్లదుకాణం నడిపి కొంత సంపాదిస్తోంది. అయినా ఈ సంపాదనలు ఏ మూలకి?

మిలటరీ ఆఫీసర్లెవరయినా తనకేదైనా పనిస్తే బాగుండును. స్కూల్‌కి వెళ్ళివస్తోనే చెయ్యగలిగేపని ఏదైనా సరే! తనుచేస్తాడు.

ఆఫీసర్స్ క్వార్టర్స్ దగ్గరకు వెళ్ళి ఒక బంగళాముందు నిలబడ్డాడు. "భౌ" అంటూ మీదకు ఉరకబోయింది పులిలాంటి కుక్క.

అంతలో లోపలనుంచి ఆఫీసర్‌గారు వచ్చి కుక్కని పట్టుకుని "ఎవరు నువ్వు? ఏం కావాలి?" అని అడిగారు.

జైహింద్‌బాబు చేతులు కట్టుకుని "నేను పదోక్లాసు చదువుతున్నానండీ! కాలేజీలో చదువుకోవాలని ఉంది. డబ్బులేదు. ఇప్పటినుంచీ ఏదైనా పని చేసి డబ్బు కూడబెట్టుకోవాలని వుంది. మీరు ఏదైనా పని ఇప్పిస్తే...." అన్నాడు వినయంగా.

ఆ ఆఫీసర్‌గారితో పాటు మరొకాయన కూడా ఉన్నారు. ఆయన కుతూహలంగా "మీ అమ్మా, నాన్నా ఏం చేస్తుంటారు!" అన్నాడు.

జైహింద్ బాబు ఎక్కడికి వెళ్ళినా ఎదురయ్యే ప్రశ్న ఇదే! ఈ ప్రశ్నకు సమాధానం వినగానే అందరూ తనను చిన్నచూపు చూడటంకూడా జైహింద్‌బాబుకి కూడా బాగా అలవాటే! అయినా చేసేదేముంది? చెప్పాడు. కానీ ఆయన మిగిలినవాళ్ళలాగ ఈసడింపుగా చూడలేదు.

ఉత్సాహంతో ఆఫీసర్‌గారితో "చూశావా దయానంద్! రోజులు ఎలా మారుతున్నాయో! చూడు, మన కళ్ళముందు ఈ కూలివాళ్ళ అబ్బాయి చదువుకోసం ఎంత కష్టపడుతున్నాడో! పై చదువుల కోసం ఎంతగా ఆరాటపడిపోతున్నాడో! "తప్పదోయ్ చూస్తూఉండు కొద్దిరోజుల్లో మన సంఘమంతా మారిపోకపోతే అడుగు" అన్నాడు.

దయానంద్ నవ్వి "నీబోటి వాళ్ళంతా నడుంకట్టుకుని కృషి చేస్తున్నారుగా! ఏ మాత్రం మారుస్తారో చూస్తానులే!"

ఎక్కడో నూటికొక్కడు ఇలాటివాడు కనిపిస్తే అందరూ



మారిపోతా రనుకుంటున్నావు నువ్వు. ఈ సమాజం మారటానికి నీబోటివాళ్ళు ఇంకా ఎంతెంత తపస్సు చెయ్యాలో!" అన్నాడు.

ఆ సంభాషణ పూర్తిగా అర్థంకాలేదు జైహింద్‌బాబుకి. కానీ, తన అదృష్టవశాత్తూ మంచివాళ్ళ దగ్గరకే వచ్చాననీ, వాళ్ళిద్దరూకూడా తమబోటివాళ్ళని ఆదుకునే సహృదయులేనని అర్థమయింది.

"సారీ! నాదగ్గిరేం పనిలేదోయ్!" అన్నాడు దయానంద్.

ఈ సమాధానంతో నీరు కారిపోయాడు జైహింద్‌బాబు.

కానీ అవతల పెద్దమనిషి "నాదగ్గిర పనిచేస్తావా?" అన్నాడు.

"జైహింద్ బాబు ఉత్సాహంగా "చేస్తానండీ." అన్నాడు.

"మా ఇల్లు ఇక్కడికి కొంచెం దూరం!"

"పరవాలేదండీ! ఎంతదూరమైనా నడవగలను!"

"నీకు బూట్‌పాలిష్ చెయ్యడం వచ్చునా? తోటపని వచ్చునా?"

"ఏ పనైనా నేర్చుకోగలనండీ!"

"సరే! అయితే ఇవాళ నాతో రా! మా ఇల్లు చూపిస్తాను, నా బూట్స్ పాలిష్ చెయ్యి. మా ఇంటిముందున్న తోటపని చూసుకో! నెలకి ఇరవై కంటే ఎక్కువ ఇయ్యలేను."

పొంగిపోయాడు జైహింద్ బాబు. నెలకు ఇరవై. ఒక పదిహేను దాచుకున్నా తను కాలేజీలో చేరిపోగలడు.

"థేంక్యూ సర్! థేంక్యూ!" అని అతని పాదాలకు నమస్కారం చెయ్యబోయాడు.

ఆయన మెరుపులా వెనక్కి తగ్గి "ఛా! ఛా! ఇలాటి పనులు చెయ్యకు. నీ అంతవాడవి నువ్వు! కష్టపడుతున్నావు. సంపాదించుకుంటున్నావు. నా కెందుకు నమస్కారం చెయ్యాలి?" అన్నాడు.

తెల్లబోయి నిలబడ్డాడు జైహింద్‌బాబు. "నీ అంతవాడవు నువ్వు" ఈ మాట ఎంతోకొత్తగా వినిపించింది జైహింద్ బాబుకి. ఈ రకంగా తనతో పెద్దింటివాళ్ళెవరూ ఇంతకుముందు మాట్లాడలేదు.

ఆ మాటలు తలచుకొంటున్నకొద్దీ తనలో ఏదో క్రొత్తబలం, క్రొత్త ఆశ ప్రవేశించినట్లు అనిపించ సాగింది....

"రా! నా కారులో కూచో" అన్నాడు ఆయన, కారులో డ్రైవింగ్ సీట్‌లో కూర్చుంటూ....

"వద్దు లెండి! ఎక్కడో చెప్పండి. నడుచుకుంటూ వస్తాను" అన్నాడు జైహింద్ బాబు.

ఆయన నవ్వి "నడిచే సమయంలో నడవాలి! కారెక్క గలిగినప్పుడు ఎక్కాలి. నీ గొప్పతనం నడిచిరావడంలో లేదు. నడిచి వచ్చినా, కారెక్కినా రెండూ ఒకటే ననుకోగలగటంలో ఉంది. కారెక్కు" అన్నాడాయన తలుపుతెరిచి.

జైహింద్‌బాబు మరేం మాట్లాడకుండా కారెక్కి కూచున్నాడు. కారులో కూచోవడం ఒక కొత్త అనుభవం జైహింద్ బాబుకి. అంతకంటె కొత్త అనుభవం ఆయన మాటలు వినగలగటం.

ఆయనదగ్గిర పనిలో కుదిరాక చాలా విషయాలు తెలిశాయి జైహింద్‌బాబుకి.

తననంత ఆదరించి పని ఇచ్చినవ్యక్తి పేరుపొందిన లాయర్. క్రిమినల్ లాయర్‌గా ఆయనకు మంచిపేరుఉంది. దానికి తగిన రాబడీఉంది. ఆయనపేరు వ్యాసమూర్తి-అందరూ వ్యాస్ అని పిలుస్తారు.

ఆయనకు క్రిమినల్ లాయర్‌గా ఎంత పేరుందో, బీద సాదలను ఆదుకునే వ్యక్తిగా అంతపేరు ఉంది-డబ్బుకోసం ఏమాత్రం ఆశ పడకుండా కూలిజనంలో ఎవరికి అన్యాయం జరిగినా ఆదుకుని న్యాయం చేకూర్చటానికి సిద్ధంగా ఉంటాడు. అతని పేరుచెపితే, మిల్లు యజమానులకూ, భూకామందులకూ సింహస్వప్నం—

ఆయనకు తగిన మిత్రుడు మిలటరీ ఆఫీసర్ దయానంద్‌గారు సార్థక నామధేయుడే గాని వ్యాస్‌లో ఉన్నంత తీవ్రత ఆయనలో లేదు. బీదలంటే సానుభూతి ఉంది. కానీ ఎలాంటి పరిస్థితులకైనా ఎదు



ర్కొని న్యాయనికి కట్టుబడి వాళ్ళకు అండగా నిలబడే నిబ్బరంలేదు. లోలోపల మథనపడినా పరిస్థితులతో రాజీపడి పోతుంటాడు.

వ్యాస్‌గారి దగ్గిరపని దొరకటం తన పెద్ద అదృష్టం అనుకున్నాడు జైహింద్‌బాబు—

తనపై కొరకంచు ఎత్తిన అన్నమ్మను కోటయ్య క్షమించలేదు. ప్రతీకారంగా ఆ మరునాటికే ఎవతెనో ఇంటికి తీసుకొచ్చి పెట్టాడు— ఎదిగిన పిల్లలు ముగ్గురూ బిత్తరపోయి చూసినా లక్ష్యపెట్టలేదు—

అన్నమ్మ ఏం మాట్లాడలేదు-కానీ ఆముఖం చూడలేక పోయారు పిల్లలు-ముఖ్యంగా జైహింద్‌బాబుకు తన మనసుని ఎవరో కత్తితో ముక్కలు ముక్కలుగా తరుగుతున్నట్లే అనిపించింది—

తన చెల్లెళ్ళిద్దరికీ సైగచేసి బయటికి పిలిచి, చంద్రినీ, వెంకడినీకూడా పిలిచి, ఏం చెయ్యాలా అని ఆలోచించాడు వాళ్ళతో.... అందరిలో వెంకడు బాగా పెద్దవాడు—

"మా అయ్యోది లేసినపుడు మా అమ్మగూడా ఇట్టాగే ఏడిపింది" అని చెంద్రినిచూసి "చెల్లాయి మంచిది." అని కొంచెం సేపాగి "పిన్నికూడా మంచిది." అని మళ్ళీ "అమ్మ ఏడిసేది—తల కొట్టుకుని ఏడిసేది-" అన్నాడు-

చంద్రి ఏం మాట్లాడకుండా వెంకడి భుజంమీద చెయ్యివేసి ఆప్యాయంగా నొక్కింది....తడికళ్ళతో చూపులతో తన అభిమానం ప్రకటించుకున్నాడు వెంకడు—

"అమ్మ ఏడిస్తే నాకూ ఏడుపొస్తాది...." అంది సుందరీబాయి అప్పుడే ఏడుపు ప్రారంభిస్తూ—

"దిష్టముండ! యింటికే వొచ్చింది." అని మెటికలు విరిచింది రత్నమ్మ....

"ఇలా తిట్టుకోవటంకాదు-దాన్ని బెదరగొట్టి వెళ్ళగొట్టాలి— వెంకా! నువ్వు సాయంచేస్తావా?" అన్నాడు జైహింద్‌బాబు.

"ఓ!" అన్నాడు వెంటనే వెంకడు.

"నువ్వు మాతోరా! నీకు మంత్రా లొచ్చనిచెప్పు. అది పోకపోతే మంత్రం పెడతానని చెప్పు—"

"ఓర్నాయినా! నాకేటి మంత్రాలొచ్చు!"

"అట్టా చెప్పరా?" కసిరింది రత్నమ్మ—

"సెప్తా! నమ్మొద్దా?"

"నమ్మేలా మేం నాటక మాడతాంలే! చంద్రీ! నువ్వు మాతోరా! మనమంతా దాన్ని నమ్మిద్దాం! ఒరేయ్ వెంకా! నువ్వు రెండు గంటలాగిరా! పోకపోతే మంత్రం పెడతానని హడల గొట్టు...."

సరేనన్నాడు వెంకడు—పిల్లలంతా కోటయ్య తెచ్చిన దాని చుట్టూ చేరారు—అది ముఖం చిట్లించి.

"నాకాడి కెందు కొచ్చారు? పొండి-" అంది....

"అట్టాకాదు పిన్నీ! ఒక ఊసు సెప్దారని వచ్చాం. మొన్న ఆ పక్క గుడిసెలో నరసయ్య సచ్చిపోనాడు, తెలుసా?"

"తెలవదు—ఎందరో సస్తాఉంటారు-అయితే ఏంటి?"

"ఇది అట్లాంటి సావుకాదులే? ఆ నరసయ్య వెంకణ్ణి తిట్టాడు-వెంకడు నువ్వు చస్తావు, అన్నాడు-వాడు చచ్చాడు...." అన్నాడు జైహింద్ బాబు—

"అదేంటి? ఈడు సస్తావంటే ఆడుసస్తాడేంటి?

"ఈడికి మంత్రాలొచ్చు-కొండల్లోంచి ఒచ్చాడు—"

కళ్ళు పెద్దవిచేసి చెప్పింది సుందరీబాయి—

భయంగా చూసింది కోటయ్య తీసుకొచ్చిన మనిషి. చంద్రి అందుకుంది....

"మా అమ్మ అసలువాణ్ణి రానిచ్చేదేంటి! వాడికి మంత్రాలొచ్చని రానిచ్చింది-రోజూ తలారా స్నానంచేసి గంటలు గంటలు జపంచేస్తాడు. అర్ధరాత్రి శ్మశానానికి పోయి ఆ ఎముకలూ, ఈ ఎముకలూ, ఏరుకొస్తాడు-నెత్తురుతో అమ్మోరికి పూజచేస్తాడు...."



నించున్న ఆ మనిషికి భయంతో రోమాలు నిక్కపొడుచుకున్నాయి.

చంద్రి మరి కాస్త పొడిగించింది—

"ముందు మా అమ్మ వాణ్ణి ఇంట్లో అడుగు పెట్టద్దంది. వాడు ఏతో మంత్రం చదివేశాడు. మా అమ్మకి ఉపద్రవంగా గుండెనొప్పి వచ్చేసింది—భయపడిపోయి రమ్మంది—గుండెనొప్పి తగ్గిపోయింది—"

గుండెలు దడ దడలాడాయి ఆ మనిషికి....

సమయం చూసుకుని వెంకడుచేతిలో వేపమండ పుచ్చుకుని "ఓం! హ్రీం!" అంటూ వచ్చాడు—

"ముదనష్టపుదానా? ఈణ్ణించి పోక పోయినావంటే రేపటికల్లా గుండె పగిలిసస్తావు—" అన్నాడు ఉరిమిచూస్తూ.

వెంకడుపుష్టిగల మనిషి-వాడిలా ఉరిమిచూడగానే, గుండె కలుక్కుమంది ఆ మనిషికి-నిజమో, అబద్ధమో ఎందుకొచ్చిన పీడ అనుకుంది- అప్పటికప్పుడు సంచీ సర్దుకుని పారిపోయింది.

పిల్లలంతా చప్పట్లుకొట్టి నవ్వుకున్నారు-క్షణాలలో ఈ వార్త గుడిసెలన్నింటిలోనూ వ్యాపించింది.

"వెంకడికి మంతరాలొచ్చు-కోటయ్య లేవదీసుకొచ్చిన దాన్ని మంతరం పెట్టి వెల్ల గొట్టేసినాడు-" అని చెప్పుకున్నారు.

నాగమ్మ వెంకడిని భయంగాచూసి "నిజమేనా?" అంది....

వెంకడు చంద్రిపంక బెదురుగా చూశాడు-

"అవునమ్మా! అన్న మంత్రం చదివాడు-అది విల విలలాడి గిల గిలతన్నుకుని పారిపోయింది." అంది చంద్రి....

నాగమ్మ ముఖం పాలిపోయింది-"ఓర్నాయినో!" అంది గుండె రాసుకుంటు....

వెంకడు దిగాలుగా చంద్రిని చూశాడు—చంద్రి నవ్వింది-వెంకడూ నవ్వాడు-

# 6

వరదాచార్యులుగారి భార్య రంగనాయకమ్మకి తరచుగా తలనొప్పి వస్తుంది. ఆ రావటం ఉద్ధృతంగా వస్తుంది. అది వచ్చినప్పుడు వికారపెట్టి వాంతులు కూడా అవుతాయి. ఆ తలనొప్పి వచ్చినప్పుడు ఆవిడ ఇల్లంతా తలక్రిందులు చేసేస్తుంది. అసలే పనితో ఊపిరాడ సరళకి ఆవిడకి తలనొప్పి వచ్చిన రోజుల్లో మరీ, కాళ్ళు చేతులు విరక్కొట్టుకున్నట్లే అవుతుంది.

ఆరోజు రంగనాయకమ్మకి తలనొప్పి వచ్చింది. ఇంటికప్పు ఎగిరిపోయేలా మూలుగుతూ "హమ్మో! నాయనో!" అని అరుస్తోం మధ్య మధ్య.

సరళ తలారా స్నానం చేసి మడికట్టుకుని మహా నైవేద్యాని వంట తయారు చేస్తోంది. వరదాచార్యులు ఇంట్లో సాలగ్రామాల మహా నైవేద్యం పెట్టి, ఆ తరువాత కోవెల కెళ్ళి అర్చనలు చేయ చాలి. సాలగ్రామాలకు నైవేద్యంగా పెట్టే వంటలో ఏమాత్రం అనా చారం జరిగినా అది బెడిసి కొడుతుందనే నమ్మకం ఉంది. అం సరళ ఎంతో మడిగా వంట చెయ్యటంలో మునిగిపోయింది.

దానికి తోడు వరదాచార్యులు "అమ్మాయ్! సరళా! ఇవా ఇద్దరు ఉద్యోగస్తులు యిళ్లలో తద్దినాలు పెట్టుకునే వెసులుబాట లేక కోవెలలోనే చేయించమని డబ్బు కట్టేశారు. నువ్వు నిష్ఠ చెయ్యాలి-త్వరగా చెయ్యాలి. ఎందుకంటే వాళ్ళు ఆఫీసులకి పోవా కోవెలకి వచ్చి ప్రసాదం తీసుకుని ఆఫీస్‌కి వెళ్తారట! సాధ్యమయినం త్వరలో ముగించమని మరి మరి చెప్పారు" అని హెచ్చరించాడు.

పనితో సతమతం కాసాగింది సరళ.

రంగనాయకమ్మ కూతుళ్ళు కమల, శ్యామల ఇద్దరూ చిన్న వాళ్ళే. కమలకి పదేళ్ళుంటాయి. శ్యామలకి ఎనిమిది. రం



నాయకమ్మ ఎప్పుడూ మూలుగుతూ మంచంలో ఉండటంవల్ల_ఆ ఇద్దరు పిల్లలకీ అన్నీ సరళే చెయ్యటంవల్ల ఆ పిల్లలిద్దరికీ పిన్ని అంటే చాలా యిష్టం....

"పిన్నీ! స్కూల్‌కి టైమవుతోంది జడ వెయ్యవూ!" అంటూ వచ్చింది కమల.

పొయ్యిలోంచి తల పైకెత్తి ముఖానికి పట్టిన చమట తడి టకొంగుతో తుడుచుకుంటూ "ఇవాళ నాకు చాలా పని ఉంది మలా! కాస్త మీ అమ్మచేత వేయించుకో!" అంది సరళ.

కమల తల్లి దగ్గరకు వెళ్ళి అడిగింది. అక్కడితో రంగనాయకమ్మ గట్టిగా అరుస్తూ "నా కర్మ! నాకు పుట్టెడు రోగం వస్తే నాపిల్లలకి తల దువ్వే వాళ్ళైనా లేరు. అంతా ఇంట్లోబడి తినేవాళ్ళే కాని, కాస్త ఆదుకునే వాళ్ళెవరూ లేరు!" అని దీర్ఘాలు ప్రారంభించింది.

సరళ హడలిపోయి, చేస్తున్న పని ఆపి పొయ్యిలోంచి కట్రలు ఇవతలకు లాగి బయటికొచ్చి "కమలా! శ్యామలా! రండి- జడలు వేస్తాను" అంది.

పిల్లలు సహజంగా మంచివాళ్ళు. పదేళ్ళ కమలకు అన్ని పరిస్థితులూ అర్థం కాకపోయినా, పిన్ని పరిస్థితి అర్థమయింది.

"వద్దులే పిన్నీ! ఈ రోజుకి మేం వేసుకుంటాములే!" అంది కమల.

ఆ పసి మనసులు తనపై చూపించే ప్రేమాభిమానాలకు కరిగిపోయింది సరళ. వీళ్ళ కోసం ఎంత శ్రమైనా పడగలననుకొంది....

"ఫరవాలేదు రండమ్మా! ఎంతలో వేస్తాను! మీ అంతట మీరు వేసుకుంటే సరిగ్గా రాదు-అందరూ నవ్వుతారు" అని ఇద్దరికీ జడలు వేసింది. వాళ్ళ కోసం విడిగా కలిపిన దద్దోజనం పళ్ళాలలో పెట్టి, మధ్యాహ్నం తినటానికి చపాతీలు చెయ్యసాగింది.

ఆ సమయంలో పార్థసారథి వచ్చి చిన్న వంటింటి గుమ్మ ముందు నిలబడి "అక్కయ్యా!" అన్నాడు జాలిగా.

చపాతీ తిరగేస్తున్న సరళ తలెత్తకుండానే "ఏమిటిరా అంది.

సారథి మాట్లాడలేదు....

సరళ తలెత్తి సారథి ముఖంలోకి చూసి ఆ ముఖం దైన్యం గమనించిన తరువాత విషయం అర్థమయింది.

పాపం, సారథి ఎలాగైనా చదువుకోవాలని ప్రైవేట్ S. S. C కి కట్టాడు. ఆ రోజు పరీక్ష ఫీజు కట్టడానికి ఆఖరు తే డబ్బు కావాలి!

డబ్బు కావాలంటే వరదాచారి నడగాలి! వరదాచారి ముం నిలబడి చెయ్యి జాపి డబ్బు అడగాలంటే ప్రాణం పోయినట్టు ఉంటుంది సరళకి....పురుగును విదలించిట్లు విదలిస్తాడు వరదాచా పరమ అసహ్యంగా చూస్తాడు. తనేదో మహా కష్టపడి పోతున్న ముఖం పెడతాడు. ఇంతా చేసి డబ్బు ఇస్తాడన్నది అపనమ్మక ఎలాగైనా ఇయ్యకపోవటానికే ప్రయత్నిస్తాడు.

"అడుగుతానుండు!...." అని పెనం మీదనుంచి చపాతీ త గిన్నెలో సర్ది లేచి బావగారి దగ్గిరకొచ్చి "మా తమ్ముడికి ఇ పరీక్ష ఫీజు కట్టాలి-డబ్బు కావాలి!" అంది.

'డబ్బు' అన్నమాట వింటోనే వరదాచారి ముఖం వికృత మారిపోయింది.

"డబ్బు! డబ్బు! డబ్బు! అందరికీ డబ్బు కావాలి! ఎ ణ్ణుంచి తేను? దాని రోగాలకి, మందులకీ తేనా? ఇంట్లో ఇంతప పడి తినటానికీ తేనా? ఇంకా పైన చదువులూ, ఫీజులూనా? ఇం పదో క్లాసు పాసయి నీతమ్ముడు కలెక్టరయి పోతాడా?"

తనెప్పుడు ఏది అడిగినా వరదాచారి ఇలా కసురుకోవ అలవాటే గనుక మౌనంగా నిలబడింది సరళ, అన్నీ సహిస్తూ.



"ఏదీ, ఇంకా పంట చేతికి రాలేదు. ఆ రైతులు ఎప్పటి కప్పుడు ఏవో వంకలు పెట్టి రావలసినదానిలో సగంకూడా ఇయ్యరు. మాయదారి రోజులు. ఎక్కడలేని చట్టాలూ వాళ్ళకే అనుకూలంగా ఉన్నాయి. ఇక ఆ కోవెల ఉందనుకుంటే, అదీ అంతంత మాత్రం గానే ఉంది. జనుల్లో ఎక్కడైనా దైవ భక్తీ, పాప భీతీ ఉంది ఏడు స్తేగా! ఉండు, చూస్తాను...." అని సరళ ముందే ఎంతో శ్రద్ధగా ట్టె వెతికినట్లు వెతికి "లాభం లేదమ్మా! ఒక్క రూపాయి కూడా ు" అన్నాడు, నిట్టూరుస్తూ.

సరళకు నిట్టూర్పు కూడా రాలేదు. అక్కడినుంచి అడుగు కదలటం లేదు. సారథి ముఖం ఎలా చూడాలి? పాపం, తానొక వ్యక్తిగా నిలబడాలని అష్టకష్టాలూ పడుతున్న తమ్ముడి కేమని సమా ధానం చెప్పాలి? ఏది తప్పుతుంది కనుక!

ఈడ్చుకుంటూ మళ్ళీ చిన్న వంటింట్లో చపాతీల దగ్గిరకి వచ్చింది.

సరళ ఏం మాట్లాడకుండా చపాతీల దగ్గిర కూర్చోవటంతోనే విషయం అర్థమయింది సారథికి.

అయినా ఊరుకోలేక "ఏమయిందక్కయ్యా! బాగా చదివాను. పరీక్ష ఫీజు కట్టకపోతే...." అన్నాడు.

సరళ తలెత్తి పొయ్యి మంటకి ఎర్రబారిన కళ్ళతో తమ్ముణ్ణి చూస్తూ "సారథీ! నా దగ్గిర ఈ మంగళ సూత్రాలు తప్ప వేరు బంగారం కూడా లేదురా! ఇవి తీసి ఇయ్యటానికి నాకేమీ అభ్యం తరం లేదు. నువ్వు తీసుకోగలవా?" అంది.

సారథి చివ్వున కళ్ళలో నీళ్ళు చిమ్మగా తల వంచుకుని వెళ్ళి పోయాడు.

అంతలో కమల చేతిలో రూపాయిలతో వచ్చి "పిన్నీ! నాన్న నీకియ్యమన్నాడు" అని కొన్ని నోట్లు సరళ చేతికిచ్చింది.

సరళ తన కళ్ళనూ, చెవులనూ నమ్మలేకపోయింది. నిజంగా

దేవుడున్నాడేమో! తన అవస్థచూసి ఆ శిలాకృతి వదిలి శిలలాంటి తన బావగారి మనసు కరిగించాడేమో!

ఇంకేమీ ఆలోచించకుండా ఆ డబ్బు సారధి చేతిలో పెట్టి "వెళ్ళు ముందు పరీక్ష ఫీజు కట్టేసిరా!" అంది.

ఒక్క క్షణం ఆలస్యం చేస్తే తన అదృష్టం ఏది ఏవిధంగా మారుతుందోనని భయపడుతున్నట్లు వెంటనే వెళ్ళిపోయాడు సారధి.

సారధి వెళ్ళిపోగానే చపాతీలు పూర్తిచేసి పిల్లలిద్దరి డబ్బాల్లో సర్ది-మళ్ళీ నూతిదగ్గిరకు వెళ్ళి తలారా స్నానంచేసి పె వంటింట్లోకి వచ్చింది సరళ.

అప్పటికి వరదాచారి రంకెలేస్తూ "దేవుడిముందు నేను పెట్టి డబ్బు ఎవరు తీశారు? దేవుడి గదిలోకి ఎవరొచ్చారు?" అని అరు సాగాడు.

సరళ భయపడిపోయింది.

కమల నిర్భయంగా తండ్రి ముందు నిలబడి "ఆ డబ్బు నే తీశాను నాన్నా!" అంది.

వరదాచారికి మతిపోయింది. తన కూతురు దొంగతన చేసిందా?

"ఛ! దొంగతనం చేశావా? పాపంకదూ?" అన్నాడు, అల టైన ధోరణిలో బెదిరిస్తూ.

"నేను పాపం చెయ్యలేదు నాన్నా! నిన్ను పాపంను తప్పించాను...."

"ఏమిటే వెధవ్వాగుడు?"

"అవును నాన్నా! నీ దగ్గర డబ్బుంది, పిన్ని అడిగితే లేద అబద్దం చెప్పావు. అబద్దం పాపమని నువ్వేగా అంటావు! అంద నీఅబద్ధాన్ని నిజంచేసేశాను."

నిర్ఘాంతపోయాడు వరదాచారి. అతనికి నోటమాట రాలేద అమాయికంగా, గర్వంగా నవ్వుతోంది కమల.



కూతుర్నేమీ అనలేక కోపంగా సరళదగ్గిరకొచ్చి "పసిపిల్ల తెలిసీ తెలియక ఏదో చేస్తే, మందలించటానికి బదులు ఆ డబ్బు తీసుకుంటావా?" అన్నాడు.

"కమల మీ రియ్యమన్నారని ఇచ్చింది. అందుకే తీసుకున్నాను."

"అఘోరించినట్లే ఉంది. ఏదీ ఆ డబ్బు?"

"నా దగ్గర లేదు. సారధి కిచ్చేశాను."

"ఏడీ వాడు?"

"లేడు. పరీక్షఫీజు కట్టడానికి వెళ్ళాడు."

"శ్రీ రామచంద్రా!" అని రెండుచేతులూ నెత్తిన పెట్టుకున్నాడు వరదాచారి.

శ్రీ రామచంద్రుడు పేరు వరదాచారి తెల్లవారి లేస్తే అనేక సందర్భాలల్లో అనేక రకాలుగా వాడుతూనే ఉంటాడు. కానీ ఇలా ఇప్పుడు వచ్చినంత నిజాయితీగా ఆ పేరు అతనినోట మరో సందర్భంలో రాదు.

రంగనాయకమ్మకు తలనొప్పితోపాటు వాంతులు కూడా ప్రారంభమయ్యాయి. పెరటికొచ్చి ఆవిడ వాంతులు చేసుకుంటుంటే వెంకడు చూసి "అదేంటండీ!" అన్నాడు.

వరదాచారి నెత్తి కొట్టుకుని "నా కర్మరా! ఈ తలనొప్పి దాన్ని వదలటం లేదు. ఎంతమంది డాక్టర్లకి చూపించానో! ఎన్నిమందులిప్పించానో!" అన్నాడు.

వెంకడు ఉత్సాహంగా "ఈ తలనొప్పి నాకు తెలుసు అయ్యోరూ! ఆకుపసరు పూస్తే పోతాది. తెమ్మంటారా?" అన్నాడు.

వరదాచారి ఆశ్చర్యంగా "నీకు మూలికలవైద్యం తెలుసేమిటిరా?" అన్నాడు.

"మా తాత సేసేవోడండి. నాకూ సెప్పాడుఅన్నీ-నాకూ తెలుస్తయి. సానా రోగాలకి మందిచ్చి నాను తగ్గిపోనాయి."

"అయితే పో, తీసుకురా! పోయిందేముంది? చూద్దాం!"

అప్పటికప్పుడు గుడిసెకి పరుగెట్టారు వెంకడు. పాపం, వాడి తనమందు ఎవరైనా వాడి నయమయిందని మెచ్చుకోవడమే కావాలి!

ఎన్నెన్నో మందులు వాడి విసిగిపోయాడు వరదాచారి. వెంక పసరుతో తగ్గుతుందని నమ్మకం లేకపోయినా ప్రయత్నించి చూ టంలో నష్టంలేదని అనుకున్నాడు.

పసరు తయారుచేసి తీసుకొచ్చాడు వెంకడు.

"ఇదొక తీరున రాయాలండీ-మీ కొస్తాదా?" అన్నా వెంకడు.

వరదాచారి విసుక్కుని "మా కెలా వస్తుందిరా! నువ్వేరాయి అన్నాడు.

"నా కేం వద్దు. ఇప్పుడు స్నానం చెయ్యాలి" అని లబ లాడింది రంగనాయకమ్మ.

"నోరు మూసుకో! ఇప్పుడు కాకపోతే చీకటిగంటాగి స్నాన చేద్దువు కాని....మంచం పాకలో వేయించుకో! మందు రాయ చూద్దాం! తగ్గుతుందేమో!" అని కసిరాడు వరదాచారి.

వెంకడు రంగనాయకమ్మ నుదుటిమీద ఆకుపసరు మర్ద చేశాడు. అతడలా మర్దనా చేస్తున్నంతసేపూ చాలా హాయిగా ఉ పించింది రంగనాయకమ్మకి. మరికొస్త ఆకుపసరు మాడుమీదకూ రుద్దాడు.

వెంకడు మర్దనా చెయ్యడంవల్లనో, పసరు ప్రభావంవల్ల నిద్ర ముంచుకొచ్చింది రంగనాయకమ్మకి. ఒకగంట తర్వాత ని లేచేసరికి రంగనాయకమ్మ తలనొప్పి చేత్తో తీసినట్లు తగ్గిపోయింది

అందరూ చాలా ఆశ్చర్యపోయారు. నాగమ్మ సంగతి తెల కుని బుగ్గన వేలేసుకుని అంతలో గర్వంగా "మా వోడికి మంతర కూడా తెలుసు—" అంది.



"ఏరా నీకు మంత్రాలు తెలుసా?" అన్నాడు వరదాచారి—

వెంకడు బెదిరి చూస్తుండగానే, నాగమ్మ కల్పించుకుని "ఆ! వొచ్చు-కోటయ్య ఎవతెనో తీసుకొస్తే ఈడు మంతరాలు చదివి ఎల్లగొట్టేశాడు-" అంది....

వరదాచారి పూర్తిగా నమ్మలేక పోయాడు. తెల్లవారిలేస్తే ఇదేపనిగా మంత్రాలు చదివేవ్యక్తి మంత్రాలకు శక్తి ఉంటుందని ఎలా నమ్మగలడు? నమ్మకుండానూ ఉండలేక పోయాడు—ఏమో! వీరి మంత్రాలు ఎలాంటివో!

వెంకడికి ఒక రూపాయిఇచ్చి "ఇదిగో! తీసుకోరా!" అన్నాడు.

అంతకుముందు డాక్టర్లకి వందలు వందలిచ్చిన వరదాచారికి ఆ రూపాయి ఇయ్యటంకూడా వృథా అనిపించింది.

ఆ రూపాయిచూసి పొంగిపోయాడు వెంకడు. అంతకుముందుకూడా అతడు తన మూలికల వైద్యంతో అనేకమందికి రోగాలు తగ్గించినా తన వైద్యంమీద అంతడబ్బు ఎప్పుడూ సంపాదించలేదు వెంకడు.

ఆ సాయింత్రమే ఆ రూపాయిపెట్టి చంద్రికి గాజులుకొని తీసుకెళ్లాడు.

"అమ్మా! అన్న కొనిచ్చాడు-" అని చంద్రి చేతినున్న గాజులు చూపించినపుడు వద్దనుకున్న, వెంకడిమీద మంచి అభిప్రాయం కలిగింది నాగమ్మలో కొద్దిగా....

వరదాచారి ఇంటిచుట్టూ కట్టుదిట్టమైన ప్రహరీగోడ ఉంది—ప్రహరీగోడకీ, ఇంటికీ మధ్య రెండువైపులా సన్నని సందులున్నాయి-పనివాళ్ళు తలవాకిట్లోంచి పెరట్లోకి రావటానికి తప్ప ఆ సందులు ఇంట్లోవాళ్ళు ఎందుకూ ఉపయోగించరు. రోజూ సాయింత్రంవేళ ఆ సందులు ఊడ్చి శుభ్రం చెయ్యటంకూడా వెంకడి పనుల్లోకి చేరింది-వెంకడు నోరు మూసుకుని చెప్పిన పనంతా చేస్తున్న

కొద్దీ అతడి పనుల జాబితా పెరిగిపోసాగింది—అయినా వెంకడు పనికేనాడూ బద్ధకించడు.

ఆ రోజు సందు ఊడుస్తుండగా "వెంకా!" అనే పిలుపు వినిపించి చుట్టూ చూశాడు-ఆ సంధ్య చీకట్లలో ఇంటిగోడ కానుకుని నిలబడిఉంది సరళ....

"ఏంటమ్మ గోరూ?" అన్నాడు వెంకడు-ఆ ఇంట్లో సర[ళ] గడుపుతోన్న జీవితం చూశాక అతడికి సరళమీద చాలా గౌరవం కలిగింది.

సరళ వెంటనే మాట్లాడలేదు—

వెంకడికి భయంవేసింది—"సెప్పండమ్మాయిగోరూ! మీకు తలనొప్పా?" అన్నాడు.

"తలనొప్పి కాదురా....కానీ...." సరళ కొంచెంసేపు సంకోచించి చివరకు సంకోచం వదిలించుకుని తల వంచుకుని, "నాకు పెళ్ళయి నాలుగేళ్ళయిందిరా! ఇంతవరకూ సంతానంలేదు అందుకేమైనా మందుందా నీ దగ్గర?" అంది....

సరళనుచూసి జాలిపడ్డాడు వెంకడు. సంతానంలేని ఆ[డ]వాళ్ళు సంతానంకోసం ఎంతగా ఆరాటపడతారో అతనికి తెలుసు. తన తాతదగ్గిరకి అలాంటివాళ్లు కొందరు వచ్చారు-తన తాత వాళ్ళకి ఒక రకమైన కషాయం తయారుచేసి ఇచ్చేవాడు. ఆ కషాయం తాగిన వాళ్ళలో కొందరికి సంతానం కలిగేది-కొందరికి కలిగేదికాదు. అందులో రహస్యమేమిటో వెంకడికీ తెలీదు—కషాయం తయారు చెయ్యటం మాత్రం తాతదగ్గిర నేర్చుకున్నాడు.

"కసాయం ఇస్తే గునం కనిపిస్తాదేమో అమ్మగోరూ! పని చెయ్యకపోతే నన్నన గూడదు—"

"నిన్నెందు కంటానురా? నాకీమాత్రం మందు మాకులు చూపే దిక్కేది? నీ పుణ్యమా అని ఆ కషాయం పనిచేసి ఈ దౌర్భాగ్యపు జీవితానికి ఒక చిన్న ఆధారం దొరికితే...."



సరళ కళ్ళలో నీళ్ళు నిండుకొచ్చాయి.

ఎవరి కష్టాలువిన్నా మనసు కరిగిపోయే వెంకడికీ కళ్ళు చెమ్మగిల్లాయి.

"అట్లా అనబోకండమ్మగోరూ! మీకేంటి? సల్లగ, సుహంగుంటారు. సీసా పట్టండి—రేపు కసాయం తెస్తాను-"

"నువ్విక్కడే ఉండు-సీసా తెస్తాను—" అని సరళ లోపలి[కె]ళ్ళి ఖాళీ హార్లిక్స్ సీసా తెచ్చియిచ్చి "వెంకా! ఈ మందు నువ్వి[చ్చే]టు నలుగురిలో ఇయ్యకు-అంతా నవ్వుతారు-ఈ సందులోనే రహస్యంగా ఇయ్యి—" అంది.

"అట్టాగే!" అని తలూపాడు వాడు.

ఆ మరునాడే కషాయం తెచ్చిపెట్టాడు వెంకడు—సందులోకి వచ్చిన సరళకి సీసా అందించి "ఆ బద్రమ్మ తల్లి సల్లగా సూపి మీ కడుపుపండాల!" అన్నాడు.

సరళ దాన్ని అపురూపంగా అందుకుని తన దైవం శ్రీరామచంద్రుడికి నమస్కారం చేసుకుని అందులోంచి వెంకడు తాగమన్నంత తాగింది.

"ఇది వారం రోజులొస్తా దమ్మాయిగోరూ! అయినాక మళ్ళీ తెస్తా! ఒక నెల్లాల్లు పొద్దుటేలా, మాపిటేలా, తాగి సూడండి-" అన్నాడు వెంకడు.

ఆశగా తలఊపింది సరళ.

# 7

జైహింద్ బాబు పదోక్లాసు ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడు-అతని సంతోషానికి అంతులేదు.

అన్నమ్మ తనకు తెలిసిన దేవతల కందరికీ దణ్ణాలు పెట్టుకుని ఉన్నంతలో ఉన్నంత నైవేద్యం పెట్టుకుంది.

రత్నమ్మ బాగా పెద్దదయింది, ఓణీలుమానేసి చీరలుకడ తోంది—"నువ్వు సానా గొప్పాడివిరా!" అంది మెరుస్తున్న కళ్ళతో—

సుందరీబాయి కూడా ఉత్సాహంగా "ఒరే అన్నా! నీకు సా సానా డబ్బులొస్తాయి కాదొరే!" అంది ఆశగా....

జై హింద్‌బాబు ఉల్లాసంగా నవ్వి "అప్పుడేకాదే—ఇంక పైకి చదువుకోవాలి-అప్పుడు-" అన్నాడు.

అన్నమ్మ దిగులుపడిపోయి "ఇంకా సానా సదవాలా!" అంది....

తన ఇంట్లో అందరూ తను పదోక్లాసు పాసవ్వగానే తన కలెక్టర్ ఉద్యోగంలాంటి దేదో సిద్ధంగా ఉంటుందని అనుకుం న్నారు—వాళ్ళ అమాయకత్వం చూస్తే జాలేసింది-వాళ్ళు తనమీ పెట్టుకున్న ఆశలుచూస్తే భయమూ వేసింది....

ఏ మాత్రం సంతోషం చూపించనిది కోటయ్య ఒక్కడే! అ డికి ఇల్లూపట్టదు-సంసారమూ పట్టదు-ఇంటికి వచ్చిననాడు వస్తాడు లేనినాడు లేదు-ఇప్పటికీ బాగా తాగివస్తున్నాడు. కాని, ఇదివరకుల భార్యని చావబాదటం లేదు....

జై హింద్‌బాబు పాసయ్యాడని విని "అయితే జయన్నా నీకు పనిదొరుకుతాదా? నీకాడనాకూ ఏదన్నాపని సూడు!" అన్నాడు

"అప్పుడే కాదయ్యా! ఇంకా పైన చదవాలి!" అన్నాడు జై హింద్‌బాబు, ఇంతమందికి ఈ విషయం నచ్చజెప్పవలసి వచ్చే సరికి పాసయిన ఉత్సాహం తగ్గిపోతుండగా....

జై హింద్‌బాబు పాసయిన విషయంవిని ఎంతో సంతోషి చాడు వ్యాసమూర్తి—

"పైకి చదువుతావా?" అన్నాడు ప్రోత్సాహ పూర్వకంగా... ఇంత సేపటికి తన ఉత్సాహాన్ని పంచుకుని తన కలలు



ఆశలూ చెప్పుకొనేటందుకు ఒకవ్యక్తి కనిపించాడు జై హింద్ బాబుకి....

"చదువుతాను బాబుగారూ! ఇంటర్ పాసయ్యాక వీలయితే డాక్టర్నవుతాను. కానీ, దానికి చాలా ఖర్చవుతుందట కదూ! వీలు కాకపోతే బి. ఏ. చదువుతాను-ఆ తరువాత లాచదువుతాను-లేకపోతే ఐ. ఏ. యస్. కి కూచుని కలెక్టర్నవుతాను—డాక్టర్నయితే మా వాళ్ళందరికీ వైద్యంచేసి మంచి మంచి మందులిస్తాను. లాయర్న యితే ఓలాగ మా వాళ్ళకి జరిగే అన్యాయాలన్నీ కోర్టులో నిరూ పిస్తాను-న్యాయం జరిగేలా చూస్తాను-కలెక్టర్నయితే అసలు కష్టాలే లేకుండా,-రాకుండా-చూస్తాను...."

ఉత్సాహం ఉరకలువేసే ఆ ముఖంలోకి అభిమానంగా చూశాడు వ్యాసమూర్తి—"మీ వాళ్ళలో నీలాంటివాళ్ళు పదిమంది కొకరున్నా, మీ జాతిమొత్తం బాగుపడేదయ్యా! ఇంటర్‌లోచేరు. తప్పకుండా పైకొస్తావు" అన్నాడు.

పొంగి పోయాడు జై హింద్‌బాబు—

పరమానందంతో తను పాసయిన వార్త చెప్పటానికి రాజయ్య గుడిసెకు కూడా వచ్చాడు-రాజయ్య తోటలో ఉన్నాడు—

చంద్రికూడా పదోక్లాసు పాసయింది-కానీ, దాని ముఖంలో ఏ కోశానా సంతోషంలేదు.

ఆ ముఖంచూసి ఎలాగో అయిపోయాడు జై హింద్‌బాబు— బహుశః నాగమ్మ చంద్రిని ఇంకా పైకి చదివించటానికి ఒప్పుకోలే దేమో! తమలో ఇంతవరకూ చదివించటమే గొప్ప-శక్తి ఉన్నా కాలేజిలో చేర్పించటానికి వెనకాడతారు-అందులో ఆడపిల్లల్ని అసలు చేర్పించరు. పాపం, పైకి చదవలేక పోతున్నాననే నిరాశతో అలా ఉందేమో!

"చంద్రీ!" అని పిలిచాడు ఆరాటంగా....

క్రింద కూర్చుని తన తండ్రి తోటలోంచి తెచ్చి పడేసిన కూర

గాయల్ని వేటికవి గంపలోకి సర్దుతోన్న చంద్రి తలెత్తి చూసిం
దానిముఖం జీవం లేనట్లు పాలిపోయిఉంది___

మోటబావి దగ్గిరనుంచి కుండతో నీళ్ళు మోసుకొచ్చి
నాగమ్మ కుండదింపి జైహింద్‌బాబుని చూసి నవ్వి-

"ఏంటి జయన్నా! పాసయినా వంటగా!" అంది....

"అవునత్తా! ఫస్ట్‌క్లాసులో పాసయ్యాను-"

"పని దొరుకుతాదా?"

"లేదత్తా! ఇంకా పైకి చదువుతాను___"

"సదువయ్యా సదువు-మొగబిడ్డవి-ఎంతైనా చదువు. నీకు మంచి కబురుసెప్తా! మా చెంద్రికి మనువు కుదిరింది. రెం వందలు ఓ లిస్తామన్నారు-తులం బంగారం. రెండుతులాలు ఎం పెట్టామంటున్నారు___యేం? మన చెంద్రికేం తక్కువయింది? నువ్ సెప్పు ఇంత సక్కనిది ఈ యీదిలోఉందా? ఈ యీదిలోనే లేద పెద్దిళ్ళలో మాత్రం ఉందా? మనం మాత్రం తక్కువ సేస్తావంట గిన్నెలన్నీ యిస్తాం-మంచంగూడ కొంటన్నా! గొలుసు సేపిచ్చినా."

తన ధోరణిలో చెప్పుకుపోతోంది నాగమ్మ.

జైహింద్‌బాబు చెవులకేని వినపడటంలేదు. జీవంలేనట్లుగా పాలిపోయిన చంద్రి ముఖాన్నే చూస్తూ నిలబడిపోయాడు___

ఆ ముఖం అలా ఉండటానికి కారణం తెలిసిపోయిందిపుడు అక్కడ నిలవలేక "వస్తానత్తా" అని ఇంటికి వచ్చేశాడు.

"చంద్రికి మనువు కుదిరిందటగా?" అన్నాడు తల్లితో....

అన్నమ్మ నిట్టూర్చి "అవును-అదురుస్టం-వయసురాగానే పె సేసేస్తన్నాది నాగమ్మ-మన రత్తికే వయసొచ్చినాది___దానికే పె సెయ్యాల...." అంది.

మరోకొత్త సమస్య కళ్ళముందు కొచ్చింది జైహింద్‌బాబ
రత్నమ్మకు పెళ్ళిచెయ్యాలి.

తను చదివింది పదోక్లాసే కాని, తన వయసు పందొమ్మి



చంద్రికీ పద్దెనిమిది ఉంటాయి-ఆ వయసులో నాగమ్మ చంద్రికి పెళ్ళి చెయ్యాలను కోవటం సహజమే.

ఏదో అశాంతి మనసులో-ఏం చెయ్యాలో తెలియని అశాంతి-ఏమీ చెయ్యలేడు-చెయ్యకుండా ఉండలేడు___

"అమ్మా! చంద్రికిప్పుడు పెళ్ళిచెయ్యక పోతేనేం? చదివించ కూడదూ?" అనేశాడు.

ఉలిక్కి పడింది అన్నమ్మ-కొడుకు ముఖంలోకి పరీక్షగా చూసింది-భయంగా అంది___

"అదేంటిరోయ్? ఇంకా ఏటి సదువుద్దది? పోలీసు జవాను మను వాడతానంటన్నాడు-ఇంకేటికావాల? లచ్చనంగా రాజాలానీలా బతుకుద్ది-నీ కదివరసకాదు-నువ్వు దాన్ని మనువాడితే, నిన్నూ, దాన్నీ, మన్నీ, ఎవరినీ నిలవనియ్యరు మనోళ్ళు-అట్టాంటాలోచన రానియ్యబాక...."

గతుక్కు మన్నాడు జైహింద్‌బాబు-తను నోరు విప్పి ఏమీ అనకుండానే తన మనసులో ఏ మూలనో ఉన్న ఆలోచన పట్టేసింది తల్లి.

తమలో ఆడపిల్లకి సొంత తల్లి తమ్ముడితో పెళ్ళి చేసేస్తారు, మేనమామ వరసఅని....అలాంటిది ఏదో అతి దూరపు బీరకాయ పీచుసంబంధంలో, తనకూ చంద్రికీ వరస కాదట! చంద్రిని తను పెళ్ళి చేసుకోవటం అసంభవమట!

అన్నమ్మ ఊరుకోకుండా మళ్ళీ అంది....

"అల్లకి మనం దణ్ణాలు పెట్టేటోల్లం-అల్లపిల్లని మనింటి కెట్టా తెచ్చుకుంటాం?"

ఈ బంధుత్వాల్లో ఇదొకటి! అయా బంధుత్వాలను బట్టి ఒక కుటుంబానికి మరొక కుటుంబం దణ్ణాలు పెట్టేవరస కలుస్తుంది___ తాము ఎవరికి దణ్ణం పెట్టాలో ఆ కుటుంబంలో మొగపిల్లవాడికి తమ

ఇంటి ఆడపిల్లనిచ్చి పెళ్ళి చేస్తారు కాని, ఆ కుడుంబంలో ఆడ పిల్లను తమ మొగపిల్లవాడికి భార్యగా తెచ్చుకోరు!

ఏమిటి ఈ ఆచారాలు? వడ్డీ వ్యాపారితో దెబ్బలాడి వడ్డీని గట్టిగా ప్రయత్నిస్తే అసలుకూడా రద్దు చెయ్యచ్చు నేమోగాని, అర్ధంలేని ఆచారాలను మాత్రం ఎవరూ రూపుమాపలేరు. ముంద తన తల్లే ఒప్పుకోదు?

కాలేజీలో సీట్‌కోసం అప్లై చేశాడు జైహింద్‌బాబు—ఫస్ట్ క్లాస్‌లో పాసయిన అతనికి సీట్ తేలిగ్గానే వచ్చింది.

టీచరమ్మ దగ్గిర తను దాచిన డబ్బంతా తెచ్చి ఇచ్చింది అన్నమ్మ—నలిగిపోయిన రూపాయకాగితాలూ, అర్ధరూపాయలూ, పావలాలూ, పదిపైసల బిళ్ళలూ అవన్నీ చూడగానే ప్రతి చిన్న నాణెంలోనూ తన తల్లి పరిదీనవదనం ప్రత్యక్షమయి మనసు కదిలి పోయింది జైహింద్‌బాబుకి—

"ఏం చేస్తే, ఈ తల్లిరుణం తీర్చుకోగలనూ?" అను కున్నాడు మనసులో మరొకసారి—

జీతం కట్టి కాలేజిలో చేరిన రోజున తన ఒళ్ళు తనకు తెలియ లేదు జైహింద్‌బాబుకి-తన చిరకాల వాంఛితం నెరవేరింది. తన బంగారు కలలు ఆకృతి ధరిస్తున్నాయి-తను బాగా చదువుకోవాలి చదువుకుని ఎన్నెన్నో, ఎన్నెన్నో, చెయ్యాలి!

కష్టపడి సెకండ్‌హేండ్ పుస్తకాల కోసం ప్రయత్నించి కొన్ని కొన్నాడు జైహింద్‌బాబు-కాలేజి ప్రిన్సిపాల్‌గారు కూడ మంచి ఆయన-జైహింద్‌బాబుకి స్కాలర్‌షిప్ రావడానికి ప్రయత్ని స్తానన్నారు—అప్లై చెయ్యమన్నారు —ప్రస్తుత పరిస్థితులను బట్టి తప్పకుండా వస్తుందని ధైర్యం చెప్పారు.

కాలేజీలోచేరి చదువుకుంటున్నా తల్లికి ఇంటి పనుల్లో చాలా సాయం చేసేవాడు జైహింద్‌బాబు.



తల్లి టీచరమ్మ ఇంటికి పనిలోకి పోయాక తనకు కాలేజి టైం అయ్యేవరకూ ఏదో ఒక పుస్తకం తీసి చదువుకునేవాడు.

రత్నమ్మ మరో ఇంటికి పనికెళ్తుంది-అది పొద్దున్న పోతే సాయంత్రం కానిరాదు. చిన్న పిల్లలని కూడా ఆడించాలి అది. దానికి ఒకపూట అక్కడే అన్నం పెడతారు. బేరాలున్నా, లేక ...యినా సుందరీబాయి బల్ల దుకాణం దగ్గిరే కూచుంటుంది-అంచేత ...ంట్లో అతని చదువుకి ఇబ్బంది కలిగించే వారెవరూ ఉండరు,

"ఏం బావా! చదువు కుంటున్నావా?" అంటూ వచ్చింది చంద్రమ్మ.

చంద్రిని చూసినప్పుడల్లా మనసు కలత పడుతోంది ఈ మధ్య జైహింద్‌బాబుకి—అందుకే ఆ ఇంటివైపుకే పోవటంలేదు.

"రా! కూచో!" అన్నాడు పుస్తకంమూసి....

"బాగా చదువు కుంటున్నావు-కంటికే కనిపించటంలేదు—" నిష్ఠూరంగా అంది.

జైహింద్‌బాబు అదొక రకంగానవ్వి "నేనెందుకూ, నీకంటికీ కనిపించటం? మీ శ్రీవారు కనిపించాలని కోరుకో!" అన్నాడు.

"అదే కోరుకున్నాను—అందుకే ఇక్కడికి వచ్చాను." అంది చంద్రి ఏమాత్రం సిగ్గు పడకుండా—

"ఏం మాట్లాడుతున్నావు చంద్రి!"

"నీకు అర్థం కాలేదా!"

"పరిస్థితులు నీకు తెలియనివా? మన ఆచారాలు, మన నమ్మ కాలు, మన కట్టుబాట్లు...."

"అన్నీ ఉన్నాయి — అన్నింటినీ 'ఉఫ్' మని ఊది పారేసే తప్పూ ఉంది! చెయ్యదలచుకున్నది చేసేసి తప్పు కట్టేస్తే సరి...."

"తప్పు కట్టాలా? ఏం తప్పు చేశామని తప్పు కట్టాలి? తప్పులు చేస్తున్న వాళ్ళంతా తలలెత్తుకు తిరుగుతోంటే ఏ తప్పూ చెయ్యని మనం వీళ్ళందరినీ తాగి తందనాలాడమని తప్పు కట్టాలా?"

"తప్పు కట్టద్దు-వీళ్ళందరికీ దూరంగా పారిపోదాం!" హ పోయాడు జైహింద్ బాబు.

"అమ్మనూ, చెల్లెళ్ళనూ వొదిలి...."

"అదే బావా!....అమ్మా, చెల్లీ, అన్నా, తమ్ముడు—ఇ కుటుంబం....ఈ కుటుంబం అంటే సంఘంలో ఒక భాగం-సంఘ నికీ వ్యక్తికీ ఉన్న అవ్యక్త సంబంధం మీ కుటుంబం....ప్రతి వాడి తన కుటుంబం కావాలి. కుటుంబం కావాలనుకుంటే సంఘాన్ని కాదనకూడదు. ఇలా మనకు తెలియకుండానే సంఘానికి బానిస మయిపోతున్నాం!"

తనకు మనువు కుదిరినప్పటి నుంచీ ఈ విషయాలే ఆ చిస్తోంది చంద్రి. అంచేతే అలా పోట్లాడగలిగింది. "ఎవడయి సాహసి అన్నింటికీ తెగించి సంఘాన్ని ఎదిరించినపుడు-దాని ఆ రాలలో మూర్ఖత్వాన్ని తెలియజెప్ప గలిగినపుడు-ఈ సంఘం మా తుంది. కొత్త ఆచారాలు ఏర్పడతాయి. అలా మన సంఘాన్ని ఎ దించే శక్తి నాకెప్పటికైనా వస్తుందేమో! ఇప్పుడు లేదు."

"ఏనాటికైనా పరవాలేదు బావా! నువ్వు నా వాడివనే ధైర్య ఉంటే చాలు! నేను నీకోసం ఆగుతాను...."

"ఎలా చంద్రీ! మీ అమ్మ నీకు పెళ్ళి చెయ్యకుండా ఆగు తుందా?"

"అవన్నీ నాకు వొదిలెయ్యి-నాకు మాటియ్యి."

"చెయ్యి జాపింది చంద్రి. సంతోషంగా-సంకోచంగా. చేతిలో చెయ్యి వేశాడు జైహింద్ బాబు.

తన గుడిసెకు పోయిన చంద్రి తనకు కాబోయే వరు అన్ని విషయాలూ వివరిస్తూ ఉత్తరం రాసేసి రహస్యంగా పోస్ట వేసేసింది.

ఆ ఉత్తరం చదువుకున్న పెళ్ళికొడుకు చంద్రిని చేసుకో చెప్పేశాడు, కారణం చెప్పకుండా.



నాగమ్మకు మండిపోయింది. ఆ కోపం ఎవరి మీద చూపించాలో తెలియక "సచ్చినోడు—పెళ్ళి మాటలనుకుంటా ఉంటే పుసుక్కున తుమ్మాడు. ఈడి మూలంగానే పెళ్ళి సెడిపోయింది" అని వెంకడి మీద విరుచుకు పడింది.

పాపం, వెంకడు బిక్క ముఖం వేసుకుని ఆ తిట్లన్నీ న్నాడు.

తరువాత రహస్యంగా చంద్రి దగ్గరకు వచ్చి "చెల్లే! పాపిష్టోణ్ణి! నా మూలంగా నీ మనువు సెడిపోనాది" అన్నాడు బాధగా.

చంద్రమ్మ వెంకడి చేతులు పుచ్చుకుని "అన్నా! నా పెళ్ళి నీ మూలంగా చెడిపోలేదు. నువ్వు బాధ పడకు. ఒకవేళ నువ్వే నా పెళ్ళి చెడగొడితే నాకు గొప్ప ఉపకారం చేసినవాడివవుతావు. కష్టం కలిగించవు" అంది.

వెంకడు తెల్లబోయి అర్థం కానట్లు చూశాడు. అంతలో అర్థమయి "హోర్నాయనో!" అని గుండె బాదుకున్నాడు.

చంద్రి నవ్వుతూ నోటిమీద వేలేసుకుని "హుష్!" అని అదలించింది.

# 8

సరళ గర్భవతి అయింది. ఆ విషయం ముందుగా నాదమునితోనే చెప్పింది, పరమానందంతో....

"ఇహిహీ! నీకు పాపాయి పుడుతుందా?" అని ఒక పెద్ద నవ్వు నవ్వాడు నాదముని.

తను తన భర్తతో పంచుకోగలిగే ఆనందం అంతమాత్రమే! ఉసూరుమని పోయింది సరళ ప్రాణం....

తన జీవితానికి-తన ఆనందాలకు-తన ఆశలకు....అన్నిటికీ

ఏకైక ఆధారం తనలో ఊపిరి పోసుకుంటోన్న ఆ ప్రాణి....తన రక్తంలో రక్తం....తన చిట్టిపాప మాత్రమే!

చివరకు తన ఆనందాన్ని ఎవరితోనో, ఒకరితో పంచుకో కుండా ఉండలేక ఆ ఇంట్లో తన కాస్తలయిన, కమలా, శ్యామలల తోనే చెప్పింది. "మీకొక చిట్టితమ్ముడు వస్తున్నాడు" అని.

కల్ల కపటం తెలియని ఆ పసి మనసులు చప్పట్లు కొట్టి కేరిం తలతో నవ్వుతూ "బుల్లిపాపాయి! సరళ పిన్నికి బుల్లిపాపాయి" అని ఆ వార్త ఇల్లంతా చాటారు.

పార్థసారథి పరమానందంతో "నిజమా, అక్కా!...." అన్నాడు.

"నిజమేరా! ఇన్నాళ్ళకు, ఆ దైవం ఈ మాత్రం చల్లగా చూశాడు" అంది సరళ.

"అక్కా! నీకు బాబు పుట్టి వాడు కాస్త పెరిగేసరికి, నేను ఎలాగైనా బి. ఏ అయినా పూర్తి చేసి ఏదో ఒక ఉద్యోగంలో చేర తాను. వాడిని చదివిస్తాను" అన్నాడు సారథి ఉత్సాహంగా.

సరళ వాత్సల్యంగా నవ్వి "అంత మాటన్నావు-అది చాలు లేరా! మన బాబుకి లోటేముంది? నేనంటే వెర్రివాడికి భార్యనయి ఇలా దౌర్భాగ్యపు జీవితం గడపవలసి వస్తోంది. కాని, మన బాబు ఆస్తికి హక్కుదారుడవుతాడు. తను చదువుకుంటాడు. మనను ఆదు కుంటాడు" అంది, ఆశల సౌధాలు ఊహలలో నిర్మించుకుంటూ.

రంగనాయకమ్మ ఈ వార్త విని తెల్లబోతూ "పెళ్ళయిన ఇంత కాలానికి ఇదేమిటి?" అంది. ఎంతయినా ఆడది కనుక, "పోనీలే! మొగుడు వెర్రిబాగులవాడైనందుకు సంతానమైనా ఉంటే, కాస్త అండగా ఉంటుంది" అని కూడా అంది.

వరదాచారి పైకి ఏమీ మాట్లాడలేదు. అతని మనసులోమాత్రం అగ్ని పర్వతాలు పగులుతున్నాయి. పెళ్ళయిన మొదట్లో సరళకి సంతానం కలుగుతుందేమోనని అతడు భయపడ్డాడు. కానీ, ఆ సూచ



నలు లేకపోవటంతో ఆ ఆస్తంతా తనదేనని సంబరపడ్డాడు. ఆ వెర్రాడి కింత తిండి పడేస్తే చాలు—సరళ ఇంటెడు చాకిరీ చేస్తూ పడి ఉంటుంది.

కానీ, ఇప్పుడు సరళ గర్భవతి కావటంతో అతని అంచనా లన్నీ తలక్రిందులయ్యాయి. తన ఆస్తిలో భాగం పంచాలి! ఈ ఆలోచననే సహించలేక పోతున్నాడు వరదాచారి. ఈ భావన వచ్చి నప్పుడల్లా అతని మనసులో మంటలు లేస్తున్నాయి.

సరళ కంటికి వెంకడు దైవంలాగే కనిపిస్తున్నాడు. ఏం లాభం? ఎంత అభిమానమున్నా, మనసులో ఉంచుకోవలసిందే కాని, వాడికి మరి కాస్త పచ్చడి వేసే అధికారమైనా సరళకు లేదు.

మామూలుగా మంచం మీదనుంచి లేవలేక పోయినా, పని వాళ్ళకి అన్నాలు పెట్టడానికి మాత్రం రంగనాయకమ్మే వస్తుంది.... రంగనాయకమ్మ అనుమతి లేకుండా మిగిలిపోయిన పదార్థాలయినా సరే, పనివాళ్ళ కివ్వటానికి వీల్లేదు.

సరళ తన చేత్తో ఇస్తే పనివాళ్ళకు సరళ పట్ల భయభక్తు లేర్పడతాయేమోననే భయంతో, ఏదయినా, రంగనాయకమ్మ తన చేత్తోనే ఇస్తుంది. అంచేత వెంకడి కేపైనా తినుబండారాలు పెట్టా లనుకున్నా, పెట్టగలిగే అవకాశం ఉండదు సరళకి.

కానీ, ఇటీవల తయారు చేస్తున్న ఫలహారాలలో ఎలాగో కొన్ని అతి రహస్యంగా దాచి, వాటిని ఏదో ఒక సమయంలో రహ స్యంగా వెంకడిచేతిలో పడేస్తోంది సరళ. వాడికి ధన రూపంలో తానేమీ ఇయ్యలేక పోతున్నందుకు ఈ రకంగానైనా రుణం తీర్చు కోవాలని ఆశ పడింది.

మొదట్లో వెంకడు భయపడే వాడు—వద్దని చెప్పాలనుకునే వాడు—కానీ, వాడు ఆ తినుబండారాలను తను తినకుండా దాచి చంద్రి కిచ్చినపుడు, అది తిండిమీద ఆశ కంటె, అన్నను సంతృప్తి పరచా లనే ఆశతో అవి తిని ఎంతో బాగున్నాయని మెచ్చుకునేది.

అక్కడితో వాడు సరళ తనకేం పెట్టినా ఆశగా అందుకుని చంద్రి కిచ్చేవాడు. చంద్రి అప్పుడప్పుడు తల్లికీ, తండ్రికీ కూడా పెట్టేది.

నాగమ్మ "ఎక్కడిదియ్యి?...." అని అడిగినపుడు "అన్న తెచ్చాడు-సరళమ్మ పెట్టారంట!" అని చెప్పేది.

నాగమ్మ నిర్ఘాంతపోయి "సరళమ్మ పెట్టిందా? ఇన్నాళ్ళ బట్టీ పని సేస్తున్నాను. ఎన్నడూ నాసేతిలో యెంగిలిసెయ్యి యిదపనేదు. యీడికింత యిదిగా ఎట్టా యిస్తాందో? సిత్రంగా ఉంది!" అంది.

వెంకడు ఊరుకోలేక "నే నాయమ్మకి మందిస్తున్నా పిన్నీ!" అన్నాడు.

నాగమ్మ గుండె బాదుకుంటూ "యేంచేంటి? మందు బెట్టి మనసు మారస్తన్నావా?" అంది.

తెల్లబోయాడు వెంకడు.

"అట్టా కాదు పిన్నీ! కసాయం ఇస్తన్నా! అది...." ఆగిపోయాడు వెంకడు. తన మందు విషయం రహస్యంగా ఉంచమని సరళ అడగటం గుర్తుకొచ్చింది.

"ఓర్నాయనో" అని మరోసారి గుండె బాదుకుంది నాగమ్మ.

సారధి పరీక్షలు బాగా రాశాడు. "నీ దయవల్ల కనీసం ఈ పదో క్లాసయినా పాసైతే, ఏదైనా ఉద్యోగం చూసుకుంటానక్కా!" అన్నాడు.

సరళ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ "నీకు ఉద్యోగం ఏం కర్మరా! నిన్ను కాలేజిలో చేర్పిస్తానుగా?" అంది.

"కాలేజిలో చేర్పిస్తావా? ఎలాగక్కా?"

"ఎలాగో! నీ అల్లుడు చదివిస్తాడులే!"

నవ్వుకుంది సరళ. తన గర్భంలో పెరుగుతోన్న ఆ శిశువు ఎన్ని అద్భుతాలయినా చెయ్యగలడనిపిస్తోంది సరళకి. ఇప్పుడా అభాగ్యురాలికి లోకమంతా నందనవనం లాగే కనిపిస్తోంది.



ఆనందంతో మెరిసిపోతున్న తన అక్క ముఖంలోకి చూస్తూ "లోకంలో ఆడవాళ్ళకి అత్యంత సాధారణమయిన మాతృత్వమే! అక్కకి ఏదో అపూర్వమయిన వరంలా తోస్తోంది. పాపం, ఆవిడ దౌర్భాగ్యం అలాంటిది" అనుకున్నాడు.

సరళది సహజంగా చాలా సాత్విక ప్రవృత్తి—దానికి తోడు దురదృష్టం కొద్దీ చిన్నతనం నుండే ఎప్పటికప్పుడు పరిస్థితులతో కోవలసి రావటంతో మరింత సహనం ఏర్పడింది.

ద్విపాద పశువు అనదగిన నాదమునిని చూస్తే అందరికీ వేళా ళమే! సరళ స్థానంలో మరే స్త్రీ ఉన్నా తన భర్తను తప్పకుండా అసహ్యించుకునేది. అలా అసహ్యించుకోవటంలో ఆశ్చర్యమూ లేదు, అన్యాయమూ లేదు. కానీ, పాపం, సరళ భర్తను ఏనాడూ అసహ్యించుకోలేదు. భగవంతుడు తనకు ప్రసాదించిన దానినే సాధ్యమయినంత చక్కగా మలచుకోవటానికి అలవాటు పడిన సరళ భర్త విషయంలోనూ అదే వైఖరి అవలంబించింది. అతనికి స్నానం చేయించేది. మంచి బట్టలు తొడుక్కోమనేది. దగ్గిరుండి కడుపు నిండా అన్నం పెట్టేది. ఏం చెప్తే అది పసిపిల్లాడిలా చేసే నాదమునిని చూస్తే అసహ్యం కలగటానికి బదులు జాలితో కడుపు రుక్కుపోయేది సరళకి.

ఆ రోజు నాదమునికి స్నానం చేయిస్తూ "ఇంక మన కష్టాలు ఎన్నో రోజులు లేవు. మీ అబ్బాయి మీకు వైద్యం చేయిస్తాడు. మీ జబ్బు నయమయిపోతుంది. అందరిలాగా అయిపోతారు. అందరికంటె తెలివైనవారు అయిపోతారు" అంది.

నాదముని చుట్టూ చూస్తూ "ఏడీ వాడు?" అన్నాడు.

"పాపం, ఆ వెర్రిబాగుల భర్త దగ్గిరే సిగ్గు పడుతూ "ఇంకా నాలోనే ఉన్నాడు" అంది సరళ.

"ఇలా ఇయ్యి - ఎత్తుకుంటాను...." అని చేతులు జాపాడు నాదముని.

అతనివైపు జాలిగా చూసి తల దించుకుని వచ్చేసింది సరళ.

వారం రోజుల కొకసారి రహస్యంగా సందులో కషాయం సరళ కందిస్తున్నాడు వెంకడు. గర్భం వచ్చాక కూడా ఆరు నెలల వరకూ కషాయం తాగించేవాడు వెంకడి తాత.అంచేత వెంకడు సరళని కూడా అలాగే తాగమన్నాడు. ఆ కషాయం ఏమిటో కాని, దానివల్ల తనకేమీ బాధలు లేకపోగా, ఏదో బలం చేకూరినట్లు అనిపించటంతో సరళ సంతోషంగానే ఆ కషాయం తీసుకోసాగింది.

ఆరోజు సంధ్యచీకట్లో వెంకడి దగ్గరనుంచి కషాయం అందుకుని వాడికి ఇంట్లో చేసిన లడ్లు అందిస్తోంది సరళ.

ఆ సమయంలో వాళ్ళిద్దర్నీ చూశాడు వరదాచారి.

"ఏమిటది? ఏం చేస్తున్నారు?" అని గర్జించాడు వరదాచారి.

ఇద్దరూ ఉలికి పడ్డారు. ఇద్దరూ ఏ తప్పూ చేయక పోవటం వల్ల, తప్పు చేస్తున్నామనే భావన ఇద్దరి మనసుల్లోనూ లేకపోవడం వల్ల ఇద్దరూ పెద్దగా భయపడలేదు.

"నేను వెంకడి దగ్గిర మందు తీసుకుంటున్నాను బావగారూ!" అని ధైర్యంగా సమాధానం చెప్పింది సరళ.

"వెంకడి దగ్గిర మందు తీసుకుంటున్నావా? ఈ సందులో.... ఈ చీకట్లో....ఇంత రహస్యంగా...."

"అవును-రహస్యంగానే తీసుకుంటున్నాను. ఈ ఇంట్లో నన్ను డాక్టర్‌కి చూపించి నాకు మందూ మాకూ కొనిచ్చే వారెవరు? చిన్నతనం నుంచీ నెల కొకసారి కాక పదిహేను రోజుల కొకసారి ముట్టవుతున్నాను. పెళ్ళి కాకముందూ, పెళ్ళయ్యాకా కూడా ఈ విషయం పట్టించుకున్న వాళ్ళెవరూ లేరు. వెంకడి కషాయంతో గర్భకోశం బాగుపడి కడుపు పండుతుందేమోనని ఆశ పడ్డాను. ఏ డాక్టర్లకూ లొంగని అక్కయ్యగారి తలనొప్పి వీడి పసరుతో తగ్గిపోవటంతో నాకూ ఆశ కలిగింది. నా అదృష్టం బాగుండి వీడి కషాయం పని చేసి నేనూ తల్లిని కాబోతున్నాను."



"నోర్ముయ్! మంత్రాలకు చింతకాయలు రాలతాయా? కషాయాలకు కడుపు లొస్తాయా? మీ భాగవతం నేను చూడలేదనుకుంటున్నావా? ఈ సందులో దూరి మా కళ్ళలో దుమ్ము కొట్టి మా ఎదుటే ఇంత ఘోరానికి తల పడతావా? ఎంత నికృష్టపు దానివే! ఈ సంకర సంతానాన్ని పవిత్రమైన మా వంశంలో కలుపుదామనుకున్నావా? నడు!....ముందు బయటికి నడు!"

వరదాచారి అరుపులకు ఇంటిల్లిపాదీ అక్కడ చేరారు.... అందరూ వెంకణ్ణీ, సరళనూ వింతగా చూడసాగారు.

"బావగారూ! నేను అర క్షణం క్రిందటివరకూ వంటింట్లోనే మగ్గుతున్నాను. ఇప్పుడే ఇక్కడికొచ్చి కషాయం తీసుకుంటున్నాను. ఈ క్షణకాలంలో నేను ఏ ఘోరాలు చేస్తానండీ?"

"ఇవాళ క్షణ కాలంలోనే నాకంట పడ్డావు. రోజూ ఎన్నెన్ని గంటలు ఎలా గడుపుతున్నావో?"

"గంటలు! గంట కాదు; ఘడియ కాలం వంటిల్లు వదిలి వెళ్ళటానికి నాకు కుదురుతుందా? గంటలు గంటలు నేను ఇంట్లో కనపడకుండా పోతే, ఇన్నాళ్ళు ఆ విషయం ఎవరికీ తెలియకుండా ఉంటుందా?"

వరదాచారికి మండిపోయింది....

"ఒరేయ్ వెంకా! నువ్వు చెప్పరా! ఎన్నాళ్ళనుంచి ఈ భాగోతం?" అని గర్జించాడు వరదాచారి.

వెంకడు ఇందాకటినుంచీ మతిపోయి, కళ్ళప్పజెప్పి జరుగుతున్నది చూస్తున్నాడు. ఇప్పుడు రెండు చెవులూ మూసుకుని "ఛ! ఛ!....సరళమ్మ గోరికీ, నాకూ యేటండీ! ఆయమ్మ దేవత...." అన్నాడు.

వింత చూస్తోన్న నాగమ్మ కల్పించుకుని "మంచిదేకాని ఈడు మందెట్టి మనసు మార్చేసినాడు. రోజూ సరలమ్మా, అయ్యో, ఇయ్యా, చాటుమాటున పెట్టుది" అంది.

వాడి చేతిలో అప్పటికి లడ్లు ఉన్నాయి. వరదాచారి దృష్టి వాటిమీద పడింది.

"వెధవా!....నీకా లడ్డుండలు ఎక్కడివిరా? ఏమే! రండ మొగుడికి ఇంట్లో చేసినవన్నీ దోచి పెడుతున్నావా?"

"దోచి పెట్టడం లేదు. వాడిచ్చిన కషాయానికి బదులుగా డబ్బియ్యగలిగే శక్తి లేక, కనీసం కాస్త ఫలహారం పెడదామని పెడుతున్నాను."

"ఓహ్! చాలా బాగుందమ్మా! ఎంతో బాగుంది. ఇకమీదట ఈ ఇంట్లో ఇలాంటివన్నీ కుదరవు. ఇద్దరూ బయటకు పొండి. వాడి కషాయాలన్నీ నువ్వు తాగు. వాడికి కావలసినవన్నీ చేసిపెట్టు. పొండి ఇక్కణ్ణుంచి...."

"నేను పోను! ఎందుకు పోవాలి?ఏవండీ, మీరు చెప్పండి! నా గర్భంలో పెరుగుతున్న శిశువు మీ శిశువుకాదూ?"

అంత మందిలో సిగ్గువిడిచి నాదమునిని సూటిగా అడిగింది సరళ.

నాదముని పిచ్చిచూపులు చూశాడు.

వరదాచారి అందుకుని "వెర్రి వెదవని అడుగుతే వాడేం చెప్తాడే? ఆ వెర్రిమొగుణ్ణి అడ్డుపెట్టుకుని వేషాలేద్దా మనుకుంటున్నావా? వెర్రాడికి పిల్లలేమిటి?" అన్నాడు.

నాదముని "ఇహిహి! వెర్రాడికి పిల్లలేమిటి?" అన్నాడు.

అక్కడ చేరిన అందరూ పొట్ట చేత్తో పట్టుకుని విరగబడి నవ్వారు.

వెంకడు భరించలేక "ఛూ! దేవతలాంటి అమ్మని ఇట్టాంటి మాటలంటా రేటండీ?" అని చీదరించుకున్నాడు.

ఆ చీదరింపుకు భరించలేక వరదాచారి పలుపుతాడు తీసుకుని "అదొక దేవత. నువ్వొక దేవుడివి. ఇప్పుడే నిన్ను దేవుళ్ళలో చేరుస్తాను" అని చావబాదటం మొదలుపెట్టాడు.



పాపం, వెంకడు ఏడుస్తూ ఆ దెబ్బలు భరించలేక అటూ, ఇటూ పరుగెడుతూంటే వెంటబడి బాద సాగాడు వరదాచారి.

ఆ దృశ్యంచూసి సహించలేక పోయింది సరళ. వెంకడికి అడ్డుపడి "ఆపండి! వెంకడితో నేను వెళ్ళిపోతాను. వాడినేమీ చెయ్యకండి" అంది.

వరదాచారి పలుపుతాడు కింద పడేసి రొప్పుతూ "అలారా! పొండి వెధవల్లారా!" అన్నాడు.

నిర్ఘాంతపోయాడు వెంకడు. తన దెబ్బలనుండి కారుతోన్న రక్తం తుడుచుకోవటం కూడా మరిచిపోయాడు.

"అమ్మగారూ! యేటండీ! నాతో యెక్కడి కొస్తారు?" అన్నాడు.

"ఏంరా! రానియ్యవా! నువ్వు ఈ అభాగ్యురాలిని వెళ్ళగొడతావా?" శాంతంగా అడిగింది సరళ.

"అదేంటండీ! ఏటోనండీ! రండీ! ఏం సెయ్యమంటారండీ?" ఒకదాని కొకటి పొంతకుండా మాట్లాడుతున్నాడు వెంకడు.

వెర్రినవ్వుతో అంతా చూస్తూ నిలబడ్డ నాదమునిని చూసింది సరళ.

"వెళ్ళనా?" అంది.

"వెళ్ళు" అని లోపలకు పరుగెట్టి గొడుగు తీసుకొచ్చి సరళ చేతికిచ్చి "వర్షం వేస్తోంది. తడిసిపోతావు. గొడుగువేసుకుని వెళ్ళు" అన్నాడు.

ముందుకు అడుగు వెయ్యబోతున్న సరళ కాళ్ళను "పిన్నీ!" అంటూ చుట్టుకున్నారు కమల, శ్యామల. చెరొక చెయ్యీ, వాళ్ళ తలల మీద వేసి కన్నీళ్ళను నిగ్రహించుకుంది సరళ.

వెనక్కి తిరిగి ఆ ఇంటి నొక్కసారి చూసింది. అయిదేళ్ళ కిందట ఆ ఇంట్లో ప్రవేశించింది కోడలి హోదాతో. కడుపు కింత తిండి తప్ప కట్టుకుందుకు మంచి బట్టకూడా ఎరక్కుండా ఆ ఇంట్లో

చాకిరీ అంతా చేసింది. పిల్లల్నీ, పెద్దల్నీ బంధువుల్నీ, స్నేహితుల్నీ, అందర్నీ నా వాళ్ళనుకుని అందరికీ అన్నీ చేసింది. అయిదేళ్ళు మొత్తం అకుటుంబానికి ఇంత చేశాక, కట్టు గుడ్డలతో, అపనిందలతో, గర్భవతిగా నడివీధిలోకి నెడుతున్నారు, తనచేత సకలసేవలు చేయించుకున్న ఆ వ్యక్తులు....

"పిన్నీ! పిన్నీ! నువ్వు పోవద్దు" అని ఏడుస్తున్నారు కమల శ్యామలా గట్టిగా.

రంగనాయకమ్మ, వాళ్ళని చెరొక చెయ్యీ పట్టిలాగి. "దెయ్యందగ్గిరకి వెళ్ళారంటే జాగ్రత్త!" అంది.

పిల్లలు తిరగబడి "నువ్వే దెయ్యం. నువ్వే పిశాచం, నువ్వే పో! పిన్ని మాతో ఉంటుంది" అన్నారు.

అంతమందిలో పిల్లలు తనతో అలా మాట్లాడటం సహించలేక వాళ్ళని ఏనాడూ తనచేతులతో పెంచని రంగనాయకమ్మ వాళ్ళని ఛెళ్ళు ఛెళ్ళున చెంపలు వాయగొట్టింది.

పసివాళ్ళిద్దరూ కెవ్వుమన్నారు. సరళ ప్రాణాలు విలవిలలాడిపోయాయి.

వాళ్ళిద్దరినీ దగ్గిరకు తీసుకుని ఓదార్చాలనే తపనను అతి ప్రయత్నంమీద నిగ్రహించుకుని తలవంచుకుని వంటినిండా పైట కొంగు కప్పుకొని వెంకడి వెనకాల బయటకు నడిచింది.

నాలుగడుగులు వెయ్యకుండానే "అక్కా!" అనే పిలుపు విని పించి వెనక్కు తిరిగింది. చిన్న చేతిసంచీతో వచ్చి కలుసుకున్నాడు సారధి.

"సారధీ! నువ్వూ నాతో వస్తున్నావా?" అంది సరళకొంత సంతృప్తితోనే.

"అదేమిటక్కా! నువ్వుకాక లోకంలో నా కెవరున్నారు? నీ నీడలో కాక, నేను మరెక్కడ బ్రతగ్గలను? పద! దేవుడు మనకింత అన్యాయం చేశాడు...."



"సారధీ! అలా అనుకోకురా. ఏది న్యాయమో, ఏది అన్యాయమో మనకేం తెలుసు? ఈ క్షణంలో మనకు దురదృష్టంగా తోచింది. రేపు అదే అదృష్టంగా మారుతుందేమో! నాకు దేవుడిలో నమ్మకం ఉందిరా! నేను ఎవరికీ అన్యాయం చెయ్యలేదు. దేవుడు నా కెందుకు అన్యాయం చేస్తాడు?"

సరళ సమాధానానికి సారధితోపాటు వెంకడూ ఆశ్చర్యపోయాడు!

"అవును. దేవుడు అన్నేయం సెయ్యడు" అని గొణుక్కున్నాడు తనలో తను.

ముగ్గురూ ఒకరితో ఒకరు ఏం మాట్లాడుకోకుండా నడిచారు. గుడిసె సమీపించాక నాగమ్మ మహంకాళిలా విరుచుకుపడింది. సవతి కొడుకుమీద.

"యేటిరా! ఈ దురన్నేయం? బాపనోరి ఇంటిబిడ్డని లెగ దీసుకొచ్చి మా మద్దెన బెడతావా? మేం బతకాలనా?, భగ్గుమని పోవాలనా? పెద్ద నిలవనిస్తాడా? పోరా, పో! ఏడకిపోయి ఆ బొమ్మ నెట్టుకులుకుతావో కులుకు...."

వెంకడికి ఎప్పుడు ఎదురుతిరిగి పోట్లాడటం రాదు. తన సవతితల్లితో అసలు పోట్లాడలేదు. స్థాణువులా నిలబడిపోయాడు.

చంద్ర ముందుకొచ్చి సరళచెయ్యి పట్టుకుని "రండి, అమతెగారూ! మా బావదగ్గిర కెళ్దాం, మా బావ మంచివాడు. ఏదో ఆలోచిస్తాడు" అని జైహింద్‌బాబు గుడిసెకు దారితీసింది. వెంకడు వాళ్ళ వెనకాతలే నడిచాడు.

తెల్లబోయిన జైహింద్ బాబుకి క్లుప్తంగా పరిస్థితి వివరించింది చంద్ర.

జైహింద్‌బాబు తల వంచుకు నిలబడిన సరళను జాలిగా చూస్తూ "ఇన్నాళ్ళూ మాలాంటి కూలి నాలి జనమే అభాగ్యులనుకునే

వాణ్ణి. పెద్దపెద్ద భవంతులలో ఉండే మీబోటివాళ్ళంతా అదృష్టవంత లనుకునేవాణ్ణి. కాని...." అని ఆగిపోయాడు.

"ఆ పెద్ద పెద్ద భవంతుల్లో ఉన్న మావంటి అభాగ్యురాలిని నాడు కళ్ళారా చూస్తున్నావు" అని పూర్తిచేసింది సరళ.

గయ్యాళి నాగమ్మమాత్రమే కాదు. సాత్వికురాలయిన అన్న కూడా సరళ, సారధి-తమతో ఉండటానికి భయపడింది. ప్రక్కల నలుగురు పోగయి నాలుగుమాటలు ప్రారంభించారు.

అన్నింటినీ ఎదుర్కొని, సరళనూ, సారధినీ తమతో ఉ మన్నాడు జైహింద్‌బాబు.

ఆ తరువాత సిగ్గుపడుతూ "అమ్మగారూ! మీ రిక్కడ ఎ ఉండగలరండీ?" అన్నాడు.

"నాకు చావాలని లేదు జయన్‌బాబూ! బ్రతుకుతాను. ఎల అయినా బ్రతుకుతాను. నా బాబు....నాలో పెరుగుతూన్న నా బా నాకు అండగా నిలవడంటావా?"

ఏ మాత్రం ఉద్వేగం లేకుండా స్థిమితంగా అంది సరళ. తలె ఆ ముఖం చూడలేకపోయాడు జైహింద్‌బాబు.

ఎలాగో పాలు సంపాదించి ఒక గాజుగ్లాసులో పోసి సర ముందు పెట్టాడు. సరళ వద్దనలేదు. అవి తాగి, అక్కడే ఒక వా కొంగు పరచుకుని పడుకుంది.

సారధికి బన్‌రొట్టె తెచ్చిపెట్టాడు. సారధి అది తిని జైహిం బాబుతోపాటు మైసమ్మగుడి మంటపంలో పడుకున్నాడు.

# 9

కాలేజిలో చేరినా సుధీర్, జైహింద్‌భాబుల స్నేహం అలాగే ఉండి.

జైహింద్‌బాబు ఏనాడూ సుధీర్ ఇంటికి వెళ్ళేవాడు కాదు. సుధీర్ కూడా జైహింద్‌బాబు గుడిసెకు వచ్చేవాడు కాదు. కానీ, కాలేజీలో



మాత్రం ఇద్దరూ ఎంతో ఆప్యాయంగా ఉండేవారు. జైహింద్‌బాబు సుధీర్‌కంటె చురుగ్గా ఉండేవాడు, చదువులో. సుధీర్‌కు చదువులో సహాయం చేసేవాడు. అంచేత సుధీర్‌కు జైహింద్‌బాబంటే చాలా అభిమానం ఏర్పడింది.

"సుధీర్ నా కొక్క సహాయం చెయ్యగలవా?" అని అడిగాడు జైహింద్‌బాబు ఆ రోజు కాలేజీలో.

"చెప్పు. తప్పకుండా చేస్తాను" ఉత్సాహంగా వీరుడిలాగ అన్నాడు సుధీర్.

జైహింద్‌బాబు సరళా సారధుల విషయం క్లుప్తంగా చెప్పి, "పాపం! వాళ్ళు పెద్దింటివాళ్ళు. మా మధ్య మా గుడిసెల్లో ఉండలేక పోతున్నారు. నాలుగురోజులు ఆశ్రయమియ్యి. ఏదో ఒకదారి దొరికే వరకూ మాత్రమే ఉంటారు. ఆవిడ చాలా అభిమానవంతురాలు...." అన్నాడు.

విషయం విన్న సుధీర్‌లో వీరత్వం ఎగిరిపోయింది. నానుస్తూ "ఇలాంటి విషయాలు నే నెలా చెప్పగలను? మా అమ్మనడిగి చెప తాను" అన్నాడు.

"ఎలా అయినా ఆవిణ్ణి ఒప్పించటానికి ప్రయత్నించు."

"అలాగే!"

జైహింద్‌బాబుకి సహాయం చెయ్యటం ఇష్టమే సుధీర్‌కి. అందుకే ఇంటికి వెళ్ళగానే తల్లితో అన్నివిషయాలు చెప్పి సరళా సారధులకు కొంతకాలం ఆశ్రయ మియ్యమని అడిగాడు.

తల్లికళ్ళు పెద్దవిచేసి "సరళంటే, అర్చకాచార్యులుగారి మరదలు. వెర్రాడి పెళ్ళామేనా? పనివాడితో లేచిపోయిన మనిషేనా?" అంది.

సుధీర్ తల్లిధోరణికీ, కంఠస్వరానికీ, భయపడుతూ "ఆవిడ చాలా మంచిదట!" అన్నాడు.

"మంచిదిట...." సుధీర్ కంఠాన్నీ అనుకరిస్తూ వెక్కిరిం

చింది ఆవిడ. మరింత మండిపడుతూ "మంచిదో, చెడ్డదో నీ కెందుకా గొడవలన్నీ? కాలేజికి పంపిస్తున్నది చదువుకోడానికా? ఇలాంటి వెధవగొడవల్లో తల దూర్చటానికా? అందుకే దరిద్రపు స్నేహాలు వద్దంటాను. ఇంకముందయినా ఆ కూలి వెధవల స్నేహం మానక పోయావంటే కాలేజి మానిపించి నిన్ను కూలిపనిలో ప్రవేశపెడతాను" అని కంయ్ మంది.

ఇంకొక్క మాట మాట్లాడకుండా నోరు మూసుకున్నాడు సుధీర్.

"మా అమ్మ ఒప్పుకోలేదు" అని చెప్పాడు జైహింద్ బాబుతో.

"ఆమాత్రం ఒప్పించలేక పోయావా?"

"ఒప్పుకోదు. ఆ సరళ పనివాడితో లేచిపోయిన మనిషని అంటోంది!"

"ఆవిడ మంచిదని నువ్వు చెప్పలేదా?"

"నువ్వూ, నేనూ మంచిదని అంటే ఏం ప్రయోజనం? అందరూ లేచిపోయిన మనిషని అంటున్న తరువాత...."

"అందరూ ఏదంటే దానికి అవుననటమేనా? మనం ఆలోచించే దేమీ లేదా?"

"ఏమో బాబూ! మా అమ్మ ఒప్పుకోదు."

"మా అమ్మని నేను ఒప్పించగలిగాను!"

"మీలో ఇలాంటి పట్టింపు లుండవు."

లోలోపల ఎక్కడో భగ్గుమంది. జైహింద్ బాబుకి....

"ఉండవు? ఉంటాయి. మీకు రెండింతలూ, మూడింతలూ ఉంటాయి? ఐశ్వర్యంలో-వైభోగాల్లో అందరూ ఒకటికాదు. ఔన్నత్యంలో, ఔదార్యంలో అందరూ ఒకటికాదు. కానీ, మూర్ఖత్వంలో అందరూ ఒకటే! ఒకరిని మించిపోయిన మూర్ఖత్వం మరొకరిది. అన్ని తరగతుల మనుష్యుల్లోనూ వదలకనిలిచే వారసత్వం ఇదే! మా



అమ్మ వీల్లేదంది. మా వాళ్ళంతా వాళ్ళని మా మధ్య వుండడానికి వీల్లేదన్నారు. కొందరు కొట్టడానికి కూడా తయారయ్యారు. కానీ, నేను అన్నిటికీ తట్టుకున్నాను, పాపం, మా ఇంట్లో ఉండలేక పోతున్నారని కాని...."

గిర్రున తిరిగి వెళ్ళిపోయాడు జైహింద్ బాబు. అత నలా వెళ్ళటం సుధీర్‌కి కష్టంగానే తోచింది. ఏం చెయ్యగలడు!

జైహింద్ బాబు సరళా, సారథుల సంగతి వ్యాసమూర్తికి చెప్పాడు. కొన్నాళ్ళు ఆశ్రయం ఇయ్యమన్నాడు.

"అక్కడా ఇక్కడా ఆశ్రయం సంపాదించుకోవటాని ప్రయత్నించకూడదు! ప్రతిఒక్కరూ తమకాళ్ళమీద తాము నిలబడటానికి ప్రయత్నించాలి. దయానంద వాళ్ళ కేంటీన్‌లో అసిస్టెంట్ కుక్ కావాలన్నాడు. ఈవిడ చేరుతుందేమో అడుగు. దయానంద్‌తో చెప్పి ఈవిడ కా ఉద్యోగం వచ్చేలా చూడగలను" అన్నాడు వ్యాసమూర్తి.

సరళతో ఈ విషయం చెప్పాడు జైహింద్ బాబు. సరళ పరమానందంతో వెంటనే ఒప్పుకుంది.

జైహింద్ బాబు సంకోచంగా "అమ్మగారూ! అది మిలిటరీ కేంటీన్. అక్కడ వంటపని అంటే చేపలూ, మాంసమూ ఇలాంటివన్నీ వండాలి. హెడ్‌కుక్ ఉంటాడనుకోండి. అయినా మీరు అన్నీ చెయ్యాలి!" అన్నాడు.

సరళ ఒక్క క్షణంకూడా ఆలోచించలేదు.

"ఫరవాలేదు. ఏ పనైనా చేస్తాను. నన్ను నేను పోషించుకోవటానికి ఎలాటికష్టమైనా పడతాను" అంది.

వ్యాసమూర్తి సరళలో ఆ ఆత్మాభిమానాన్ని మెచ్చుకున్నాడు లోలోపల. జైహింద్ బాబు. వ్యాసమూర్తి దయానంద్‌తో మాట్లాడారు. వ్యాసమూర్తి మాట కాదనలేని దయానంద్, సరళకు తమ

కేంటీన్‌లో అసిస్టెంట్ కుక్‌గా ఉద్యోగం ఇప్పించాడు. సరళకూ, సారధికీ రెండు గదులు సర్వెంట్ క్వార్టర్స్‌కూడా వచ్చేలాచూశాడు.

మిలిటరీ కేంటీన్‌లో అడుగుపెట్టిన సరళ శరీరం జలదరించింది. తలుపురెక్క అసరాగా పట్టుకుని అలా నిలబడిపోయింది కొన్ని క్షణాలు. హెడ్‌కుక్ వింతగా చూశాడు. తెప్పరిల్లి నిబ్బరంగా పనిలో ప్రవేశించింది సరళ.

జైహింద్‌బాబు సరళచేతిలో యాభై రూపాయలు పెట్టాడు. సరళ చెయ్యిజాపి ఆ డబ్బు తీసుకుని, "జయన్నా! ఇంతడబ్బు కెక్కడిదయ్యా!" అంది.

"నా స్కాలర్‌షిప్ డబ్బు వచ్చింది అమ్మగారూ! ఇంకా పరీక్షఫీజ్ కట్టడానికి చాలారోజు లుంధిగా! అప్పటికి మీకు జీతం వస్తుంది."

"జయన్నా! నాకు జీతంవస్తుంది. ఈ డబ్బు నీకు తిరిగి ఇస్తాను. కానీ దీనితోపాటు నీ రుణాన్ని తీర్చగలిగే అవకాశంకూడా నాకు వస్తే బాగుండును!"

"అదేంమాట అమ్మగారూ! మనలో మనం ఆ మాత్రం ఒకరికొకరం సహాయపడకపోతే ఎలా!"

"నాకూ నీలాంటి కొడుకు పుడితే బాగుండును!"

గతుక్కుమన్నాడు జైహింద్‌బాబు. ఒక పెద్దింటి ఆడపడుచు తనలాంటి కొడుకు కలగాలని కోరుకుంటోంది!

"ఇప్పుడు నేను నీ కొడుకులాంటివాణ్ణి కానా అమ్మా?" అని సరళకు నమస్కారం చేసి వెళ్ళిపోయాడు జైహింద్‌బాబు.

"అక్కా! ఏదైనా ఉద్యోగం చూసుకోవాలి!" అన్నాడు సారధి.

సరళ నవ్వుతూ "ఏడిశావ్ లేరా! ఉద్యోగం చేసుకునేరోజులు ముందున్నాయి లే! ఈసారి కాలేజీలు తెరవగానే కాలేజీలో చేరు...." అంది.



సారధి తెల్లబోతూ "నన్ను కాలేజీలో చేరమంటున్నావా ఎలా చదివిస్తావ్? అక్కడున్నప్పుడే దిక్కులేదుకాని...." అన్నాడు.

"అక్కడున్నప్పు దే దిక్కూ లేదురా! ఇప్పుడు మనకేం తక్కువ? నా తిండి కేంటీన్‌లో గడిచిపోతోంది. జీతం వస్తుంది. నువ్వు దర్జాగా చదువుకోవచ్చు."

"నువ్వు కేంటిన్‌లో తింటావా?"

"ఏం? అక్కడ చేపలూ, మాంసమేకాదు- పప్పూ, మజ్జిగా కూడా ఉంటాయి. అన్నం తినలేకపోతే బ్రెడ్ ఉంటుంది. చక్కెర పొంగళ్ళూ, పులిహోరలూ, నా చేతులతో నేను సమృద్ధిగా తయారు చేసిన ఇంట్లో స్థిమితంగా కూచుని నే నేనాడూ ఏదీ తినలేదు. ఈనాడు ఈ రొట్టెముక్క నా కెంత రుచిగా ఉందో నీకేం అర్థమవుతుంది!"

సారధి మాట్లాడలేదు.

"నువ్వు నిరుత్సాహపడకు. జయన్న నడిగి పుస్తకాలు తీసుకుని చదువుకో! మళ్ళీ కాలేజీలు తెరవగానే, జయన్న కాలేజీలోనే చేరుదువుగాని. ఇప్పుడు కూడా అనవసరంగా రోజులు వృధా చేసుకోకు! టైపు నేర్చుకుని టైప్ పరీక్షలు పాసవు...."

సారధి విభ్రాంతితో అక్కముఖం అలాగే చూస్తూ కూచున్నాడు. తన కృతజ్ఞతను మాటలలో చెప్పుకోటానికి అతనికి మాటలు దొరకలేదు.

సరళ వాత్సల్యంగా తమ్ముడి తల నిమిరి "వెర్రి నాగన్నా ఏమిటిరా! అలా చూస్తావ్? నేను చెప్పలేదూ? దేవుడు ఏది చేసినా, మన మేలుకేనని...." అంది.

నిండుగా నవ్వుతోన్న సరళను చూస్తూ "నేను కూడా అలా నవ్వగలిగితే ఈ లోకంలో నాకంటే అదృష్టవంతు లుండరు...." అనుకున్నాడు సారధి.

# 10

సరళ వేరుగా సర్వెంట్ క్వార్టర్స్‌లో ఉన్నా, నాగమ్మ వెంకణ్ణి తమతో ఉండనియ్యలేదు.

"యెధవచచ్చినోడా! నీలాటి తిరుగుబోతోళ్ళతో నా కూతురు ఉంటానికి ఈల్లేదు" అని తరిమికొట్టింది.

చేసేది లేక వెంకడు జైహింద్‌బాబునే ఆశ్రయించాడు. జైహింద్‌బాబు వెంకణ్ణి తమతో వుండమన్నాడు. అన్నమ్మ అందుకు ఒప్పుకోక "ఏంటి జయన్నా! ఎక్కడ లేనోళ్ళనీ ఇంట్లో జేరిస్తే మన కెట్టా కుదురుద్దీ? ఏదో, ఆడి దారి ఆడిని చూసుకోమను...." అంది.

"మనలో మనమే ఒకరి కొకరం లేకపోతే ఎలా అమ్మ?" అన్నాడు జైహింద్‌బాబు.

అన్నమ్మ కెంత కష్టంగా ఉన్నా, జైహింద్‌బాబును గట్టిగా వారించలేదు.

"ఇఁ! రేపు మనకేదైనా వస్తే ఈడు ఆదుకుంటాడు, ఈడి బతుక్కే ఠికాణలేదు కాని...." అంది విసుక్కుంటూ.

తన మాటలు తన తల్లి ఎంత పొరపాటుగా అర్థం చేసుకుందో గమనించిన జైహింద్‌బాబు నవ్వుకుని "అమ్మా! ఈ వెంకడు మనకు ముందు ముందు ఏదో ఆదుకుంటాడనే ఆశతో మన ఇంట్లో ఉండమనలేదు. మనం వెంకణ్ణి ఆదుకున్నట్లే, అవసరానికి మనకూ, మరొకరు ఆదుకుంటా రన్నాను" అన్నాడు.

"ఆఁ! ఆదుకుంటారు! మననుమించి యెర్రోళ్ళెవరూ ఉండరు!"

"అలా అనకమ్మా! ఈ లోకంలో ఉంటున్నది మనుష్యులే, రాక్షసులు కాదు."

ఇదంతా వింటోన్న వెంకడు కల్పించుకుని "ఊర్కే మీ



యింటిమీద పడి తింటం నాకు గిట్టదు జయన్నా! ఏదైనా పని సూపించు-ఎంత కష్టమైనా సేస్తాను." అన్నాడు,

వెంకడు అంత జాలిగా మాట్లాడడంతో అన్నమ్మతల్లి గుండె కరిగి ఇంకేమీ మాట్లాడలేక పోయింది.

"పీనాసి చచ్చినది! మొగుడంత సంపాదిస్తున్నాడు. వీడి కంత కూడెట్టలేదు గావాల!" అని నాగమ్మమీద మెటికలు విరిచింది.

చంద్రికి కూడా తల్లితో పోట్లాడే శక్తిలేదు. అయితే అది జరుగుతున్నది చూస్తూ ఊరుకోలేకపోయింది. తండ్రి తోటలోకి వెళ్ళింది.

"అయ్యా! అన్నని ఇంట్లోంచి వెళ్ళగొడితే ఎలా బతుకుతాడేంటి?" అంది తండ్రితో.

రాజయ్యకు చంద్రి అదో ప్రాణం. బంగారు బొమ్మలాఉండే చంద్రిని తనకంటి వెలుగులా చూసుకుంటాడు.

"ఆ దట్టాంటి కానిపనులు సేస్తే, ఏంసెయ్యాలే! కుదురుగా ఉండకూడదూ!"

"అన్న కాని పనులేం చెయ్యలేదయ్యా! ఆ సరళమ్మ ముఖం చూస్తే తెలియటంలా ఎంత మంచిదో?"

"ఏటోనే! మీ అమ్మ నోటితో ఎవడు గెలపగలడు?"

"నువ్వట్లా అంటే ఎలాగయ్యా! అన్న మాత్రం నీ బిడ్డ కాడూ? నేనే అట్లా దిక్కులేని పక్షినయితే నువ్వు భరిస్తావా?"

ఆ మాట వింటోనే వణికిపోయాడు రాజయ్య. చటుక్కున చంద్రిని గుండెల దగ్గరగా తీసుకుని "అంత మాటనబోకే తల్లీ! నా బంగారు తల్లి దిక్కులేని దెట్టా అవుతాదే!" అన్నాడు.

ఈ అవకాశం అందిపుచ్చుకుని చంద్రి తండ్రి భుజాలమీద ఆప్యాయంగా చేతులువేసి "మరి, అట్లానే, అన్నని కూడా దిక్కులేని పక్షిని చెయ్యకు. నువ్వు ఆదుకోకపోతే అన్న కింకెవరున్నారు?"

"మీ అమ్మ బ్రతకనిస్తుందంటే?"

"అమ్మకు తెలియనియ్యకు. ఇక్కడే తోటలోనే గుడిసె వేసెయ్యి. నీ తోటపనిలో సాయంచేస్తాడు. నీకూ సుఖంగా ఉంటుంది-అన్నకీ గడుస్తుంది. నీ చేతికింది కూలిమనిషిని మాన్పించెయ్యి...."

"ఆడికి తోటపనేం తెలుస్తాదే?"

"ఇదేం బ్రహ్మవిద్యా? నువ్వు కూడా ఉండి నేర్పిస్తే, అన్న ఎంతలో నేర్చుకుంటాడు?"

ఈ ఆలోచన రాజయ్యకి నచ్చింది. నిజమే! వెంకడిలాంటి వాడు తన చేతికింద ఉంటే తనకే సుఖం-ఈ ఆలోచన ఇదివరకే రావలసింది.

రాజయ్య, వెంకడు, జైహింద్‌బాబు కలసి, తోటలో ఒక మూల వెంకడి కోసం గుడిసెకట్టారు. కొంచెంరోజుల్లోనే వెంకడు తోటపనులన్నీ నేర్చుకున్నాడు. కలుపుమొక్కలు పీకటం, మొక్కలకి పురుగుపడితే మందులు చల్లటం....ఎరువులు వేయటం....రెండు రోజుల కొకసారి కూరగాయలు కోసి తోపుడుబండి మీద వేసుకుని అమ్ముకురావటం....ఇలాంటి పనులన్నీ సొట్టకాలుతోనే చాలావరకు చెయ్యగలుగుతున్నాడు. రాజయ్యకి చాలా సుఖంగా ఉంది.

వెంకడు ఉండడం తోటలో గుడిసెలో ఉంటున్నా, తిండి మాత్రం జైహింద్‌బాబు ఇంట్లోనే తింటున్నాడు.

"అయ్యా! నాకు జీతమియ్యి" అన్నాడు వెంకడు తండ్రితో.

రాజయ్య "ఎందుకురా?" అన్నాడు.

"నేను అన్నమ్మత్త ఇంట్లో తింటన్నా. నా జీతం ఆడియ్యకపోతే, నేనీ ఊళ్ళోనే ఉండను. మా దేశం పోతా!"

రాజయ్య నిజంగా హడలిపోయాడు. ఇప్పుడు కొడుకు అనే అభిమానం మాత్రమే కాక, వెంకడి అవసరం కూడా చాలా ఉంది రాజయ్యకి. యాభై రూపాయలు తీసి వెంకడి కిచ్చాడు.



వెంకడు పరమానందంతో ఆ డబ్బు అన్నమ్మ చేతిలో పెట్టాడు. అన్నమ్మ తెల్లబోతూ "ఏంటిరా, ఇది?" అంది.

"నా జీతం అత్తా! అయ్యని జీతమడిగాను. ఇచ్చేసినాడు. ఈడపడి తింటన్నా! ఇంతమాత్రం ఇయ్యద్దత్తా!" అన్నాడు.

అన్నమ్మ సహజంగా మంచిది. మెత్తని మనసు. "నువ్వు కొంచెం అట్టిపెట్టుకోరా! అంతా నాకియ్యటం దేనికి" అంది.

"నాకేం కావాలత్తా! నామంచికీ, చెడ్డకీ మీరులేరూ?" అమాయకంగా నవ్వాడు వెంకడు.

వెంకడు కూడా తన బిడ్డల్లో ఒకడుగానే అనిపించింది అన్నమ్మకి.

అన్నమ్మ పోరుపడలేక రత్నమ్మకి ఒక సంబంధం కుదిర్చాడు జైహింద్‌బాబు. తీరా ముహూర్తం వేళకి పెళ్ళికొడుకు దగ్గిర బంధువు లెవరో చచ్చిపోయారు. అది అపశకునంగా తోచింది పెళ్ళివారికి. శకునాల్లో నమ్మకం ఎవరికీ తక్కువలేదు. అంచేత ఆ పెళ్ళివారు ఈ సంబంధం మాకొద్దు" అనేశారు. రత్నమ్మ లేనివాళ్ళ పిల్ల అయినా, చాలా అందంగా ఉంటుంది. పెద్దిళ్ళలో పనికి కుదిరి అశుచి, శుభ్రత కొంతవరకు నేర్చుకుంది. రత్నమ్మను చూడగానే పెళ్ళిచేసుకోవాలని ఎంతో ఆశపడ్డాడు పెళ్ళికొడుకు. అయినా శకునానికి భయపడిపోయాడు.

అటు చంద్రమ్మకీ నాగమ్మ సంబంధాలు చూస్తోంది. మళ్ళీ మరో సంబంధం కుదిర్చింది. ఆ పెళ్ళికొడుక్కి పోస్టాఫీస్‌లో ఉద్యోగం. పల్లెటూళ్ళో కొంచెం పొలంకూడా ఉంది. చంద్రిని చూసి రెండు వందలు జీలి కట్టటానికి ఒప్పుకుని మనువు కుదుర్చుకున్నాడు. చంద్రి ఇదివరకులాగానే పెళ్ళికొడుక్కి ఉత్తరం రాసిపడేసింది. పెళ్ళికొడుకు వెనుకటిలాగానే పెళ్లి వద్దనేశాడు. కానీ కారణం చెప్పకుండా వద్దనలేదు....

"మా కెవరో ఉత్తరం రాశారు. మీ చంద్రికి మరెవరిమీదనో

మనసుందట! ఈ పెళ్ళయితే అది బావిలోపడి సస్తాదంట. మాకెందు కొచ్చిన గొడవలు? దేశం గొడ్డోయిందా? మావోడికి పిల్లే దొరకదా! దొరబాబులా ఉజ్జోగం చేస్తున్నాడు" అన్నారు పెళ్ళిపెద్దలు.

ఈ మాటలు విన్న నాగమ్మ మండిపోయింది. తన కూతురి పెళ్ళి చెడగొట్టే ఉద్దేశం ఎవరికుంటుంది? ఎవరు రాసి ఉంటారు, ఆ ఉత్తరం? జైహింద్‌బాబే రాయించి ఉంటాడనుకుంది. అ గుడిసె మీద విడుచుకుపడింది.

"ఇదేం పొయ్యేకాలమే! నా కూతురిపెళ్ళి చెడగొడితే నా కూతుర్ని నీ కొడుక్కిచ్చి సేస్తాననుకుంటా వుండాదేమో నీకొడుకు! ఈ నాగమ్మ అట్లాంటి కట్టుదప్పిన పనులెప్పుడూ సెయ్యదని తెలుసుకోండి!"

అన్నమ్మ సాత్వికురాలే కాని, ఇంటిమీద పడి తిట్టిపోస్తోంటే ఎలా భరించగలదు?

"యేంటే? నీ కూతురిపెళ్ళి నా కొడుకు సెడగొట్టాడా! ఆడికేం కరమమే! రాజానాగ చదువుతున్నాడు. నువ్వేసేంటే, కట్టుదప్పిన పనులు సెయ్యనిదానివి? ఈ అన్నమ్మ అసలు కట్టుదప్పదే!"

పెళ్ళాం బిడ్డలున్న రాజయ్యతో లేచివచ్చిన నాగమ్మ, రోజు తాగుబోతు మొగుడిచేతిలో చావుదెబ్బలు తింటూ వాణ్ణి తిట్టుకునే అన్నమ్మ—ఒకరిని మించి ఒకరు "నేను కట్టుగప్పనిదా"న్నంటే, "నేను కట్టుదప్పనిదా"న్నని హోరాహోరీ పోట్లాడుకున్నారు.

నాగమ్మ నోరు చాలా చెడ్డది. అది విజృంభించి "ఒసే! బంగారంలాంటి నా బిడ్డని నీ కొడుక్కి కట్టబెడతానని అనుకోకు. సదివాడులే, మాలావుసదువు—ఎంత సదివినా, ఈడు సేసేది కూలి పనేగా! ఏటుంది అడికి! మంద సంసారం తప్ప?" అని విదిలించింది.

"యేటే? యేటికూశావ్? నా బిడ్డ కూలిపని సేస్తాడా? ఆడు పెద్ద దొరబాబవుతాడే! నీ యసుమంటోళ్ళంతా ఆడి కాల్లకాడే పడుం



డాల! నీ బిడ్డ దేనికే! నాకొడుక్కి? మా కాల్ల మీదపడ్డా నీ కూతుర్ని సేసుకోనే! లచ్చిందేవంటి పిల్ల ఏరికోరి చేసుకుంటది నా కొడుకుని. సూడలేక నువ్వి కుళ్ళిపోవాల!"

"ఎన్నడో సూడలేక నే కుళ్ళిపోతానంటం దేనికే! మీ రంతా యిప్పుడే కుళ్ళి సస్తన్నారే! కుదిరిన సంబందాలు కూలదోస్తున్నారే! ఒసే! ఇప్పుడే సెప్తన్నా! మీ రెంతగింజుకు సచ్చినా, ఆ కూలిసచ్చినోడికి నా బిడ్డనియ్యను."

అరుచుకుంటూ పోయింది నాగమ్మ. అన్నమ్మ కింద కూలబడి వెక్కి వెక్కి ఏడవసాగింది. సాయంత్రం జైహింద్‌బాబు వచ్చే వరకూ అలా ఏడుస్తోనే ఉంది. జైహింద్‌బాబు గుండె చెదిరిపోయింది.

"ఏంటమ్మా? మళ్ళీ అయ్య వచ్చాడా? నిన్ను కొట్టాడా?" అని అడిగాడు ఆరాటంగా.

అన్నమ్మ మరింత ఏడుస్తూ "నువ్వు కూలోడివంటరా! ఎంత సదువుకున్నా, నువ్వు కూలిపనే సేస్తావంట!" అంది.

జైహింద్‌బాబుకి తలా. తోకా అర్థంకాలేదు. నెమ్మదిగా తల్లిని ప్రశ్నలడిగి విషయమంతా తెలుసుకున్నాడు. అతని మనసంతా చికాకు పడిపోయింది. చంద్రి ఏ ఉపాయంతో, తన పెళ్ళిసంబంధాలు తప్పించుకోగలుగుతోందో అతని కర్థమయింది.

"ఊరుకోమ్మా! నాగమ్మత్త సంగతి తెలిసిందేగా!" అన్నాడు ఓదారుస్తూ...

"అది కాదురా! నువ్వు కూలోడివంట! నీకు దొరికేది కూలి పనేనంట! ...." తలుచుకుని తలుచుకుని కుమిలిపోసాగింది అన్నమ్మ.

నాగమ్మ మాటలన్నింటిలో తన తల్లిని బాధిస్తున్నది ఈ విషయమేనని అర్థమయింది జైహింద్‌బాబుకి. బాధ, జాలీ రెండూ కలిగాయి అతనికి.

"కూలోడయితే తప్పేముందమ్మా? మనసు మంచిది కావాలి కాని, బ్రతకటానికి ఏ మార్గమయితేనేం?"

"ఒరేయ్! వద్దురా! అంతమాటనకురా! నువ్వు దొరబాబువి రా! దొరనాగ బతకాలిరా!" ఏడుస్తూ అంది అన్నమ్మ.

"ఏడవకమ్మా! దొరనేలే!" నవ్వుతూ అన్నాడు జైహింద్ బాబు.

నవ్వుతోన్న కొడుకు మొహం చూసి కన్నీళ్ళు తుడుచుకుం[ది] అన్నమ్మ.

# 11

"చంద్రి నిన్ను మద్దేనపేల తోటలోకి రమ్మంది." అని రహస్యంగా చెప్పాడు వెంకడు జైహింద్ బాబుతో—

ఆ మధ్యహ్నం లంచ్ టైంకు కాలేజినుంచి తిన్నగా రాజయ్య తోటకి వచ్చాడు జైహింద్ బాబు—చంద్రి జైహింద్ బాబుని చూడగానే అతడి రెండు చేతులూ పట్టుకుని "నన్ను క్షమించుబావా! నామూలంగా నువ్వూ, అత్తయ్య, అమ్మచేత తిట్లు తిన్నారు—" అంది బాధగా.

అతను నవ్వి "అది సరేకాని, నువ్వింత గ్రంథ సాంగురాలి వెప్పుడయ్యావు? నీ పెళ్ళి నువ్వే చెడగొట్టు కుంటున్నావా! నీమీద నువ్వే అపనిందలు వేసుకుంటే నీకు పెళ్ళేలా అవుతుందీ?" అన్నాడు.

"ఏం? నామీద నేను వేసుకున్న అపనిందలు నమ్మి నువ్వు నన్ను పెళ్ళి చేసుకోవా?"

"ఏమో చంద్రి! నేను నిన్ను పెళ్ళి చేసుకోవటం జరిగే పనేనా?"



"ఎందుకు జరగదు?"

"మీ అమ్మ అన్నట్లు నేను కూలివాణ్ణే అవుతానేమో...."

"ఛ! ఛో!"

"ఒకవేళ కూలివాణ్ణే అయితే, అప్పుడేం చేస్తావు చంద్రా? అందుకే ఇంక ముందయినా బుద్ధి తెచ్చుకుని నీమీద నువ్విలాంటి అపనిందలు వేసుకోకు!"

"అంటే! నువ్వు కూలివాడివయితే నేను మరొకళ్ళని చేసుకుంటాననా? నేనూ చెయ్యగలను కూలిపని—నీకంటె బాగా చెయ్యగలను."

"చంద్రా!" తన చేతులలోఉన్న చంద్రి చేతులు ఆప్యాయంగా నొక్కాడు జైహింద్ బాబు—

"ఏమో చంద్రి! మనచుట్టూఉన్న మన వాళ్ళందరినీ చూస్తోంటే నాకు భయంగా ఉంది-బెంగగా ఉంది."

"భయందేనికి బావా? ఇంకొక్క మూడేళ్ళలో నీ చదువు పూర్తయి పోతుంది. అప్పుడే వాళ్ళే నీ అధికారానికి దాసోహమంటారు—"

"అమ్మలాగ నువ్వూ బంగారు కలలు కంటున్నావు—"

"అవును-అందులో తప్పేముందీ?"

"ఆశలు పెంచుకుంటే భంగపాడు భరించటం కష్టం...."

"ఫరవాలేదు బావా! దురాశలు కానంతవరకూ ఆశలు పెంచుకోవచ్చు....ఒకవేళ అవి నెరవేరకపోయినా భరించను వచ్చు...."

"చంద్రి! నాకోసం నువ్వు మూడేళ్ళు ఆగగలవా? మీ అమ్మ ఆగనిస్తుందా!"

"మూడేళ్ళుకాదు—నూరేళ్ళు ఆగుతాను—సాధ్యమయినంత వరకూ అమ్మని లొంగదీసు కోవటానికే ప్రయత్నిస్తాను. కలిసి రాకపోతే, అప్పుడిక ఎదురు తిరుగుతాను—ఏం? సరళమ్మకి దారి

చూపించినట్లు నాకు దారి చూపించలేవా? మా అన్నని ఆదుకున్నట్లు నన్ను ఆదుకోలేవా?"

"ఛ! అంత మాటనకు చంద్రి! మనకేం తక్కువే? కాలేజీలో నేనెంత బాగా చదువుతానో తెలుసా? మూడు నాలుగేళ్ళలో పెద్ద ఉద్యోగస్థుణ్ణయి పోతాను-అప్పుడు మీ అమ్మ నన్ను బ్రతిమాలి మరీ పిల్నిస్తుంది-"

"చాటుగా తనే పెద్దకి తప్పుకట్టేస్తుంది!"

ఇద్దరూ భావి బంగారు కలలో తేలిపోతూ కులాసాగా నవ్వుకున్నారు.

రత్నమ్మకు మళ్ళా పెళ్ళి సంబంధం చూశాడు. దాని కర్మ ఏమిటో కాని ఈసారికూడా సరిగ్గా పెళ్ళికి ముందు మొగపెళ్ళివారిలో ఎవరో చచ్చిపోయి పెళ్ళి ఆగిపోయింది.

ఇలా రెండు మూడుసార్లు జరగటంతో, రత్నమ్మది అరిష్ట జాతకమనీ, దానికి పెళ్ళి అనుకునే సరికల్లా మొగపెళ్ళి వారిలో ఎవరో ఒకరు చచ్చిపోతారనీ, వార్త వ్యాపించి పోయింది. అక్కడితో దానికి సంబంధాలు రావటం ఆగిపోయాయి.

అన్నమ్మ బెంగపడి పోయింది.

సుందరీబాయికి కూడా వయసొచ్చింది-అక్కకు పెళ్ళయితేకాని తనకి పెళ్ళికాదు-అక్కది ముదనష్టపు జాతకం-దానికి పెళ్ళిలేదు___ ఇంక తన గతేమిటి? తలుచుకుంటేనే గుండె గుభిల్లుమనేది సుందరీబాయికి___

"అక్కకి పెళ్ళయితేకాని, నాకు చెయ్యరా?" అని అడిగేసింది తెగించి ఇంట్లో___

జైహింద్‌బాబు నిర్ఘాంత పోయాడు-తన అక్కకి వచ్చిన సంబంధాలన్నీ తప్పి పోతున్నాయని బాధపడటానికి మారుగా ఇలా అక్కసుతో సుందరీబాయి మాట్లాడుతోంటే ఏం సమాధానం చెప్పాలో అతనికి తోచలేదు___



అన్నమ్మ చికాకుపడి "నోరుముయ్యే! పెద్దదానికి కాకుండా చిన్నదానికి పెళ్ళి సేస్తారంటే? అట్టయితే పెద్దదానికసలు పెళ్ళవుద్దా?" అని కసిరింది___

"నాకర్మ!" అని తలబాదుకుంది సుందరీబాయి___రత్నమ్మ ముఖం ముడుచుకుంది.

ఒకరోజు పనిలోనుండి వచ్చిన అన్నమ్మ గుండె పట్టుకుని "ఓర్నాయనో" అంటూ కూలబడి పోయింది, ఒళ్ళంతా చెమటలు కక్కుతుండగా.

అదృష్టవశాత్తు ఆ సమయానికి జైహింద్‌బాబు ఇంట్లో ఉండటంవల్ల వెంటనే తల్లిని ఆస్పత్రిలో చేర్పించాడు___హార్ట్ ఎటాక్ అన్నారు. పై ప్రాణాలు పైన పోయాయి జైహింద్‌బాబుకి___

తన తల్లిని మృత్యు ముఖంనుండి తప్పించటానికి సర్వశక్తులూ ధారపోశాడు-ఎలాగో అన్నమ్మ బ్రతికి బయటపడింది. ఎంత గవర్నమెంట్ హాస్పిటల్ అయినా పై ఖర్చులకే టోలెడయింది జైహింద్‌బాబుకి-ఉన్నదంతా ఊడ్చుకుపోగా వ్యాసమూర్తి దగ్గిర అప్పుకూడా చెయ్యవలసి వచ్చింది.

ఒకసారి హార్ట్ ఎటాక్ వచ్చి తగ్గాక గుండె చాలా బలహీనంగా ఉంటుందనీ, రోగి బాగా విశ్రాంతి తీసుకోవాలనీ, బలమైన ఆహారం తీసుకోవాలనీ చెప్పారు డాక్టర్లు-రెండవసారి హార్ట్ ఎటాక్ వస్తే బ్రతకటం కష్టమనికూడా చెప్పారు. ఇంటికి రాగానే పనిలోకి బయలుదేరబోయింది అన్నమ్మ. దెబ్బలాడి మానిపించాడు జైహింద్‌బాబు-

"నేను పనిలోకి పోకపోతే ఎట్టా గడుస్తదిరా?" అని బావురుమంది అన్నమ్మ.

జైహింద్‌బాబు తల్లిని సముదాయిస్తూ "అమ్మా! నువ్విలా చీటికీ మాటికీ బెంగపడిపోతే నీ గుండె జబ్బు ఎక్కువయి పోతుంది-నువ్వు విశ్రాంతి తీసుకోవాలన్నారు డాక్టర్లు" అన్నాడు.

"పోనీయ్‌రా! నేను బతికి ఎవడి నుద్ధరించాలి? నాకోసం

డబ్బు తగలెయ్యబోకురా! నువ్వు సదువుకోవాలి! రత్తికి పెళ్ళి సెయ్యాలి—'' వగరుస్తూ అంది అన్నమ్మ.

జైహింద్‌బాబు భయపడిపోయి "అమ్మా! నువ్వు కళ్ళు మూసుకు పడుకోబోతే నేనెక్కడికయినా పారిపోతాను." అన్నాడు.

ఆ మాటలతో మాట్లాడకుండా పడుకుంది అన్నమ్మ.

జైహింద్‌బాబు తల్లి పక్కలో కూచుని "అమ్మా! చూ చూస్తూ నిన్నెట్లా చంపుకుంటామే? ప్రాణాలు పోతే పోనియ ఎవరూరుకుంటారే! మాలో ఎవరినైనా నువ్వట్లా చంపుకోగల చెప్పు?" అన్నాడు.

"ఓయ్! దేవుడా! మీరంతా సల్లగుండాలి!" భయంగా అంది అన్నమ్మ.

"మరి, మేమూ అలాగే నువ్వు చల్లగా ఉండాలని కోరుకుంటాం-అయ్య అట్లా తాగి ఇల్లు పట్టకుండా తిరుగుతాడు—నువ్వు కూడా మమ్మల్ని అన్యాయంచేసి పోతానంటే ఎలాగే?"

"లేదురా! లేదు-నేను సావను. నువ్వు పెద్ద పెద్ద సదువులు సదివి సానా గొప్పోడివయితే సూడొద్దూ?"

ఎప్పటిలా తల్లి మాటలు ఖండించలేదు. జైహింద్‌బాబు గుండెలు చీల్చుకుని రాబోయే నిట్టూర్పుని అతి ప్రయత్నం మీద అణచుకున్నాడు.

జబ్బు పడ్డ అన్నమ్మను చూట్టానికి వచ్చింది చంద్రి. నాలుగు బత్తాయి పళ్ళు కూడా తెచ్చింది. చంద్రిని చూడగానే అన్నమ్మ ముఖం వికసించినా, వెంటనే మూతి ముడుచుకుని బత్తాయి పళ్ళు చేత్తో పక్కకు నెట్టేసి "ఇయ్యన్నీ నాకేం వద్దు. ఎందుకొచ్చినా వీడకి? ఎల్లెల్లు-మీ అమ్మసూస్తే మల్లీ ఓ పెద్ద బాగోతం!...." అని కసిరింది.

చంద్రి చిన్న బుచ్చుకోకుండా అన్నమ్మ పక్కనే కూచుని "నామీద కోపమెందుకత్తా! నేనేం చేశాను?" అంది ముద్దుగా.



శ్రీ సిద్ధార్థ బుక్ పాయింట్స్, ... పేట - నెల్లూరు-3.

చంద్రిని మరోసారి కసరలేక పోయింది అన్నమ్మ.

రెండు బత్తాయి పళ్ళు వొలిచి ఆ తొనలన్నీ "వద్దు, వద్దం"టోన్న అన్నమ్మ చేత తినిపించింది చంద్రి.

చంద్రిని వాత్సల్యంగా చూస్తూ "వరస కాకపోయె గదటే." అని నిట్టూర్చింది అన్నమ్మ.

చంద్రీ, జైహింద్‌బాబూ, నిశ్శబ్దంగా ఒకరి నొకరు చూసుకున్నారు.

# 12

అప్పుడప్పుడు మిలటరీ కేంటీన్‌కి వచ్చి సరళ యోగక్షేమాలు కనుక్కుంటూ ఉండటం జైహింద్‌బాబుకి అలవాటే!

జైహింద్‌బాబుని చూడగానే సరళ సంతోషంగా "జయన్నా! ఈ సంవత్సరం మా సారధి కూడా కాలేజీలో చేరుతున్నాడు. మీ కాలేజిలోనే చేర్పించు" అంది!

"అలాగే సరళమ్మా!" అన్నాడు జైహింద్‌బాబు.

తన కష్టార్జితం....తను అపురూపంగా దాచినది. డబ్బు తీసి లెక్కపెట్టి తమ్ముడి చేతిలో పెట్టింది సరళ.

చటుక్కున ముందుకు వంగి అక్క పాదాలకు నమస్కారం చేశాడు సారధి.

"ఛ! ఛ! ఏమిటిరా ఇది?" అంది సరళ వెనక్కు తగ్గుతూ.

"ప్రస్తుతానికి చెయ్యగలిగింది ఇదొక్కటే! ఇంత కంటె ఏమైనా, ఎప్పటికైనా చెయ్యగలిగితే అదృష్టవంతుణ్ణే!"

"ఏడిశావ్! పో!" ముద్దుగా కసిరింది.

పుస్తకాలు పట్టుకుని జైహింద్‌బాబుతో కలిసి కాలేజికి వెళుతున్న సారధిని కళ్ళ పండువుగా చూసుకుంది.

ఒక గంటలోనే తిరిగి కేంటీన్‌కి వచ్చేశాడు జైహింద్‌బాబు.

సరళ ఆశ్చర్యపోతూ "అదేం? అప్పుడే వచ్చేస్తావు? కాలేజి లేదా? సారధి ఏడి?" అంది.

"కాలేజి ఉంది. సారధి కాలేజిలో చేరాడు—చదువుకుంటున్నాడు."

"మరి, నువ్వు వచ్చేశావేం!"

"నేను కాలేజి మానేశాను."

"అదేం?"

"ఇక్కడే నేను సర్వర్‌గా చేరాను."

సరళ తెల్లబోయి నిలబడి పోయింది.

"ఏయ్ సర్వర్! రెండు బ్రెడ్ అండ్ బటర్. రెండు ఆమ్లెట్స్ తీసుకురా!"

అని డైనింగ్ హాలులోంచి కేక వినిపించేసరికి అవి తీసుకుని డైనింగ్ హాల్లోకి వెళ్ళిపోయాడు జైహింద్‌బాబు.

తల్లి అనారోగ్యం....మందులు, ఆహారం....ఇవన్నీ కాక, తల్లి సంపాదన లేకపోవటం....రత్నమ్మ పెళ్ళి సమస్య....వీటన్నిటితో తన చదువు కొనసాగించుకోవటం అసంభవమనిపించింది జైహింద్‌బాబుకి.

అన్ని విషయాల్లోనూ, తనకు అండగా ఉంటోన్న వ్యాసమూర్తినే ఈ విషయంలోనూ ఆశ్రయించాడు. కాలేజి మానేసి ఉద్యోగం చేస్తానంటున్న జైహింద్‌బాబుని చూసి చాలా బాధపడిపోయాడు వ్యాసమూర్తి.

"వద్దు! నువ్వు కాలేజి మానకు. మీ వాళ్ళలో నీబోటి వాళ్ళు ఒకరిద్దరన్నా కనిపిస్తున్నారని ఎంతో ఆనందించాను. నువ్వూ కూలి పనిలోకి దిగిపోతావా? వీల్లేదు. నిన్ను నేను చదివిస్తాను!..." ఆవేశంగా అన్నాడు వ్యాసమూర్తి.

"బాబుగారూ! చదువు మానుకోవటం నాకు సరదా అనుకుంటున్నారా? చదువు మానుకోవలసి వచ్చినందుకు నేను అనుభవించే



శ్రీ సిద్ధార్థ బుక్ పాయింట్,
నెల్లూరు-3.

క్షోభ తక్కువది అనుకుంటున్నారా? నన్నెవరూ చదివించక్కర్లేదు. నాకు స్కాలర్‌షిప్ వస్తుంది. కానీ తన రక్తమాంసాలన్నీ మా కోసం కరిగించి, ఇప్పుడు రోగంతో మంచమెక్కిన తల్లి, పెళ్ళి కావలసిన ఇద్దరు చెల్లెళ్ళు-వీళ్ళందరినీ ఎవరు పోషిస్తారు సార్?"

"ఏం? మీ నాన్న ఏమయ్యాడు? చచ్చాడా?"

"చచ్చి ఉంటే, మా అమ్మ కీనాడు ఈ రోగం వచ్చేది కాదేమో! మా నాన్నకి అన్నీ అమరించి పెట్టలేక. మానాన్న చేతిలో దెబ్బలు తినలేక....మా అమ్మ ఓపికంతా హరించుకు పోయి జీవశ్చవంలా తయారయింది. ఎప్పుడో వస్తాడు-తిన్నది తింటాడు - అందింది పట్టుకు పోతాడు - అంతే, మా నాన్న...."

"మీ నాన్నకి పట్టని సంసారం నువ్వెందుకు పట్టించుకోవాలి? ఎవరికీ పట్టనిది నువ్వొక్కడివే అందరికోసం ఎందుకు పాటుపడాలి? నువ్వెందుకు చదువు మానుకొని నీ జీవితం నాశనం చేసుకోవాలి?"

తనమీది అభిమానంతో ఆవేశంగా మాట్లాడుతోన్న వ్యాసమూర్తినిచూస్తే గౌరవం పొంగుకొచ్చింది జైహింద్‌బాబు మనసులో.

"బాబుగారూ! దేశంలో ఇంతమంది ఉన్నారు. అందరికీ జరుగుతోన్న అన్యాయాలు తెలుసు. ఎవరికీ పట్టని ఆ అన్యాయాలు కొందరే ఎందుకు పట్టించుకుంటున్నారు! అవి ఖండించాలని కొందరే ఎందుకు తాపత్రయపడుతున్నారు?

ఎక్కడో, ఎవరిసంగతో ఎందుకు బాబుగారూ! మీరే ఉన్నారు _ఎవరు పట్టించుకోని మాబోటి వాళ్ళ కష్టసుఖాలు మీ రొక్కరూ ఎందుకు పట్టించుకుని, మమ్మల్ని పైకి తేవాలని పాటుపడుతున్నారు? ఒక కుటుంబంలోనైనా, దేశంలోనైనా ప్రపంచంలోనయినా అందరి కోసం పాటుపడేది ఎప్పుడూ కొందరేకదా సార్!"

"నువ్వు బాగా చదువుకుని ఎంతో ఎంతో పైకివస్తావని చాలా ఆశపడ్డాను...." నిరాశగా అన్నాడు వ్యాసమూర్తి.

"అదేమిటి సార్! మీరు అలా మాట్లాడతారు? చదువు మానేసి ఉద్యోగంలో చేరినంత మాత్రాన పైకి రాలేనంటారా?"

వ్యాసమూర్తి నాలుక కరుచుకుని జైహింద్‌బాబు భుజంతట్టి, "ఎందుకు రాలేవు? నీలాటి వాళ్ళు ఎక్కడున్నా పైకి వస్తారు" అన్నాడు. కానీ, ఆ కంఠంలో ఏ కోశానా ఉత్సాహంలేదు.

మళ్ళీ దయానంద్ సహాయంతోనే, మిలిటరీ కేంటీన్‌లో సర్వర్‌గా చేరాడు జైహింద్‌బాబు.

సరళ ఇది భరించలేక పోయింది!

"నాకు సారధి ఒకటీ, నువ్వు వేరొకటీ కాదు. నువ్వు చదువుకో! ఎలాగో అవస్థపడుదాం!" అంది.

"నా అదృష్టం సరళమ్మా! నన్ను చదివిస్తామని ఉన్నవాళ్ళూ లేనివాళ్ళూ, యజమానులూ, స్నేహితులూ అందరూ అంటున్నారు. కానీ, నేను నా కుటుంబాన్ని ఆదుకోవాలి సంపాదించాలి."

ఇంకేం మాట్లాడగలదు సరళ.

జైహింద్‌బాబు చదువు మానేసినందుకు సుధీర్‌బాబు కూడా బాధపడ్డాడు. జైహింద్‌బాబును వెతుక్కుంటూ కేంటీన్‌కి వచ్చి అక్కడ సర్వర్‌గా పనిచేస్తున్న అతణ్ణి పలుకరించలేక ఆగిపోయాడు.

తనపని అయిపోయాక బయటికి వచ్చి "ఇలా వచ్చావేం సుధీర్?" అని తనే పలకరించాడు జైహింద్‌బాబు.

"నీ కోసమే!"

"మరి నన్నెందుకు పలకరించలేదు?" అని తను అడగలేదు. సర్వర్‌గా పనిచేస్తున్న తనను సుధీర్ ఒక స్నేహితుడిగా పలకరించలేడని జైహింద్‌బాబుకి తెలుసు. అంచేత అలాటిప్రశ్న లడిగి అతణ్ణి ఇబ్బందిపెట్ట దలచుకోలేదు.

"నువ్వు నిజంగా కాలేజి మానేశావా?" గిరగిర కన్నీళ్ళు తిరుగుతుండగా అన్నాడు సుధీర్.

ఆ అభిమానానికి కరికిపోయి సుధీర్ చేతులు ఆప్యాయంగా



పట్టుకుని "ఏం చెయ్యను చెప్పు, పరిస్థితు లలావచ్చాయి" అన్నాడు జైహింద్‌బాబు, తనకూ కన్నీళ్ళు తిరుగుతుండగా....

అప్పటివరకూ తను చదువు మానెయ్యవలసి వచ్చినందుకు ఎవరిముందూ కన్నీళ్ళు పెట్టుకోలేదు జైహింద్‌బాబు. కానీ, తన క్లాస్‌మేట్ అయిన సుధీర్‌ముందు అతని నిగ్రహం సడలిపోయింది.

సుధీర్, జైహింద్‌బాబు భుజంచుట్టూ చెయ్యివేసి "ఛః ఛః నేను నీకేమీ చెయ్యలేకపోతున్నాను. ఒక్క రూపాయి నా చేతిలో పెట్టడానికి మా అమ్మ లక్ష యక్ష ప్రశ్నలు వేస్తుంది" అన్నాడు.

"ఫరవాలేదులే! నువ్వు చక్కగా చదువుకుంటావుగా! పెద్ద ఉద్యోగస్థుడివవుతావు-అప్పుడు నాకు సహాయం చేద్దువుగాని...."

"ఓ! తప్పకుండా చేస్తాను" ఉత్సాహంగా అన్నాడు సుధీర్.

జైహింద్‌బాబుకు మనసు చివుక్కుమంది. ఆ క్రిందటిరోజు వరకూ అతడే సుధీర్‌కి చదువులో సాయం చేశాడు. ఇప్పుడు సుధీర్ ముందు ముందు ఉద్యోగస్థుడై తనకు సాయం చేస్తానంటున్నాడు! అవును! చదువులో తనకంటె తెలివితక్కువ వాడైనా ఉద్యోగస్థుడయ్యే అవకాశాలు అతనికే ఉన్నాయి.

తమ బాటలు చీలిపోయినా జైహింద్, సుధీర్‌బాబులు తమ స్నేహం మానలేదు. సుధీర్ అప్పుడప్పుడు వచ్చి జైహింద్‌బాబుతో మాట్లాడేవాడు. సుధీర్ చెప్పే కాలేజీ కబుర్లు ఎంతో ఆరాటంగా విని అంతకు మించిన నిరాశతో కొన్నిక్షణాలు క్రుంగిపోయేవాడు జైహింద్‌బాబు. అంతలోనే ఉత్సాహం తెచ్చిపెట్టుకునేవాడు.

సుధీర్ చిన్నతనంలో తనకు బహుమానంగా ఇచ్చిన ఆంజనేయస్వామి తాయత్తునుమాత్రం జాగ్రత్తగా తన గుండెలమీద అలాగే దాచుకున్నాడు.

అది చూసి సుధీర్ నవ్వి "నీకు ఆజంనేయస్వామిలో భలే నమ్మకముందే!" అన్నాడు.

"నా విశ్వాసం ఆంజనేయస్వామిలో కాదు. మన స్నేహంలో.

ఆ రక్షరేకు మన స్నేహానికి చిహ్నం...." అన్నాడు జైహింద్ బాబు.

ఆ మాటలకు సుధీర్ చాలా ఆనందించాడు. జైహింద్‌బాబు కాలేజీ మానేసినా, అప్పుడప్పుడూ సుధీర్‌తో సాహిత్యం గురించి మాట్లాడేవాడు. తనతో సమానంగా సుధీర్ ఆలోచించలేడని జైహింద్‌కు తెలుసు. కానీ, సుధీర్ తప్ప అలాంటి విషయాలు మాట్లాడటానికి తన కెవరున్నారు?

రత్నమ్మకి మరోసారి అతి ప్రయత్నంమీద సంబంధం కుదిర్చాడు జైహింద్‌బాబు. అదేం విచిత్రమో, ఈసారి కూడా అటువైపు ముసలమ్మ ఎవరో చచ్చిపోయింది. అక్కడితో అందరికీ రత్నమ్మకి పెళ్ళి అనుకోవటాకే భయం వెయ్యసాగింది.

చలమయ్య పనీపాటా లేకుండా పోరంబోకులాగా తిరిగేవ్యక్తి చలమయ్య అనే పేరు షోగ్గాలేదని తనను 'చలం' అని పిలిపించుకుంటాడు. అతనిది ఒక పల్లెటూరు. కొద్దిగా పొలాలున్నాయి.

కుటుంబంలో ఆడామొగా అందరూ ఉదయం మొదలు సాయింత్రంవరకు వంచిన నడుం ఎత్తకుండా పాటుపడతారు. ఎప్పుడైనా కాస్త తీరిక దొరికితే వడ్లు దంచుకుంటారు. పప్పులు బాగుచేసుకుంటారు. కారాలు కొట్టుకుంటారు.

ఇంకా తీరిక దొరికితే ఒకరి తలల్లో మరొకళ్ళు పేలు చూసుకుంటారు. వాళ్ళు అనుభవించే "సరదా" ఆ పేలు చూసుకోవటమే!

కంటోన్ మెంట్ ఏరియాలో ఉన్న గుడిసెల్లో చలమయ్య కెవరో బంధువులున్నారు. వాళ్ళని చూడటానికి వచ్చినప్పుడు ఒకసారి సుందరీబాయి బల్లదుకాణంలో బీడీలు కొన్నాడు. సుందరీబాయి వాడికి నచ్చింది. రోగంతో పడుకున్న తల్లి-పనిలోకిపోయే అక్క, అన్న.... ఒంటరిగా బల్ల దుకాణంమీద వయసులో ఉన్న ఆడది.... ఈ వాతావరణం కూడా నచ్చింది వాడికి.

"చలమయ్యా ఇదిగో! యింద, బీడీలు" అని అందిస్తున్న



సుందరీబాయికి కన్నుకొట్టి నవ్వి "నాపేరు చలమయ్యకాదు-చలం" అన్నాడు చలమయ్య.

సుందరీబాయికి 'చలం' అన్న పేరు నచ్చింది. ఆ చలం కన్ను కొట్టడమూ నచ్చింది-కన్ను కొడుతూ నవ్వడమూ నచ్చింది.

"ఛీ! పో!" అంది ముద్దు ముద్దుగా, సిగ్గు సిగ్గుగా—

హుషారుగా ఈలవేశాడు చలమయ్య—ఆ ఈల ఇంకా బాగుంది సుందరీబాయికి.

అలా అలా సుందరీబాయికీ చలమయ్యకీ మధ్య చనువు పెరిగిపోయింది.

ఒకనాడు సాహసించి సుందరీబాయి చెయ్యి పట్టుకున్నాడు చలమయ్య-చాచి లెంపకాయ కొట్టింది సుందరీబాయి.

బిత్తరపోయి తలవంచుకుని వెళ్ళి పోబోయాడు చలమయ్య. సుందరీబాయి కంగారు పడిపోయింది.

"ఏయ్ చలం!" అని పిలిచింది గాభరాగా! ఆ పిలుపుకి పరవశించిపోతూ వెనక్కివచ్చి ఆశగా చూశాడు చలమయ్య....

"అట్టా మింగేసేలా చూడకు-అంతగా మనసుంటే, మీవూరికి తీసుకుపోయి మనువు సేసుకో!"

"పద? పోదాం!" అన్నాడు వెంటనే చలమయ్య-వాడికి ఏ విషయంలోనూ ముందు వెనుక ఆలోచనలేదు—తను అనుకున్నది జరిగిపోవటమే కావాలి!

ఆ ఇంట్లో ఇక తనకు పెళ్ళికాదని నిర్ధారణ చేసుకున్న సుందరీబాయి వెంటనే ఈ ఆహ్వానాన్ని అంది పుచ్చుకుంది.

సాయంత్రం అన్నవస్తే అడ్డు పడతాడని ఉన్న నాలుగు చీరెలూ, పౌడర్‌డబ్బా, బొట్టూ, కాటుకా, రోల్డ్‌గోల్డ్ గొలుసూ, ఒక సంచీలో సర్దుకుని అప్పటికప్పుడు చలమయ్యతో బయలుదేరి పోయింది.

వాళ్ళంటే అప్పటికప్పుడు బయలుదేరారు కాని, రైళ్ళు ఎప్పు

డంటే అప్పుడుండవుగా? ఇద్దరూ ఒక బెంచీమీద కూచున్నార
కబుర్లు చెప్పుకుంటూ....

రైల్వేలో కూలీగా పనిచేస్తున్న ఒక అతనికి జైహింద్
బాబుని తెలుసు—అతడు సుందరీబాయిని చూశాడు. సంగతి
గ్రహించాడు-పరుగు పరుగున మిలటరీ కేంటీన్‌కి వచ్చి జైహింద్
బాబుకీ సంగతి చెప్పేశాడు.

జైహింద్‌బాబు వెంటనే బయలుదేరి రైల్వేస్టేషన్‌కి వచ్చి
రైలెక్క బోతున్న సుందరీబాయినీ, చలమయ్యనీ లెంపలు వాయించి
ఇంటికి తీసుకొచ్చాడు.

సుందరీబాయి శోకాలు సాగించింది.

చలమయ్యని అందరూ తన్నడానికి సిద్ధమయితే "నేనేం
తప్పు చేశాను? దాన్ని మనువాడతా!" అన్నాడు.

"ఇకనేం? ఆల్లిద్దరికీ పెళ్ళి సేసెయ్యి" అన్నారు పెద్దలు....

చేసేదిలేక రత్నమ్మను అలాగే ఉంచి సుందరీబాయికి, చల
మయ్యకీ పెళ్ళి కానిచ్చేశాడు జైహింద్‌బాబు—

పందిట్లో పెళ్ళవుతుండగా ఏదో పనిమీద లోపలికొచ్చిన
జైహింద్‌బాబుకి మారుమూల మోకాళ్ళలో తలపెట్టుకు కూర్చున్న
రత్నమ్మ కనిపించింది—అతనికి ఎంతో జాలివేసింది. ఒకరకంగా
తన జీవితమూ, తన చెల్లెలి జీవితమూకూడా, తన వాళ్ళ మూఢ
నమ్మకాలకీ, మూర్ఖాచారాలకీ బలిఅయి పోతున్నాయని పించింది.

రత్నమ్మ తలమీద చెయ్యివేసి "రత్తు!" అన్నాడు అభిమా
నంగా.

రత్నమ్మ దిగ్గున తలెత్తి గబగబ కళ్ళలో నీళ్ళు పైటకొంగుతో
తుడుచుకుని పేలవంగా నవ్వుతూ "నాకేం దిగులుగా లేదన్నా! వాటు!
మన సుందికయినా పెళ్ళయి పోతన్నాదని ఆనందంగానే వుంది—
ఆడకాస్తే నలుగురూ నాలుగుమాటలూ అంటారు.... అందుకే ఈడ
కూకున్నా?—" అంది.

శ్రీ సిద్ధార్థ బుక్ హౌస్,
ట్రంకు రోడ్డు ఖాన్‌పేట - నెల్లూరు-3.



నవ్వుతూ ఏడుస్తూ, పడుతూ లేస్తూ, పెళ్ళి పందిట్లో తిరి
గింది అన్నమ్మ—

"దీని జిమ్మడ! అక్కకి కాకుండా ఏం తొందరొచ్చి
పడ్డిందో దీనికి?" అని చిన్నకూతుర్ని తిట్టుకుంటోన్న తల్లిని
వారించి "తప్పమ్మా! సుందికి పెళ్ళవుతోంది—దాన్ని దీవించాలి!
తిట్టకూడదు—" అన్నాడు జైహింద్‌బాబు.

అన్నమ్మ తెల్లబోయి.... పెద్దకూతుర్ని జాలిగా చూసి, చిన్న
కూతుర్ని ముద్దుగాచూసి, ఏదో గొణుక్కుంది....

సుందరీబాయి పెళ్ళికి మార్వాడీదగ్గిర అప్పు చెయ్యవలసి
వచ్చింది జైహింద్‌బాబుకి—తల్లి జబ్బు పడినపుడే వ్యాసమూర్తి
దగ్గిర అప్పు తెచ్చాడు. అదింకా తీర్చలేదు. మళ్ళీ వ్యాసమూర్తిని
అడగటానికి నోరురాలేదు-వంటపని చేసుకుంటూ, కష్టంమీద డబ్బు
కూడబెట్టి తమ్ముణ్ణి చదివించు కుంటోన్న సరళను అసలు అడగాలని
పించలేదు—వడ్డీకి మార్వాడీదగ్గిర డబ్బు అప్పుతేవటం ఎంతమాత్రం
ఇష్టంలేదు జైహింద్‌బాబుకి. కానీ, ఏం చెయ్యగలడు?

# 13

జైహింద్‌బాబు కాలేజి మానేసి సర్వర్‌గా చేరినట్లు అన్నమ్మకు
—తెలియదు-ఆ గుడిసెల్లోనూ ఎవరికీ తెలియదు-తన తల్లికి విష
యం తెలిస్తే, తట్టుకోగలదో-లేదో నని తెలియనీయలేదు.

పనిపాటలకు అలవాటుపడిన అన్నమ్మ మంచంలో పడుకో
మన్నా, పడుకోలేక పోతోంది. లేచి తిరిగి ఏదో ఒకపని చెయ్య
టానికి ప్రయత్నిస్తోంది—అలా ప్రయత్నించడంలో ఒకసారి కళ్ళు
తిరిగి పడిపోయింది-మందులూ, మాకులూ, వాడి మళ్ళీ మామూలు
స్థితికి తెచ్చేసరికి వారంరోజులు పట్టింది—

అక్కడితో జైహింద్‌బాబు హడిలిపోయి రత్నమ్మని పని

మానేసి తల్లిదగ్గిరే ఉండి పొమ్మన్నాడు--అన్నమ్మ లబ లబలాడుతు "అదికూడా పనిమానుకుంటే ఇల్లెట్టా గడుస్తుదిరా?" అంది_ అప్పుడుకూడా తను చదువుమానుకుని సర్వర్‌గా పనిచేస్తున్న సంగతి జైహింద్‌బాబు తల్లికి చెప్పలేక పోయాడు. తల్లి ముఖంచూస్తూ ఆ మాట అనటానికి అతనికి సాహసం కలగటంలేదు__రత్నమ్మకి కూడా తల్లి పరిస్థితిచూసి భయంవేసి పని మానుకుని తల్లిదగ్గిరే ఉండసాగింది.

సరళకు పురిటిరోజులు దగ్గిర పడ్డాయి__నొప్పులు పట్టే వరకూ పని చేస్తోనేఉంది__నొప్పులు ప్రారంభమయ్యాక రత్నమ్మే తోడుగా ఉండి గవర్నమెంట్ హాస్పిటల్లో చేర్పించింది__

గవర్నమెంట్ హాస్పిటల్స్‌లో ఎవరూ సరళలాటి వాళ్ళని పట్టించుకోరు__నొప్పులు ఎక్కువయి బాధతో మూలుగుతే "హుష్ అరవకు!" అని అదలించటమే తప్ప రోగి అవస్థ ఎవరూ పట్టించుకోరు-డాక్టర్లూ నర్సులూ ఎవరూ లేకుండానే, శిశువు జన్మించిన సందర్భాలుకూడా లేకపోలేదు.

బాధ భరించటం బాగా అలవాటయిపోయిన సరళ పళ్ళ బిగిపున బాధనంతా సహిస్తూ తన మూలుగుకూడా బయటకు వినపడనియ్యలేదు_తను తల్లి కాబోతున్నాననే అపూర్వమైన సంతృప్తి ముందు ప్రసవవేదన సహితం హాయిగానే భరించగలిగింది సరళ...

సరళ తపసు ఫలించి మొగబిడ్డను ప్రసవించింది__సరళకు రెండు నెలలు గడిచేవరకూ కేంటీన్‌లో మరొకరిని పెట్టుకోకుండా సరళ బదులు రత్నమ్మ పనిచేసింది....సరళ పచ్చి బాలింతరాలయినా అటు తనబిడ్డనూ, ఇటు అన్నమ్మనూ చూసుకుంటూ గడిపింది__

సరళ తన కొడుక్కి కిరణ్ అని పేరు పెట్టుకుంది. కిరణ్‌కి మూడో నెల రాగానే, సరళ మళ్ళీ కేంటీన్‌లో చేరిపోయింది. సరళ పనిలోంచి వచ్చేవరకూ రత్నమ్మ తన తల్లినీ, సరళబిడ్డనూ చూసు



కునేది_ఆ రకంగా అనుకోకుండా రత్నమ్మకూ సరళకూ మధ్య ఒక ఆత్మీయత అల్లుకొంది__

ఒకరోజు సరళ ఇంట్లోనే రత్నమ్మ కిరణ్‌ని ఆడిస్తోంది__ పుస్తకం ముందుపెట్టుకుని చదువుతున్నట్లు నటిస్తూ సారధి తదేకంగా రత్నమ్మనే చూడసాగారు-అది గమనించిన సరళకు మండిపోయింది. "సారధీ!" అంది తీక్షణంగా....సారధి ఉలికిపడ్డాడు-అక్క ముఖంచూశాడు-అర్థం చేసుకున్నాడు__సిగ్గుపడ్డాడు__చేత్తో పుస్తకం పట్టుకుని అక్కడినుండి వెళ్ళిపోయాడు-కిరణ్‌తో-ఆటల్లో మునిగిపోయిన రత్నమ్మ ఏదీ గమనించలేదు__

రత్నమ్మ సరళకు దగ్గిర అవుతోన్న కొద్దీ సరళ అలవాట్లు చాలా నేర్చుకుంది. రోజూ స్నానం చెయ్యటం, శుచి, శుభ్రత అలవాటయ్యాయి-సరళ వంటలుకూడా చాలా నేర్చుకుంది_రత్నమ్మ మనసు నొచ్చుకోకుండా నెమ్మదిగా నచ్చచెపుతూ రత్నమ్మ ఉచ్చారణలో ఏసనికూడా చాలావరకు పోగొట్ట గలిగింది సరళ....సరళ కాలేజీ చదువులు చదవకపోయినా, రామాయణ భారత భాగవతాలు చదవటం వచ్చు-అప్పుడప్పుడు సరళ భాస్కర రామాయణం చదివి వినిపిస్తే ఆ కథలమీది ఆసక్తితో శ్రద్ధగా వినేది రత్నమ్మ.

కాలచక్రంలో అయిదేళ్ళు గిర్రున తిరిగాయి-సుధీర్ రైల్వేలో పెద్ద ఉద్యోగస్థుడయ్యాడు. అయినా జైహింద్‌బాబుని మరిచిపోలేదు-అతని కెంతమంది స్నేహితులున్నా జైహింద్‌బాబు దగ్గిర లభించే ఆత్మీయత లభించలేదు మరెక్కడా....జైహింద్‌బాబు నలుగురిలో తనను చనువు ఉన్నట్లుగా పలకరిస్తే తన పదవికీ, హోదాకూ భంగమనే భయం కొద్దిగా కలగకపోలేదు. కానీ, జైహింద్‌బాబు తనంత తనుగా ఎన్నడూ పలకరించటానికి కాని, సన్నిహితుడవటానికి కాని ప్రయత్నించక పోవటంతో ఆ భయంపోయింది__తను అంత పదవిలోఉన్నా, జైహింద్‌బాబు ఏనాడు చెయ్యిజాపి ఏదీ అడ

గక పోవటంతో అతనిమీద గౌరవం మరింత హెచ్చింది-వారానికో. పది రోజులకో, ఒకసారివచ్చి, రహస్యంగా జైహింద్ బాబుతో ఏ తూము గట్టుమీదో కూచుని కబుర్లు చెప్పకపోతే ఏదో పోగొట్టు కున్నట్లు అనిపిస్తుంది, సుధీర్‌కి.

వెంకడు తోటపనుల్లో ఆరితేరి పోయాడు-రాజయ్య లేకుం డానే అన్ని పనులూ నిర్వహించుకు రాగలుగుతున్నాడు-రాజయ్య చాలా సుఖంగాఉంది. తోటపనులు చేస్తున్నా వెంకడు తన మూలి కల వైద్యం మానలేధు-గుడిసెల్లో వాళ్ళకి చాలామందికి అతడు చిన్న చిన్న రోగాలు, పెద్ద పెద్ద రోగాలూ, చాలా నయంచేశాడు-గుడి సెల్లో జనానికి అతడికి మంత్రాలు వచ్చునీ, అందుకే అతడి మూలి కలు పనిచేస్తాయనీ నమ్మకం బలపడి పోయింది.

చంద్రికి నాగమ్మ పెళ్ళి సంబంధాలు చూస్తూనేఉంది-ఈ సారి చంద్రి నిర్మొహమాటంగా ఏ సంబంధం వచ్చినా నాకు నచ్చలేదని చెప్పేస్తోంది-చంద్రి మనసులో ఏముందో అర్థం చేసుకోలేనంత వెర్రిదికాదు నాగమ్మ-కోపంతో మండిపడి "ఏయ్ చంద్రి! నీయెత్తుబ నాదగ్గిర సాగవు-నేను సచ్చినా కట్టుతప్పను-" అనేది నాగమ్మ- చంద్రి ఏ సమాధానమూ చెప్పేదికాదు-ఎంతకోపం తెచ్చుకుని-ఎంతగా మండిపడి-ఎలా అరిచినా—చంద్రికి కిష్టంలేని పెళ్ళి చెయ్యటానికి మాత్రం సాహసించేదికాదు నాగమ్మ-కోపంలో ఎన్ని తిట్టినా, చంద్రి కళ్ళనీళ్ళు పెట్టుకుంటే మాత్రం చూడలేక పోయేది....ఆ కారణం చేత నాగమ్మ భగీరథ ప్రయత్నం చేస్తున్నా, చంద్రి పెళ్ళి కాకుం డానే ఉండిపోయింది.

సారధి శ్రద్ధగా చదివి బి. ఏ. పాసయ్యాడు-ఉద్యోగం కోసం ప్రయత్నించాడు-దొరకలేదు. అతనిది వెనుకబడిన కులాలకు చెం



ది జాతికాదు. అంచేత ఉద్యోగం దొరకటం చాలా కష్టమయి పోయింది. ఆరునెలలు అన్ని ఆఫీసులూ తిరిగాడు-ఎన్నెన్నో ప్రయ త్నాలు చేశాడు-ఏదీ ఫలించలేదు—అతనికి రికమెండేషన్ లేదు. లం చం పెట్టగలిగే శక్తిలేదు——కనీసం వెనుకబడిన కులమనే అర్హతైనా లేదు-కేవలం బి. ఏ. డిగ్రీతో ఉద్యోగమెలా వస్తుంది?

"జయన్నా! నువ్వు చదువు మానేసినందుకు ఎంతో బాధ పడ్డాను-కానీ చదువుకున్న మా సారధికంటె చదువుకోని నువ్వే హాయిగా సంపాదించు కొంటున్నావయ్యా!" అంది సరళ జైహింద్ బాబుతో.

సారధి అవస్థ జైహింద్‌బాబుకు కూడా తెలుసు.

"అలా అనకు సరళమ్మా! డిగ్రీ ఏమయి పోతుంది? ఉద్యో గం ఇవాళ కాకపోతే రేపొస్తుంది." అన్నాడు.

"ఏమో! మా కష్టాలు కడతేరే దెన్నటికో!" అంది సరళ నిస్పృహతో.

జైహింద్‌బాబుకి అన్నింటికీ వ్యాసమూర్తే దిక్కు-అతనితో సారధి విషయం చెప్పి ఏదైనా ఉద్యోగం చూసిపెట్టమన్నాడు— ఉద్యోగం దొరకటం మాటలా?

సరళ పరిస్థితికి సానుభూతితో వ్యాసమూర్తి గట్టిగా ప్రయ త్నించగా ఒక ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌కి పి. ఏ. గా నెలకి రెండువందల యాభై రూపాయల జీతంలో ఉద్యోగం దొరికింది సారధికి.

"బి. ఏ. పాసయిన వ్యక్తికి ఇంత జీవితంతో ఇలాంటి ఉద్యోగం చాలా చిన్నదే కాని, మంచిది దొరికేవరకూ ఇదిచెయ్యి— నెమ్మదిగా ప్రయత్నిద్దాం!" అన్నాడు వ్యాసమూర్తి-వ్యాసమూర్తికి కృతజ్ఞతతో, వినయంతో నమస్కారాలు చేశాడు సారధి.

సరళ ఒకప్పుడు గుమ్మం కదిలి బయటకు వచ్చేదికాదు—వీధి ముఖం చూడటానికే భయపడి పోయేది—పరిస్థితులు ఎలాంటి వాళ్ళనైనా మార్చేస్తాయి-ఇప్పుడు ఇంటికి కావలసిన సామానులన్నీ సరళ బజారుకెళ్ళి తెచ్చుకుంటోంది. ఎక్కడికి వెళ్ళాలన్నా, ఎవరితో మాట్లాడాలన్నా సరళకు జంకు కలగటంలేదు. తాను చెప్పాలనుకున్నది నిర్భయంగా చెప్తోంది. చెయ్యాలనుకున్నది నిస్సంకోచంగా చేస్తోంది.

బజారులో ఇంటికి కావలసిన వస్తువులు కొంటున్న సరళ "సరళా!" అనే పిలుపు వినిపించి వెనక్కు తిరిగిచూసింది. పరుగు పరుగున వస్తున్నాడు నాదముని-మనిషిబాగా చిక్కిపోయాడు—చెక్కిళ్ళలోతుకు పోయాయి-కళ్ళు గుంటలు పడ్డాయి-గెడ్డం విపరీతంగా పెరిగింది. తల రుబ్బుకట్టింది....అతణ్ణి చూడగానే గత స్మృతులన్నీ ఒక్కసారి గుర్తుకువచ్చి బాధ, జాలి, దుఃఖం, కోపం, కసి, అన్నీ ఒక్కసారిగా కలిగాయి సరళకి.

నాదముని రొప్పుతూ సరళ దగ్గిరకివచ్చి సరళ చెయ్యి గట్టిగా పట్టుకుని "హమ్మ దొంగా? నువ్విక్కడున్నావా? నేను నీకోసం ఎంత వెతికానో తెలుసా?" అన్నాడు.

"వెతికారా? ఎక్కడ వెతికారు?"

"అంతా! వంటింట్లో-పడమటిగదిలో—దక్షిణపు గదిలో....పెరట్లో....గాదె వెనకాతల—భోషాణంక్రింద—అటకమీద-ఎక్కడా కనపడలేదు నువ్వు."

"ఎందుకు వెతికారు?"

"ఎందుకేమిటి? నువ్వు లేకపోతే, నాకెలా?"

పాపం. అంతకంటె చెప్పలేక పోయాడు నాదముని. ఎలా అయిపోయాడు. మాటల్లో చెప్పలేక పోయినా, అతడు అనుభవిస్తోన్న క్షోభ అంతా అతడిముఖంలో కనిపిస్తోంది.



సరళ చెయ్యి వదలకుండా మరింత గట్టిగా పట్టుకుని "రా! నాతో వచ్చెయ్యి. మళ్ళీ ఎక్కడికీ పోకు!" అన్నాడు. పసిపిల్లాడు మారాం చేస్తున్నట్లు.

ఈ వెర్రి బాగులవాడికి ఇప్పటికీ ఏం జరిగిందో తెలియటం లేదు-పరిస్థితి అర్థం కావటంలేదు. ఇంట్లో తను లేని వెలితి అనుభవిస్తున్నాడు-తనకోసం ఆరాట పడుతున్నాడు.

"నేనక్కడికి రాను-మీరే నాతో వచ్చెయ్యండి."

"పద!" అన్నాడు వెంటనే నాదముని, ఏరకమైన ఆటంకమూ చెప్పకుండా.

నాదమునిని తన క్వార్టర్స్‌కి తీసుకొచ్చింది సరళ-పెద్ద ఇంట్లో ఉండటాని కలవాటుపడిన నాదముని ఆ ఇంటిని వింతగా చూస్తూ "ఇదేంఇల్లు? పనివాళ్ళ ఇల్లులా ఉంది." అన్నాడు.

గతుక్కుమంది సరళ. తన భర్త ఎంతవరకు ఆలోచించగలడు?

"నేను పని మనిషినే!"

"ఛ!"

"అవును-ఎప్పుడూ పనిమనిషినే! మీ ఇంట్లో ఉన్నప్పుడు జీతం తీసుకోని-స్వాతంత్రంలేని-పని మనిషిని-ఇప్పుడు జీతం తీసుకుంటూ స్వతంత్రంగా బ్రతుకుతోన్న పనిమనిషిని."

కనురెప్పలు టప టపలాడించి బాధగా చూశాడు నాదముని లాభంలేదు-ఇతనికేమీ అర్థంకాదు.

కిరణ్‌ని చూపించి "మీ కొడుకు!" అంది.

నాదమునికి చిన్న పిల్లలంటే ఇష్టమే! "ఇహిహి! నా కొడుకు-" అని ఎత్తుకో బోయాడు.

గెడ్డం, మీసాలతో గుబురుతలతో ఉన్న కొత్త మనిషిచూ కిరణ్ హడిలిపోయి ఏడుస్తూ తల్లిని వాటేసుకున్నాడు—నాదము బిక్కముఖం వేసుకుని ఏడుస్తోన్న కొడుకుని చూస్తూ కూచున్నాడు లాలించి బుజ్జగించి మంచి చేసుకోవటం అతనికి చేతకాదు.

తనను కౌగిలించుకున్న కొడుకుని గాఢంగా హృదయాని హత్తుకుంది సరళ.

# 14

సుధీర్‌కు పెళ్ళయింది. ఒక కూతురు కూడా పుట్టింది. అతని అత్తవారిది ఒక పల్లెటూరు. భార్యతోనూ, కూతురితోనూ కారులో అత్తవారి ఊరికి వెళ్తూ జైహింద్‌బాబుని కూడా తనతో రమ్మన్నాడు సుధీర్.

సుధీర్ భార్య కూడా చదువుకొన్నది. తమ చిన్నతనంలో జైహింద్‌బాబు తనను తోటిపిల్లలు కొడుతోంటే ఎలా ఆదుకున్నదీ, ఆరోజు నుంచీ అతని స్నేహం కోసం తనెలా పాకులాడిందీ, చదువులో అతనెంత చురుగ్గా ఉండేదీ, విధిలేక ఎలా చదువు మానెయ వలసి వచ్చిందీ—అవన్నీ కథలుగా భార్యతో చెప్పేవాడు సుధీర్. అతని భార్యకు కూడా జైహింద్‌బాబంటే ఒక ఆదర భావం ఏర్పడింది....

మొదట జైహింద్‌బాబు వాళ్ళతో రానన్నాడు. కానీ, సుధీర్ భార్యతోనూ, కూతురితోనూ కారులో, జైహింద్‌బాబు గుడిసె దగ్గరగా ఉన్న రోడ్డు మీదకు వచ్చి, కారాపి, తను ప్రత్యేకం జైహింద్‌బాబు గుడిసె ముందుకు వచ్చి "వెళ్దాం రా!" అన్నాడు. అప్పుడిక రాదనలేక పోయాడు జైహింద్‌బాబు.

తనకుఉన్న వాటిల్లో మంచిబట్ట తీసుకుని బయలుదేరాడు.

సుధీర్ భార్య కూడా "రండి!" అని మర్యాదగా ఆహ్వానించింది. ఆ బహువచన ప్రయోగానికి తలక్రిందులయి పోయాడు. విస్మయంతో ఆవిడని దేవతని చూస్తున్నట్లు చూస్తూ మనసారా చేతులు జోడించాడు....

కారులో వెళ్తున్న జైహింద్‌బాబుని గుడిసె బయటకొచ్చి సంబరంగా చూసింది అన్నమ్మ.

"మా జయన్న దొరబాబు. కార్లల్లో తిరుగుతాడు...." అని మురిసిపోయింది. తల్లి అమాయకత్వానికి జాలి పడిన రత్నమ్మ తల్లిని చెయ్యి పట్టుకుని లోపలకు తీసుకుపోయింది.

సుధీర్ అత్తవారింట్లో కూడా ఎవరూ జైహింద్‌బాబుని ఒక కూలివాణ్ణి చూసినట్లు చూడలేదు. తమలో ఒక వ్యక్తిగానే చూశారు.

సుధీర్ తన ప్రక్కన కూర్చొని తనతో కలిసి భోజనం చేస్తోంటే మతే పోయింది జైహింద్‌బాబుకి.

అలా జైహింద్‌బాబుతో కలిసి కూచొని భోజనం చేసి చిన్నతనంలో ఏనాడూ రుజువు చేసుకోలేక పోయిన తన స్నేహ శీలతని రుజువు చేసుకోవాలని ఎప్పటినుండో తహతహ లాడుతున్నాడు సుధీర్.

ఉన్న ఊళ్ళో తన ఇంట్లో ఆ పని చెయ్యగలిగే సాహసం అతనికి లేకపోయింది. ఉద్యోగరీత్యా తనకున్న హోదాని బట్టి బయట సంఘంలో జైహింద్‌బాబుతో కలిసి మెలిసి తిరగగలిగే శక్తి కూడా అతనికి లేదు.

భార్య అర్థం చేసుకోగలిగిన వ్యక్తి కావటం వల్ల ఆ మారుమూల పల్లెటూళ్ళో - సంఘ భయం లేకుండా తాను కోరినది చెయ్యగలిగాడు సుధీర్. అందుకే పొంగిపోయాడు జైహింద్‌బాబు.

అక్కడ మూడు రోజులు మాత్రమే ఉండటానికి వచ్చాడు

సుధీర్. తన భార్య పేర ఉన్న కొద్దిపాటి పొలం కవులుదార్ల నుండి స్వాధీనం చేసుకోవాలని వచ్చాడు.

సాయంత్రం జై హింద్ బాబుతో కలిసి కాలువగట్టుకి షికారుగా బయలుదేరాడు సుధీర్. అతని కూతురు కూడా అతనితో బయలు దేరతానని పేచీ పెట్టింది. తల్లి మొదట వద్దని మందలించింది. కానీ సుధీర్ బాబు "పోనీ, రానియ్యి-సరదాగా తిరుగుతుంది." అనటంతో వాళ్ళ వెంట పంపించింది.

సుధీర్ బాబూ, జై హింద్ బాబూ కబుర్లలో పడిపోయారు.... కవులుదార్ల గురించీ, సొంత వ్యవసాయాల గురించీ, ఆస్తిపాస్తుల గురించీ, కాలేజి చదువుల గురించీ ఇలా ఒక దానిలోంచి మరొక దానిలోకి సంభాషణ దొర్లిపోయింది!

"డాడీ!...." అనే అరుపుకు ఇద్దరూ అదిరిపడి తమ మైకం లోంచి తెప్పరిల్లి చూశారు.

సుధీర్ కూతురు ఎప్పుడు దిగిందో, కాలవలోకి దిగింది. ప్రవాహంలో పడి కొట్టుకు పోతోంది....

సుధీర్ మతిపోయిన వాడిలా లేచి "అయ్యో! బేబీ! ఎవరక్కడ? అయ్యో! అయ్యో! కొట్టుకు పోతోంది! బేబీ! బేబీ!" అని అరవటం మొదలు పెట్టాడు.

జై హింద్ బాబు వెంటనే పొంగి ప్రవహిస్తోన్న కాలువలోకి దూకాడు. ఈదుకుంటూ వెళ్ళి, సుధీర్ కూతుర్ని ఒక చేత్తో భుజం మీద వేసుకుని, మరో చేత్తో ఈదుకుంటూ గట్టుకి వచ్చాడు. వెంటనే కారులో ప్రక్కనున్న టౌన్‌కి తీసికెళ్ళి ప్రధమ చికిత్స చేయించారు. ఒక్క అరగంటలోనే ఆ అమ్మాయి తేరుకుంది.

సుధీర్, సుధీర్ భార్య ఇద్దరూ జై హింద్ బాబుకి తమ కృతజ్ఞతలు చెప్పుకున్నారు.



జై హింద్ బాబు సిగ్గుపడి "నేనేం చేశానండీ! ఈత వచ్చు - రక్షించగలిగాను. నేను గజ ఈతగాణ్ణి!" అన్నాడు.

ఆ తరువాత సుధీర్ తన పర్స్‌లోంచి వంద రూపాయలు తీసి జై హింద్ బాబు కియ్యబోయాడు.

జై హింద్ బాబు దెబ్బ తిన్నట్లుచూసి "సుధీర్! నా జీవితంలో ఎంతో అపురూపమైనది మన స్నేహం - విడవకుండా నా మెళ్ళో నేను వేసుకుంటున్న నీ ఆంజనేయస్వామి రక్షరేకు ఇందుకు సాక్ష్యం....నా స్నేహితుడికి నేను ఒక చిన్న సహాయం చెయ్యగలిగానన్న సంతృప్తితో నా మనసుకెంతో ఆనందంగా ఉంది. ఈ మాత్రం సంతృప్తి నాకు దక్కనియ్యవా? నేను నీకు స్నేహితుణ్ణి కాననీ, ఒక కూలివాణ్ణి మాత్రమేననీ చెప్పదలచుకున్నావా?" అన్నాడు.

సుధీర్ ఆ డబ్బు తన పర్స్‌లో పెట్టేసుకుని జై హింద్ బాబు భుజం మీద చెయ్యి వేసి దగ్గరగా లాక్కుని "అయామ్ సారీ!...." అన్నాడు.

తిరుగు ప్రయాణంలో జై హింద్ బాబుని అతని గుడిసె దగ్గర డ్రాప్ చేస్తూ "నీకు సుధీర్ అనే స్నేహితుడున్నాడని మరిచిపోకు. ఏ సహాయం కావలసి వచ్చినా అడగటానికి సంకోచించకు...." అన్నాడు.

"థేంక్యూ!" అన్నాడు జై హింద్ బాబు.

జై హింద్ బాబు గుడిసెలోకి వచ్చేసరికి రాగాలు పెడుతూ ఎదురయింది సుందరీబాయి.

"ఆళ్ళు నన్ను యెల్లగొట్టేసినారు. ఆడికి యేరే మనువు సూత్తన్నారు!" అని బావురుమంది అన్నని చూసి.

చలమయ్య కుటుంబంలో అందరూ పొలంలో పాటుపడే

మనుష్యలు....ఏదో బల్ల దుకాణం మీద కూచుని అవీ-ఇవీ అమ్మి డబ్బు సంపాదించే సుందరీబాయి అత్తతో. ఆడబిడ్డలతో సమంగా పొలం పనులు చెయ్యలేక పోయింది. పోనీ, ఇంట్లో ఉండి వంట పనీ, ఇంటి పనీ చూసుకోమన్నారు, అత్తా-ఆడబిడ్డలు. సుందరీ బాయికి అదీ చేతకాలేదు. పొద్దున్నే లేచి, అంత మందికి పొలం వెళ్ళటానికి ముందే, వంటంతా చెయ్యాలంటే దానివల్ల కాలేదు. ఇల్లూ, అదొడ్లూ ఊడ్చి శుభ్రం చెయ్యటానికి కూడా దానికి విసు గొచ్చింది. ఏపనీ చెయ్యకుండా మొండికేసి కూచునేసరికి, అత్తగారు నాలుగు వాయించింది. సుందరీబాయి రాగాలు పెట్టేసి "నేను మా ఇంటికి పోతా!" అని సంచీ సర్దుకుంది.

అత్తకి మండిపోయి "పోతే పో, ముదనష్టపు దానా! మా వోడికి మరో మంచి సంబంధం సేసుకుంటా!" అని విదలించింది. సుందరీబాయి అక్కడుండలేక వచ్చేసింది.

అంతా విని జైహింద్‌బాబు నిట్టూర్పు విడుస్తూ "కోరి చేసు కున్న దానివి, సర్దుకు పోవద్దటే! సరే ఉండు! సంగతేమిటో, నేను కనుక్కొస్తా!" అన్నాడు.

సుందరీబాయి అత్తవారింటినుండి వచ్చేసిందే కాని, రెండు రోజులు కూడా స్తిమితంగా ఉండలేక పోయింది. "ఆడికి ఆళ్ళు మరో పెళ్ళి సేసేస్తారు" అని ఏడుపు మొదలు పెట్టింది.

ఇదంతా పడలేక జైహింద్‌బాబు సంగతి సందర్భాలు విచా రించటానికి చలమయ్య ఊరికి వెళ్ళాడు. సుందరీబాయి అత్త కుండ పగలగొట్టినట్లు చెప్పేసింది. "దాన్ని కూసోబెట్టి నేను మేపలేను. పని పాటలు సేతకానిది మా ఇంట్లో ఉండక్కర్లేదు."

జైహింద్‌బాబు చలమయ్యని అడిగాడు.



"నన్నేం సెయ్యమంటావు? మా అమ్మ ఇస్టం!" అన్నాడు చలమయ్య.

"బుల్లి పాపాయివా? అమ్మ ఎంత చెప్తే అంతేనా?"

"అమ్మ మాట కాదంటే తిండెట్లా వస్తది?....మా పొలం అమ్మే సూస్తాంది!"

"అయితే మీ అమ్మ మాట విని మరో పెళ్ళి కూడా చేసు కుంటావా?"

"మీ సెల్లి లేసిపోతే ఏం సెయ్యమంటావు మరి? కాపురం లేకుండ ఉండనా?"

"పొలం కాకపోతే, మరో పని చేసుకుని పెళ్ళాన్ని పోషిం చుకో లేవా?"

"పని చూపించు, చేస్తా!"

"నాతో రా!"

జైహింద్‌బాబు ఆహ్వానాన్ని సంతోషంతో స్వీకరించాడు చలమయ్య. హాయిగా నాలుగైదు నెలలు చీకూ చింతా లేకుండా బావమరిది సంపాదన తింటూ రికామిగా పెళ్ళాంతో షికార్లు కొడుతూ తిరిగాడు.

ఇదొక కొత్త సమస్య అయిపోయింది జైహింద్‌బాబుకి. వ్యాసమూర్తితోనే చెప్పుకున్నాడు. "అన్ని సమస్యలూ నీకేనయ్యా!" అన్నాడు వ్యాసమూర్తి జాలిగా!

చివరకు వ్యాసమూర్తి అండతోనే ఒక ప్రైవేట్ కంపెనీలో ప్యూన్‌గా కుదిర్చాడు చలమయ్యని. సుందరీబాయినీ, చలమయ్యనీ వేరుగా కాపరం పెట్టించాడు.

# 15

తిండిపోతుతనం కూడా వెర్రిబాగులతనంలో ఒక భాగం కాబోలు!

సహజమానవ ప్రవృత్తి వికసించక కేవలం పాశవిక ప్రేరణలే ప్రధానంగా జీవించే వ్యక్తులు కావటంవల్ల తిండి యావ ఎక్కువగా ఉంటుందేమో!

ఏది ఏమయినా నాదముని బకాసురుడి లాగానే తినగలడు.... దేవుడి ప్రసాదాలకు వేళా-పాళా లేకుండా అలవాటు పడ్డ వ్యక్తి, సరళ వేళ కింత ఆహారం పెడుతోంటే తిని తృప్తి పడలేక పోతు న్నాడు. ఎప్పుడూ నాదముని తినటానికేమైనా ఉందేమోనని ఇంట్లో వెతుక్కొంటూ ఉంటే సరళకు చికాగ్గానూ ఉండేది; జాలిగానూ ఉండేది. తన కొద్దిపాటి సంపాదనలో నాదముని ఈ తిండి యావను ఎలా భరించాలో అర్థం కావటం లేదు సరళకి.

సారధి తన మొదటి నెల జీతం తీసుకొచ్చి అక్క చేతిలో పెట్టబోయాడు. సరళ దానిని అందుకున్నట్లే అందుకుని, మళ్ళీ సారధి చేతికే ఇచ్చి "బేంక్‌లో వేసుకోరా!" అంది.

"అదేమిటక్కా! ఉండనీ! నీదయవల్ల ఇంతవాణ్ణి అయ్యాను. నా సంపాదన నీకు కాకపోతే, మరెవరికి?"

"పిచ్చి తమ్ముడూ! నువ్వు ఉద్యోగం చేసి సంపాదిస్తే, ఆ సంపాదన తినాలని చదివించానురా నిన్ను? నువ్వు బాగా వృద్ధిలోకి రావాలి. ఇల్లూ, వాకిలీ ఏర్పాటు చేసుకోవాలి. మంచి సంబంధం చూసుకుని పెళ్ళి చేసుకోవాలి! నువ్వయినా నీ భార్యతో హాయిగా, సుఖంగా కాలం గడపాలి!"

ఈ చివరి మాటలకు భరించలేక ముఖం తిప్పుకున్నాడు సారధి.



శ్రీ సిద్ధార్థ బుక్ పాయింట్, ఖైతాన్ పేట - నెల్లూరు-3.

నాదముని వచ్చాక తనకు డబ్బు కెంత కటకటగా ఉన్నా, తమ్ముడి డబ్బు వాడుకోలేక పోతోంది సరళ. ఎప్పటిలాగే తన కష్ట సుఖాలు జైహింద్‌బాబుతోనే చెప్పుకుంది.

"జయన్నా! లోకంలో మొగవాడు భార్య బిడ్డల్ని పోషించ లేక అవస్థ పడతాడు. నేను నా భర్తనీ, కొడుకునీ పోషించలేక పోతున్నాను."

"అదేంటి సరళమ్మా! మీ భర్త మీ దగ్గరకి వచ్చాక ఆయన సంతు ఆస్తి మీకే వస్తుందిగా!"

"ఆయన ఆస్తి....! ఎవరిస్తారు మనకి? మనకెలా వస్తుంది అది?"

"ఎలా వస్తుందేంటమ్మా! దావా వేస్తే వస్తుంది!"

"ఈ కోర్టులూ, దావాలూ, ఇవన్నీ ఎవరు పడగలరు, జయన్నా!"

"మేమంతా లేమా?....వ్యాసమూర్తిగారిని కనుక్కుంటా నుండండి...."

ఆరోజే జైహింద్‌బాబు వ్యాసమూర్తికి సంగతులన్నీ వివరిం చాడు. నాదముని ఆస్తి సరళకీ, కిరణ్‌కీ దక్కే ఉపాయం ఉంటే చూడమని బ్రతిమాలాడు.

"తమ్ముడు వెర్రిబాగులవాడు కనుక ఆ ఆస్తిని తనే సంరక్షి స్తానని అనవచ్చు అన్న - అదీగాక నాదముని దావా వెయ్యగలిగేపాటి మానసిక స్థితిలో కూడా లేడంటున్నావు కదా! కొడుకు ఉన్నాడు గనుక మైనర్ హక్కుల కోసం దావా వెయ్యచ్చును" అన్నాడు వ్యాసమూర్తి.

జైహింద్‌బాబు ప్రోత్సాహంతో - వ్యాసమూర్తి అండ దండ లతో సరళ తన బావగారితో దావాకి దిగింది.

బోనులో నిలబడవలసి వచ్చినందుకు సరళ ఏడ్చింది లోలోపల....లాయర్ అడ్డదిడ్డపు ప్రశ్న లడుగుతోంటే, ప్రాణం పోయినట్లే అనిపించింది. కానీ, నిర్భయంగా నిలబడి తనకు జరిగిన అన్యాయాన్ని నిండు కోర్టులో నలుగురి ముందూ చెప్పేసింది.

నాదముని సాక్ష్యం విషయంలోనే అందరూ భయపడ్డారు.

"చెట్లకూ, చేమలకూ సంతానం కలుగుతోంటే, నాకెందుకు కలగదూ?" అనమని నేర్పించాడు వ్యాసమూర్తి. ఆ మాట తప్ప మరేదీ మాట్లాడవద్దని చెప్పాడు.

సారధి, జై హింద్‌బాబు ఇద్దరూ వీలైనప్పుడల్లా ఆ పాఠాన్ని నాదమునికి నూరి పోశారు. వెర్రిబాగుల వాళ్ళు కొన్ని వింతగా ఉన్నవి బాగా పట్టుకుంటారు. ఈ మాటలు తమాషాగా ఉండి నాదమునికి బాగా వంట బట్టాయి.

కోర్టులో తన పాఠం చక్కగా అప్పజెప్పాడు. కోర్టంతా ఘొల్లుమని నవ్వింది. అక్కడితో గొప్ప తోచి అందరినీ గొప్పగా చూస్తూ "చెట్లకూ, చేమలకూ సంతానం కలుగుతున్నప్పుడు, నాకెందుకు కలగదూ?" అన్నాడు నొక్కి నొక్కి.

కేసు గెలవటం కోసమే అయినా ఈ మాటలు విని భరించలేక పోయింది సరళ.

ఎంత రాయిగా మార్చుకున్నా ఆ అభాగ్యురాలి గుండె ముక్కలయింది. ఇంటికొచ్చి కిరణ్‌ని దగ్గిరగా తీసుకుని "బాబూ! నువ్వు చెట్లకీ, చేమలకీ సంతానం కలిగినట్లు కలిగిన వాడివి కావు. నా నోముల పంటవి....నేను తపసు చేసిచేసి ఆ ఆత్మశక్తితో పొందాను నిన్ను....అలాగే పెంచుకుంటాను" అంది.

కిరణ్ కేమీ అర్థం కాక తన చిట్టి చేతులతో తల్లి కన్నీళ్ళు తుడిచి తల్లి ముఖంలోకి చూసి నవ్వాడు.



వ్యాసమూర్తి చాకచక్యం వల్ల సరళ దావా గెలిచింది....
ందరూ ఎంతో సంతోషించారు.

"జయన్నా!....సంధ్య వేళ దీపం పెట్టుకుని నే నికముందు
పుణ్ణి తలుచుకోనయ్యా! నిన్నే తలుచుకుంటాను" అంది సరళ.

"అదేం మాటమ్మా! వ్యాసమూర్తిగారి దయ లేకపోతే, మన
చెయ్యగలం? మీరూ, నేనూ, ఇంకా మనలాటి వాళ్ళం అంద
రూ ఆ బాబుగారికి దణ్ణం పెట్టుకోవాలి!"

అవునని ఒప్పుకుంది సరళ. కేంటీన్‌లో వంటపని మానుకుని
పో జోతున్నప్పుడు ఆనందం కలగటానికి మారుగా ఏడుపే
ంది సరళకి. జై హింద్‌బాబుకీ బాధ తోచింది.

సర్వెంట్ క్వార్టర్స్‌లో నుంచి ఒక మోస్తరు ఇంట్లోకి
రారు సరళ, సారధి, నాదముని, కిరణ్.

సరళ లేకపోవడం చాలా వెలితిగా తోచింది జై హింద్
బుకి. అయితే అతడా వెలితిని ఎక్కువ కాలం భరించవలసిన
వసరం లేకపోయింది.

కేంటీన్‌లోనుంచి చిన్న చిన్న స్పూన్స్, ఫోర్క్స్, మాయ
వటం మొదలయింది. ఆ నేరం సర్వర్‌గా పనిచేస్తున్న జై హింద్
బు పైనే మోపబడింది. అతణ్ణి సంజాయిషీ అడిగారు. తనకేమీ
లియదని అతడు చెప్పుకున్నా, నేరం అతడే చేశాడని రుజువు
య్యలేక పోయినా, వాటి ఖరీదు అతని జీతంలోంచే విరక్కొట్టు
న్నారు.

జీతం తగ్గినందుకు కంటె తనమీద మోపబడిన నిందకు
హింద్‌బాబు చాలా బాధ పడ్డాను. ఇలా వరసగా రెండు మూడు
లలు జరిగింది. ప్రతినెలా జై హింధ్‌బాబు జీతంలోంచి పదిహేను,
రవై విరగ్గొడుతున్నారు. బాధ పడటం కంటె ఏం చెయ్యలేక
తున్నాడు అతడు.

"జయన్నా! మీ కేంటీన్‌లోంచి స్పూన్స్, ఫోర్క్స్ వగైరా పోతున్నాయా?" అని అదోక మాదిరిగా, అర్థ గర్భితంగా అడిగాడు వ్యాసమూర్తి. ఎవరో కత్తి పెట్టి గుండెల్లో కుమ్మినట్టే అయింది, జై హింద్ బాబుకి. ప్రతి నెలా అన్యాయంగా తన కష్టార్జితంలోంచి జీతం విరగ్గొడుతున్నప్పుడు కూడా అతనికి అంత బాధ కలగలేదు.

ఆ స్పూన్స్ వగైరా ఎలా పోతున్నాయో, కనిపెట్టి తీరాలను కున్నాడు.

ముందు క్లీనర్‌ని కనిపెట్టి చూశాడు. ఏమీ ఆచోకి దొరక లేదు. వంటమనిషిని కూడా అనుమానించాడు. కానీ, ఆ అనుమ నమూ, నిరాధారమని తేల్చుకున్నాడు.

ఎలాగైనా ఆ స్పూన్ల దొంగని పట్టుకోవాలని, ప్రతి క్షణమూ వేయికళ్ళతో అందరినీ గమనించసాగాడు.

ఒకనాడు జై హింద్ బాబు తనకళ్ళని తను నమ్మలేకపోయాడు. రెండువేలకి పైగా జీతం సంపాదించుకునే, ఒక బాధ్యతగల ఆఫీసర్ గారు, టిఫిన్ తిని ఆ స్పూన్‌ని నెమ్మదిగా జేబులో పడేసుకున్నాడు. ఒక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా పరుగున వచ్చి ఆయన చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు.

"ఏమిటిసార్? మీరే ఇక్కడి స్పూన్ జేబులో వేసుకుంటున్నారా?" అని గట్టిగా అరిచాడు. ఆ అరుపుకు అందరూ అటు చూశారు.

ఆశించని ఈ పరిణామానికి అతడు కొయ్యబారిపోయాడు. అతి జాగ్రత్తగా ఎవరూ చూడకుండా ఆ స్పూను జేబులో వేసు కున్నాడు. సర్వే చేస్తున్నట్లే ఉండి జై హింద్ బాబు రహస్యంగా తనను గమనించగలడని అతడు ఊహించలేదు.

జై హింద్ బాబు రహస్యంగా తనను గమనించగలడని అతడు ఊహించలేదు.



జై హింద్ బాబుని కేవలం అనుమానంతో ఇష్టం వచ్చినట్టు టగలిగిన కేంటీన్ మేనేజరు ప్రత్యక్ష సాక్ష్యంతో ఎదురుగా కని స్తోన్నా ఆఫీసర్‌ని ఏమీ అనలేకపోయాడు. కొయ్యబారి నిలబడిన ఫీసర్ జేబులోంచి స్పూన్ తనే బయటికితీసి విజయగర్వంతో నేజర్‌కి చూపించాను జై హింద్ బాబు.

కానీ, మేనేజర్ ముఖంలో దొంగ దొరికిన సంతోష మేమీ నిపించలేదు. ఎదురు తెల్లగా పాలిపోయింది. ఆఫీసర్‌గారు జై హింద్ బు చెయ్యి విదిలించుకుని దర్పంగా ఠీవిగా అడుగులు వేసుకుంటూ ళ్ళిపోయాడు.

అంత కష్టపడి ఎంతో నేర్పుతో దొంగని పట్టుకున్నందుకు హింద్ బాబుని ఎవరూ అభినందించలేదు. ఏదో ఉపద్రవం జరిగి ట్లు, జరుగకూడని దారుణమేదో జరిగిపోయినట్లు అందరూ బిత్తర పోయి నిలబడ్డారు. జై హింద్ బాబుని హీరోని చూసినట్లు చూడటానికి బదులుగా. ఉరిశిక్ష విధించబడ్డ హంతకుణ్ణి చూపినట్లు, కోపంగానూ, జాలిగానూ కూడా చూశారు.

ఆ సాయంత్రమే దయానంద్‌గారి నౌకరువచ్చి "అయ్యగారు నిన్ను రమ్మంటున్నారు" అని చెప్పాడు జైహింద్ బాబుతో-జై హింద్ బాబు వెంటనే, దయానంద్‌గారి ఇంటికి వెళ్ళాడు.

"రా! కూర్చో!" అని ఒక స్టూల్ చూపించాడు దయానంద్, దయానంద్ మంచివాడే కాని అతని ప్రవర్తనలో వ్యాసమూర్తి ప్రద ర్శించేటంత విశాల హృదయం కనిపించదు. జైహింద్ బాబుని అంతకు ముందెన్నడూ అతడు కూర్చోమని మర్యాద చెయ్యలేదు. ఎంతదయగా చూపినా 'నువ్వొక నౌకరువి సుమా!' అన్నట్లుగానే చూసేవాడు. తబ్బిబ్బు పడుతూ కూచున్నాడు జై హింద్ బాబు.

తన జేబులోంచి అయిదువందల రూపాయలు లెక్కపెట్టి జైహింద్‌బాబు చేతిలో పెట్టాడు దయానంద్.

జైహింద్‌బాబు తెల్లబోయి "ఎందుకు సార్?" అన్నాడు.

"ఇదివరకు నీ జీతంలోంచి విరక్కొట్టినదానికి మూడురెట్లు నష్టపరిహారం...."

జైహింద్‌బాబు సంబరంగా "ఎందుకు సార్! దొంగని పట్టుకున్నందుకు బహుమానంగా ఇస్తున్నారా?" అన్నాడు.

జైహింద్‌బాబుని వెర్రివాడిని చూస్తున్నట్లు నిరసనగా, జాలిగా చూశాడు దయానంద్.

"కాదు. నా సొంత డబ్బులోంచి ఇస్తున్నాను."

"ఎందుకు సార్! ఇదివరకు నా జీతంలోంచి విరక్కొట్టినందుకా? ఫరవాలేదు. మీరు నా మీద చూపిస్తోన్న దయ చాలు!"

ఆ డబ్బు తిరిగి ఇచ్చెయ్యబోయాడు జైహింద్‌బాబు.

దయానంద్ తీసుకోకుండా "నేను నీ మీద చూపించగలిగిన దయ ఇంతవరకే! ఆ డబ్బు తీసుకో! మా కేంటీన్‌లో వేరేసర్వర్‌ని కుదుర్చుకున్నాం! రేపటినుంచీ నువ్వు పనిలోకి రానక్కర్లేదు" అన్నాడు గంభీరంగా....

ఉన్నపాటున నెత్తిమీద పిడుగుపడినట్లయింది జైహింద్‌బాబుకి. మూర్ఖుడిలా చూస్తూ కూచున్నాడు, చైతన్యం లేకుండా.

'ఇంక వెళ్ళవచ్చు' అన్నట్లు లేచి నిలబడ్డాడు దయానంద్.

జైహింద్‌బాబు ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా దయానంద్ చూపులే, అతణ్ణి కూచున్న చోటనుండి లేవగొట్టి బయటికి పంపివేశాయి.

# 16

వర్షాకాలం-తుపాను గాలులు వీస్తున్నాయి. నాలుగయిదు రోజులుగా వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. ఆ వానలో, ఈదరగాలిలో రాజయ్యను పనిలోకి రావద్దని చెప్పాడు వెంకడు. దానికితోడు అంతకు ముందు నాలుగయిదు రోజులనుంచీ అతనికి కొద్దిగా జ్వరంకూడా వస్తోంది. అంచేత బద్ధకించి ఇంట్లోనే పడుకున్నాడు.

నాగమ్మ అదిచూసి విసుక్కుంటూ "నువ్విట్టా పడుకుంటే తోట ఏమయిపోవాల? ఎవడేనా ఆ కాపిని కూరా నారా కోసుకుపోతే, మనకెట్టా గడుస్తది?" అని సతాయించటం మొదలుపెట్టింది.

తోటలో వెంకడున్నాడని చెప్పడానికి భయపడ్డాడు రాజయ్య. "ఫరవాలేదు లేవే!" అన్నాడు జ్వర భారంతో.

"ఏం ఫరవాలేదూ! నీకు బాగోకుంటే నువ్వు పడుకో! నేనే పోతా!" అది రుసరుసలాడుతూ బయలుదేరింది.

అక్కడితో హడిలిపోయాడు రాజయ్య. "వద్దు లేవే! నేనే పోతా!" అని లేచి కంబళి కప్పుకుని పెద్ద తాటాకులగొడుగు తీసుకుని బయలుదేరాడు.

నాగమ్మకి రాజయ్యపైన అభిమానం ఉంది. కానీ అంత మాత్రం జ్వరాలకి ఆ కుటుంబాల్లో ఎవరూ పడుకోరు. నాగమ్మ పడుకోదు. రాజయ్యకు జ్వరంగా ఉండి లేవలేకపోతే నాగమ్మ తనే బయలుదేరతా నంటుంది. కానీ తోటని అలా దక్షతలేకుండా వదిలెయ్య నియ్యదు.

ఏదో పరాగ్గా ఆలోచిస్తూ, నడుస్తున్నాడు రాజయ్య. అదంతా మిట్టపల్లాలతో ఉన్న కంటోన్‌మెంట్ ఏరియా....వానలు పడటంతో, అంతా బురదగా రొచ్చుగా తయారయింది. అలవాటయిన దారికదా

అని చూసుకోకుండా నడుస్తున్నాడు రాజయ్య. అతనికాలు జారింది. ధన్‌మని ఆ బురదలో పడిపోయాడు. అతనిచేతిలో తాటాకు గొడుగు ఎగిరి అల్లంతదూరాన పడింది.

అలా బురదలో పడిపోయిన రాజయ్య తనంత తను లేవలేకపోయాడు. కేకలు పెట్టినా ఆ వర్షపు హోరులో ఎవరికీ వినిపించలేదు. పాపం, నడివయసు దాటిన రాజయ్య, జ్వరంతో ఆ వర్షంలో ఆ బురదలో పడి ఉండవలసి వచ్చింది. చలికి గడగడ లాడిపోతూ ఓపికున్నప్పుడు అరుస్తూ అలా ఉండిపోయాడు సాయంత్రంవరకు....

రాజయ్య ఎంతకూ రాకపోయేసరికి, కంగారుపడి నాగమ్మ బయలుదేరింది. దారిలో వంటిమీద తెలివిలేకుండా బురదలో పడిపోయి ఉన్న రాజయ్యను చూసి గుండెలు బాదుకుంటూ ఏడుస్తూ లేవదియ్యబోయింది. దానివల్ల కాలేదు. కొయ్యబారినట్లు అయిపోయాడు రాజయ్య. నాగమ్మ గుండె బెదిరింది. గోలుగోలున ఏడుస్తూ గుడిసెల్లో వాళ్ళని నలుగురినీ పోగుచేసు కొచ్చింది. అందరూ కలిసి సాయంపట్టి రాజయ్యని ఇంట్లో చేర్చారు. ఎలాగో....

పాపం, వెంకడికి ఈ సంగతు లేమీ తెలియవు. వర్షంగా ఉండటంవల్ల....తను రావద్దనటంవల్ల తన తండ్రి రాలేదని అనుకున్నాడు. తండ్రికి తనమీదఉన్న విశ్వాసానికి ఆనందించాడు.

మూలుగుతూ పడుకున్న తండ్రిదగ్గిరే కూచుంది చంద్రి. తండ్రిని ఆ దశలో చూసేసరికి చంద్రికి దుఃఖం ఆగలేదు. తండ్రి తననెంతో అల్లారుముద్దుగా చూసుకుంటాడు. పాపం, ఇలా పడిపోయాడు. తండ్రికోసం ఏడుస్తూ కూచున్న చంద్రికి, ఈ విషయం వెంకడికి తెలియపరచాలనే ఆలోచనే రాలేదు.

ఆ మరునాటికల్లా పెళ్ళుమంటూ జ్వరం ముంచుకొచ్చింది రాజయ్యకి. వంటిమీద స్పృహలేకుండా మూలుగుతున్నాడు. ఆదశలో రాజయ్యని ఆస్పత్రిలో చేర్పించారు.



అప్పుడు తెలిసింది వెంకడికి అసలు సంగతి. గోడుగోడున ఏడుస్తూ ఆస్పత్రి కొచ్చాడు.

"తోటలో నేనున్నాగా పిన్నీ! మళ్ళీ అయ్యనెందుకు పంపావ్! సూడు! ఎంత పని జరిగిందో!" అన్నాడు.

తను ఇంట్లోంచి వెళ్ళగొట్టిన వెంకణ్ణి రాజయ్య తోటలో పెట్టుకున్నాడనే సరికి అంతదుఃఖంలోనూ మండిపోయింది నాగమ్మకి. పై పెచ్చు తనకారణంగానే రాజయ్య ఇలా అయిపోయాడని వెంకడంటూంటే భరించలేకపోయింది.

"శనిముఖమోడా! దీనికంతకీ నువ్వే కారణం. ఆ తోట మొత్తం కాజెయ్యాలని, నువ్వే ఏదో మంతరం పెట్టావు. కాకుంటే ఇన్నాళ్ళ మట్టీ, వానలో, వరదలో, ఎండనక, కొండనక తిరుగుతున్నాడు గందా, ఎప్పుడైనా కాలుజారి పడ్డాడా? పో! పో!" అని కసిరింది.

చంద్రి అంతా వింటునేఉంది, బాధపడింది. కానీ తండ్రి అలా ఉన్న స్థితిలో తల్లితో పోట్లాడటానికి తండ్రిని వదిలి వెంకడిదగ్గిర కొచ్చి వెంకణ్ణి ఓదార్చటానికీ ఓపిక లేకపోయింది.

బిక్కముఖం వేసుకుని మనసులో కుమిలిపోతూ వెళ్ళిపోయాడు వెంకడు.

వెంకడు మంత్రం వేసాడనీ, అందుకే ఎన్నడూ లేనిది, రాజయ్య జారిపడి ఆస్పత్రిలో చేరవలసి వచ్చిందనీ, క్షణాలలో గుడిసెలన్నింటిలోనూ వార్త పాకింది. అందరూ ఆ వార్తని నమ్మారు.

కుతూహలంతో తనను ప్రశ్నలు వేసే తోటివారికి ఆ విషయాన్నే చిలవలు పలవలు చేర్చి చెప్పింది నాగమ్మ. అందరికీ చెప్పి చెప్పి, నాగమ్మ మనసులోనే ఆ విషయం ధ్రువపడిపోయింది. వెంకడి మంత్రంవల్లనే రాజయ్య ఆ స్థితికి వచ్చాడని మనసారా నమ్మేదశకు చేరుకుంది నాగమ్మ.

తండ్రి ఆరోగ్యంకోసం బెంగపడుతూ తండ్రి సంరక్షణలో ఉన్న చంద్రి ఈ విషయాలేవీ పట్టించుకోలేదు.

రాజయ్య జబ్బుసంగతి విని జైహింద్‌బాబు కూడా చూడ్డానికి వచ్చాడు. నాగమ్మ అతడిరాకను సహించలేకపోయింది.

"తగుదునమ్మా, అని బిడ్డపెళ్ళి సెడగొట్టి ఏ మొక మెట్టుకోని, ఈడకి సూట్టాని కొచ్చావు? ఎల్లెల్లు? నా బిడ్డ గొంతు నులిమి నూతిలో పారేస్తా కాని, కట్టుదప్పి వరసలేని మనువు సేసుకోనియ్యను. సేసేయన్నీ సేసి. ఏ మెరగనోడిలాగ స్నేహితాలు సూపుదా మనుకుంటున్నావా? మల్లా మా జోలి కొచ్చినావంటే మరియాద దక్కదు. మా ఇంటికేసి రాబోకు! నీతో మంచీ, సెడ్డా మా కేం అక్కర్లేదు. ఫో!" అని కసిరికొట్టింది.

బొమ్మలాగ నిలబడిపోయిన జైహింద్‌బాబు తండ్రి మంచం దగ్గిర కూచున్న చంద్రిని చూశాడు. తండ్రి మంచంకోడుకి తలకొట్టుకుని ఏడ్చింది చంద్రి. తలవంచుకుని అక్కడినుండి వచ్చేశాడు జైహింద్‌బాబు.

రాజయ్యకి పదిహేను రోజులు విడవకుండా వచ్చింది జ్వరం. కొడుకూ, కూతురూ, తనే అయి అదుకుంది చంద్రి.

చివరకు ఎలా అయితేనేం, జ్వరం తగ్గింది. జ్వరం తగ్గింది కదా, అని లేవటానికి ప్రయత్నించాడు. తన శక్తినంతా ఉపయోగించినా, తన శరీరంలో ఎడమభాగం కదిలించలేక పోయాడు. ఆ భాగం కదలటంలేదని గుర్తించాడు.

చంద్రి డాక్టర్‌ని పిలుచుకొచ్చి చూపించింది. 'పక్షవాతం' అని చెప్పాడు డాక్టర్. డాక్టర్‌మాట వినగానే గుండె బాదుకుంటూ ఏడుపు మొదలుపెట్టింది నాగమ్మ. రాజయ్యకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇద్దరిలో ఎవరినెలా ఓదార్చాలో అర్థంకాక, తన మనసులో క్షోభ



ఎవరితో చెప్పుకోవాలో అర్థంకాక కుమిలికుమిలి ఏడ్చింది చంద్రి....

ఆ వర్షంలో తను పోరి రాజయ్యను పంపటంవల్లే రాజయ్య ఇలా అయిపోయాడేమో అనే ఆలోచన వదలటంలేదు నాగమ్మను. నాగమ్మ ఆ ఆలోచనను భరించలేక పోతోంది. రాజయ్యస్థితికి తను కారణం కాదని అనుకోకపోతే దానిమనసు స్థిమితపడటం లేదు.

"ఆ యెంకడే నా మీద కసితో సేతబడి సేశాడు. అందుకే నా బతుకిట్టా భగ్గుమని పోనాది" అని ఏడుపు మొదలుపెట్టింది.

మంచంలో ఉన్న రాజయ్య "ఊరుకోయే!" అని కసిరాడు.

నాగమ్మ రెచ్చిపోయి "ఇంత సేసినా, నీకు ఆడిమీదే బెమ! అసలు నాకు తెలపకుండా ఆణ్ణి తోటలో ఎందుకు సేరనిచ్చావ్? ఆడికి కళ్ళుకుట్టి సేతబడి సేసేశాడు. అనుబయించు" అని మెటికలు విరిచింది.

వెంకడు చేతబడి చెయ్యబట్టే రాజయ్యకు పక్షవాతం వచ్చిందని అందరూ అంగీకరించారు. చుట్టుపక్కల అందరూ రాజయ్యని చూడటం....అది చేతబడేననటం....ఎప్పుడెప్పుడు, ఎక్కడెక్కడ....ఎవరెవరికి, ఎవరెవరు చేతబళ్ళు చేశారో, ఆ చేతబళ్ళ ప్రభావంచేత ఏం జరిగిందో, అవన్నీ కథలుగా చెప్పుకోవటం.... తిరుగు చేతబడి చేయమని సలహాలివ్వడం—ఇవన్నీ పరిపాటి అయిపోయాయి.

"అయ్యకి సేతబడి సేసి ఆ కాస్త తోటా ఊడలాక్కోవాలనుకుంటున్నాడు. చచ్చినా ఆణ్ణి తోటలో అడుగెట్టనివ్వను" అని నాగమ్మ వెంకణ్ణి తోటలోంచి వెళ్ళగొట్టింది.

పనిపాటల కలవాటుపడిన మనిషే గనుక తోటపనులన్నీ తనే చూసుకోసాగింది. వెంకడిబదులు తనకు తోడుగా ఉండటానికి నెల జీతంమీద, మరో మనిషిని కుదుర్చుకుంది.

ఇదంతా ఎంత బాధగా ఉన్నా, రాజయ్య నోరు మెదపలేక పోతున్నాడు. మామూలుగానే రాజయ్య నాగమ్మకి ఎదురుచెప్పలేక పోయేవాడు. మంచంలో లేవలేక పడిఉండి, అన్నింటికీ నాగమ్మమీద ఆధారపడిఉన్న స్థితిలో నాగమ్మ నేం ఎదిరించగలడు?

చంద్రి అసలేం చెప్పలేకపోతోంది. తల్లికి తనమీద ఎంత ప్రేమఉన్నా, మాటకి ఎదురుచెప్తే మాత్రం ఊరుకోదు.

మరొకసారి నిరాశ్రయుడైన వెంకడు చేసేదిలేక సరళను ఆశ్రయించాడు. సంగతి తెలుసుకున్న సరళ అతణ్ణి తమ పొలంలో పాలేరుగా ఉండమంది.

సారథి కొద్దిగా సణుగుతూ "లేనిపోని నింద లొస్తాయక్కా!" అనేశాడు.

సరళ తమ్ముడిముఖం నిశితంగా చూస్తూ "నింద లొస్తాయా? కొత్తగా ఏం వస్తాయిరా? పోనీ, ఈ అక్కదగ్గిర ఉండటం నీకు పరువు నష్టమనుకుంటే విడిగా ఉండు. ఇప్పుడు నువ్వు చదువుకున్న వాడివి. ఉద్యోగస్థుడివి" అంది.

గతుక్కుమన్నాడు సారథి. "అంత మాటనకు అక్కా! నీ మేలు ఆలోచించి అన్నాను. ఈ లోకం సంగతి నీకు తెలియదు" అన్నాడు.

నిరసనగా నవ్వింది సరళ.

"లోకం సంగతి నాకెందుకు తెలియదురా! అందరూ ఆ రోజు లేనిపోని నిందలు అంటగట్టి ఆ వెంకణ్ణి గొడ్డును బాదినట్టు బాదుతోంటే పాపం, చచ్చినట్టు భరించాడు. నన్ను వాడివెంట ఇంట్లోంచి బయటికి గెంటితే....తనకు తినటానికి లేకపోయినా, నా భారం, నీ భారం కూడా నెత్తిమీద వేసుకుని తనవెంట తీసుకెళ్ళాడు. ఈ నాడు నా పరిస్థితి చక్కబడి వాడు కొద్దిపాటి ఆశ్రయం కోరితే నిందలకు



యపడి పొమ్మని అనగలనా? నేనుకూడా లోకంలో అందరితోపాటు న్నే అనుకుంటున్నానా?" అంది.

సారథి ఇంకేం మాట్లాడలేదు.

సరళ అక్కడితో వదలిపెట్టలేదు.

"ఇందులో నా స్వార్థంకూడా ఉంది సారథీ! వెంకణ్ణి నా పొలంలో ఉంచితే ఏ పరిస్థితుల్లోనైనా వాడు ఆ పొలాన్ని వెయ్యి కళ్ళతో కాపాడతాడు. ఆ విశ్వాసం నాకుంది. చాలామంది చదువుకున్న వాళ్ళకంటే, పెద్దింటివాళ్ళకంటే అమాయకుడైనవాడి మనసు చాలా గొప్పది!"

సారథి చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయాడు. తమను ఆదుకున్నది జైహింద్ బాబు. వెంకడుకాదు. అలాంటప్పుడు తాము వెంకడికెందుకు కృతజ్ఞతలు చూపించాలి? వాడికేం? కూలిమనిషి. తమదగ్గిర కాకపోతే, మరొకచోట కూలిపని చేసుకోగలడు. తన అక్క దేవత. ఆ సంగతి తనకు తెలుసు. కానీ, అంతకుముందే, ఎవరి కారణంగా నిందపాలయిందో, అదే వ్యక్తిని తెచ్చి తమ పొలంలో పెట్టుకోవటం దేనికి?

మనసులో ఇలా ఆలోచించినా, అక్కముందు నిలిచి మరో మాట అనటానికి సాహసం కలగలేదు సారథికి.

ఆ ఇంట్లోంచి దూరంగా పోయినా చంద్రిని కలుసుకోవటం మానలేదు వెంకడు. వారానికో పదిరోజులకో, ఒకసారి వచ్చేవాడు. వచ్చినప్పుడల్లా చంద్రికి ఏదోఒక బహుమానం తీసుకొచ్చేవాడు. అవి తీసుకోవటానికి చంద్రికి చాలా సిగ్గుగా ఉండేది.

"అన్నా! నిన్ను ఇంట్లోంచి అమ్మ పొమ్మంటూంటే నోరు మూసుకుని చూస్తూ కూచున్నాను. పాపిష్టిదాన్ని. నామీద కోపం ఉంచు

కోకుండా, ఇంకా నాకోసం అవీ, ఇవీ తెస్తున్నావు నువ్వు. వద్దన్నా! సుఖంగా నీ బ్రతుకు నువ్వు బ్రతుకు." అనేది.

చంద్రి అలా మాట్లాడితే, వెంకడు బాధపడేవాడు. "అదేంటి సెల్లే! నీ మనసు నాకు తెలవదా? నిన్ను సూడకపోతే నా పేనం నిలవదమ్మా!" అనేవాడు.

వెంకణ్ణి బాధపెట్టలేక అతడు తెచ్చినవి తీసుకునేది.

నాగమ్మమీద మరో పిడుగుపడింది. రాజయ్య తోట వేసుకున్న స్థలం యజమానివచ్చి తన స్థలం తను స్వాధీనం చేసుకుంటానన్నాడు. నాగమ్మ లబోదిబోమని మొత్తుకుంది. తన దగ్గిర ఆ స్థలం కవులుకు తీసుకున్న రాజయ్య మంచ మెక్కాడుగనుక, తన స్థలం తను స్వాధీనం చేసుకోవటంలో తప్పు లేదన్నాడు యజమాని.

తన గతేం కావాలని అడిగిన నాగమ్మతో "ఇన్నాళ్ళు నువ్వు నా పొలం చేస్తున్నావా? ఇప్పటివరకూ ఏం చేస్తున్నావో, అదే చేసుకో." అని దబాయించాడు.

ఎంత నోరుగలదైనా ఆడది. నాగమ్మ ఒక్కర్తే ఏంచెయ్యలేకపోయింది. అప్పటివరకూ తమకు కొంత బాగా బతకటానికి ఆస్కారంగా ఉన్న తోట పోయింది. రాజయ్య మంచమెక్కాడు. నాగమ్మపని అన్ని విధాలా అధ్వాన్న మయింది.

"అమ్మా! నేను ఎక్కడయిగా పనికి కుదురుకోనా?" అడిగింది చంద్రి.

బావురుమని ఏడ్చింది నాగమ్మ. తమ బిడ్డని మిగిలిన అందరిలా పాచిపనికి పంపించాలనే ఆలోచనకు రాజయ్య కూడా తట్టుకోలేకపోయాడు.

"ఆ తోట అట్టా లాక్కోటం అన్నేయం. జయన్న నడిగితే



...బాబుతో ఆలోచించి ఏదో సేస్తాడు-సరళమ్మ భూమి సరళమ్మ ...ప్పించలా?" అన్నాడు రాజయ్య.

ఈ ఆలోచన నాగమ్మకి నచ్చింది. జయన్న అంతటి సమర్థు...ని నాగమ్మకీ తెలుసు.

"ఒసేయ్! చెంద్రీ! యెల్లి జయన్న బావనో సుట్టు పిలుసుకు...వే!" అని కూతుర్ని బ్రతిమాలింది.

"బావిలోపడి చస్తాకాని, బావతో మాట్లాడను. నేను నీ ...తుర్ని-కట్టుదప్పిన పనులు నేనెందుకు చేస్తాను?" పెంకిగా అంది ...ంద్రి.

నాగమ్మ విధిలేక జైహింద్‌బాబు ఇంటికెళ్ళింది. మంచంలో ...డిఉన్న అన్నమ్మను ఆప్యాయంగా పలకరించింది. అన్నమ్మ ...శ్చర్యపోయింది.

"ఏంటే వదినా, ఆడ నా మావ అట్లా అయిపోయినాడు-ఈడ ...వ్విట్లా అయిపోయినావు. ఏంటో ఎవరి అదురుట్టమూ బాగో...దు" అని కన్నీళ్ళు పెట్టుకుంది నాగమ్మ.

"మా జయన్న సదువయిపోతే మా కట్టాలు గట్టెక్కుతయి" ...శగా అంది అన్నమ్మ.

ఎప్పటిలా జైహింద్‌బాబు చదువుని తీసిపారేస్తూ మాట్లాడ...దు నాగమ్మ.

"జయన్న సాలా గొప్పోడొదినా! ఆడిలాంటోడు మనోల్లలో ...వురు లేరు" అంది.

అన్నమ్మ పొంగిపోయింది. తన కొడుకుని అంతగా పొగిడిన నాగమ్మ అపరాధాలన్నీ క్షమించేసింది.

"జయన్న నోసారి నాకు కనపడ మనొదినా!" ప్రాధేయపడుతూ అడిగింది నాగమ్మ.

"అయ్యో! అట్లాగే పంపుతా!" అంది అన్నమ్మ.

కాసేపు రత్నమ్మతో అదీ ఇదీ మాట్లాడి తను నూరి తెచ్చి చింతకాయ పచ్చడి రత్నమ్మ చేతిలోపెట్టి వెళ్ళిపోయింది నాగమ్మ

తనను నాగమ్మ రమ్మన్నదని తల్లి చెప్పగానే జై హింద్ బాబు వెళ్ళాడు.

జై హింద్ బాబుని గుమ్మంలో చూడగానే చంద్రి రోష "సిగ్గులేదూ! ఎందుకొచ్చావ్? ఛీకొట్టి పొమ్మన్నది మరిచిపోయావా పౌరుష మున్నవాడివయితే మళ్ళీ ఈ ఇంటికి రావు" అంది.

తెల్లబోయి నిలబడ్డారు జై హింద్ బాబు.

నాగమ్మ నవ్వు తెచ్చిపెట్టుకుంటూ "రా జయన్నా! దానిమాట లెక్కపెట్టకు, అదంతా నిన్ను పొమ్మన్నానని అక్కసులే. పెద్దోళ్లం గదా! కట్టుదప్పాలంటే భయంకాదూ! మీ అమ్మ మాత్రం కట్టు తప్పుద్దా? అట్లాగని రాకపోకలు మానుకుంటామా? ఈడ మనకెవ రున్నారని? మీకు మేమూ, మాకు మీరూ...." అంది దీర్ఘాలుతీస్తూ.

నాగమ్మకి తనతో ఏదో పనిఉందని అర్థమయిపోయింది జై హింద్ బాబుకి. అది ఆసరాగా తనను అవమానించినందుకు చంద్రి తల్లిమీద కసితీర్చుకుంటోందని కూడా అర్థమయింది. నాగమ్మ మీద జై హింద్ బాబు కేమీ కోపంలేదు, అందరికందరే! ఆ మూర్ఖత్వాలు అలాంటివి. ఎవరిమీద కోపం తెచ్చుకోగలడు తను?

"ఇందులో పరాయివాళ్ళెవరు చంద్రీ! ఒక మాటన్నా అత్తే అనాలి. చేరదీసినా అత్తే చేరదియ్యాలి!" అంటూ లోపలికివచ్చి కూచున్నాడు.

నాగమ్మ పొంగిపోయింది. "మా నాయనే!" అంటూ మెటి కలు విరిచింది.



చంద్రి చిరునవ్వుతో జై హింద్ బాబుని చూసి చటుక్కున ఖం తిప్పుకుంది.

"జయన్నా! ఆ ముదనష్టపోళ్ళు ఇన్నాళ్ళ మా కట్టవూ కాదని తోట మాదంటన్నారు. నువ్వెట్లాగయినా ఆ వకీలుబాబుతో చెప్పి తోట మా కిప్పించాలి!"

తన గోడు చెప్పుకుంది నాగమ్మ.... రాజయ్య పక్షవాతంతో చమెక్కగానే ఆ తోట తన స్వాధీనం చేసుకుందుకు ఆ స్థలం జమాని ప్రయత్నించటం జై హింద్ బాబుకీ చాలా కోపం తెప్పిం ది.

"ఆ తోటంతా రాజయ్య రెక్కలకష్టం-రాత్రనక పగలనక పడి బంజరుభూమిని బంగారంగా మార్చాడు. ఇప్పుడు దాన్ని క్కని మంచమెక్కిన రాజయ్యని బికారిని చెయ్యాలనుకుంటు డు యజమాని. ఈ షావుకార్లు బీదల రక్తంతాగి తమ ఇనప్పె లు నింపుకోవాలనుకుంటారు," అనుకున్నాడు ఆవేశంగా.

"దిగులుపడ కత్తా! వకీలు బాబుగార్ని కనుక్కుంటాలే! యన న్యాయం చేస్తాడు." అన్నాడు.

"మా నాయనే! నాతండ్రే! పది కాలాలపాటు చల్లగాఉండు. గా చదువుకుని పెద్ద దొరవుకా!" అని ఆశీర్వదించింది నాగమ్మ.

ఆ ఆశీర్వాదంలో రెండవభాగం వింటున్నప్పుడు మనస్సు ఱుక్కుమంది జై హింద్ బాబుకి. చంద్రివైపు భావగర్భితంగా చూసి క్కడినుంచి వచ్చేశాడు.

వ్యాసమూర్తిని కలుసుకుని సంగతి సందర్భాలన్నీ వివరిం డు జై హింద్ బాబు.

"తోట చూస్తున్న మనిషిని తీసేసి యజమాని మరొకరికిస్తే నం పోట్లాడవచ్చు. కానీ చేస్తున్న మనిషి మంచమెక్కితే యజ

మాని ఆ తోట స్వాధీనం చేసుకోవచ్చు. నాగమ్మ ఇప్పుడు అమాంతం వచ్చి తోట తనదంటే కుదరదు. రాజయ్య ఒక్కడే ఆ తోట చేసేవాడా? అతనితో కలిసి తోటచేస్తున్న వాళ్లెవరూ లేరా?" అని అడిగాడు వ్యాసమూర్తి.

"వెంకడూ, రాజయ్య కలిసే చేసుకునేవాళ్ళు. దగ్గిర దగ్గిర ఈ రెండేళ్ళుగా అలాగే చూసుకుంటున్నారు."

"వెంకడు రాజయ్య కేమవుతాడు?"

"కొడుకు!"

"అయితే ఇకనేం? వెంకడు ఆ తోటను చేసుకుంటానని యజమానితో పోట్లాడచ్చు. అప్పుడు ఆ తోట తీసుకుని మరొకరి కిచ్చే అధికారంకాని, స్వాధీనంచేసుకునే అధికారంకాని యజమానికి ఉండదు."

ఆ మాటవిన్న జై హింద్ బాబు నాగమ్మని తలుచుకుని కొద్దిగా జాలిపడ్డాడు. భగవంతుడే నాగమ్మ కీవిధంగా బుద్ధి చెబుతున్నాడ అనిపించింది.

నాగమ్మ దగ్గిర కొచ్చి వ్యాసమూర్తి చెప్పింది చెప్పాడు. నాగమ్మ ఉసూరుమనిపోయి "ఇప్పుడాణ్ణి బతిమిలాడుకోవాలా?" అంది.

చంద్రి ఊరుకోకుండా "వద్దమ్మా! వాడు చేతబడి చెయ్యబట్టే అయ్య ఇలా అయిపోయాడు. వాణ్ణి మన గుడిసెలోకి రానియ్యనే వద్దు" అంది.

నాగమ్మకి తను కల్పించుకున్న అబద్ధం తనకే నిజమయిపోయింది. మంత్రాలలో తంత్రాలలో నమ్మకం ఉన్న నాగమ్మకి వెంకడు చేతబడి చేశాడేమోననే అనుమానం నిజంగానే ఉంది. అందుకే ఇంత జరిగినా వెంటనే వెంకడి దగ్గరకు వెళ్ళలేకపోయింది.



అన్నీ వింటోన్న రాజయ్య ఊరుకోలేక "వెంకడు యెర్రి భోగులోడే! సేతబళ్ళు ఆడికేం తెలుస్తయ్యే! ఆడి తాత దగ్గర మూలికల వయిద్దెం నేర్చుకున్నాడు. అంతేనే. ఆడు నా కెందుకు చేతబడి సేస్తాడే! పిలవ్వే! ఆ తోట చూసుకుంటాడు. నీకూ, చెంద్రికీ దిక్కవుతాడు" అన్నాడు.

ఎప్పటిలా నాగమ్మ విరుచుకుపడలేదు. ఆలోచిస్తూ కూచుంది.

తల్లి వాలకం చూసి చంద్రి "వద్దమ్మా! అన్నని పిలవకు. మకేం బెంగ? నేనెక్కడన్నా పాచిపనిచేసి తిన్ను పోషిస్తాలే!" అంది.

ఆ మాటలతో నాగమ్మ హడలిపోయింది. ఒక్క రోజుకూడా ఆలస్యం చెయ్యకుండా వెంకడి దగ్గరకు బయలుదేరింది. తనను వెతుక్కుంటూ వచ్చిన పినతల్లిని చూసి ఆశ్చర్యంతో మతిపోయింది వెంకడికి.

"యేంటి పిన్నమ్మా!" అన్నాడు అభిమానంగా.

నాగమ్మ వెంకడి రెండుచేతులూ పట్టుకుని వెక్కివెక్కి యేడ్చింది.

వెంకడు హడిలిపోయి "యేంటి పిన్నమ్మా! అయ్య కెట్టా ఉంది? సెల్లె బావుందా?" అన్నాడు.

నాగమ్మ కళ్లు తుడుచుకుని "అదికాదురా! మనతోట యజమాని తోట మన కివ్వనంటున్నాడు. నువ్వు రావాలంట! ఇన్నాల్ల మట్టీ నువ్వు నేసినావుగందా? నువ్వొచ్చి జగడమాడితే ఆల్లు నీకొదిలేస్తారంట-జయన్న తోడుగా ఉంటాడు. వకీలుబాబు కూడా వత్తాసొస్తాడు" అంది.

వెంకడు తేలిగ్గా ఊపిరి పీల్చుకుని "ఓస్! ఇంతేనా! వస్తాలే! పిన్నమ్మా! మనతోట పోతావుంటే యెట్టా పూరుకుంటా! యీ

సేతుల్తో పెంసాను ఆ మొక్కల్ని. అయ్యన్నీ వదిలివత్తా ఉంటే కల్ల నీల్లొచ్చినా యనుకో!" అన్నాడు.

వెంకడి మంచితనం అప్పటికి నాగమ్మకి బాగా అర్ధమయింది. తమతోట స్వాధీనం చేసుకోవాలనే దురాశతో వెంకడు వస్తానంటున్నాడని నాగమ్మ అనుకోలేకపోయింది. వెంకడి దగ్గిరకు రావటానికి ముందే అతడి సంగతి సందర్భాలన్నీ విచారించింది. సరళ పొలాల్లో పనిచేస్తూ అతడు తోటలో సంపాదించిన దానికంటే ఎక్కువగా సంపాదిస్తున్నాడు. సరళ ఇంట్లో అందరూ అతణ్ణి గౌరవంగా చూస్తారు. "అవును మరి! సరళమ్మకాడ సంపాదించకుండా మరేద సంపాదిస్తాడు" అనుకుంది అక్కసుగా.

ఆ సరళమ్మని వొలిది తను రమ్మంటే వస్తాడో రాడోనని భయపడింది. అలాంటిది ఒక్కమాట తను రమ్మని అనగానే సంతోషంగా రావటానికి ఒప్పుకున్నాడు. ఏమైనా ఉంటే ఇలా వస్తానంటాడా? రాజయ్యన్నట్టు నిజంగానే వెర్రిబోగులోడు. తను అన్నిమాటలన్నా ఒక్కమాట మనసులో పెట్టుకోలేదు.

సరళతో చెప్పి నాగమ్మ దగ్గిరికి వచ్చేశాడు వెంకడు. జరిగిందేదీ మనసులో పెట్టుకోకుండా సవతితల్లిని ఆదుకోవటానికి వెళ్తోన్న వెంకడికి మనసులోనే నమస్కరించింది సరళ. "వీళ్ళ దగ్గిరనుంచి నేనెంతో నేర్చుకోవాలి" అనుకుంది.

వ్యాసమూర్తి సహకారంతో తోటను వెంకడి స్వాధీనం చెయ్యగలిగాడు జైహింద్ బాబు.

వ్యాసమూర్తి నవ్వుతూ, "జయన్నా! ఎంతసేపూ వాళ్ళకోసమూ, వీళ్ళకోసమూ నన్ను సహాయం అడుగుతావేకాని, నీకోసం ఏదీ అడగవేం?" అన్నాడు.



"అదేంటి బాబుగారూ! వీళ్ళంతా నావాళ్ళు కారా?" అన్నాడు హింద్ బాబు. వ్యాసమూర్తి మాట్లాడలేదు. "ఇలా అందరూ సుకోగలిగితే .... కనీసం వందమందిలో పదిమంది అనుకో గితే...." అని ఆశపడింది అతని హృదయం.

# 17

నకు దయానంద్‌గారిచ్చిన అయిదువందలూ, అలా ఇలా ఖర్చు కాకముందే ఆ డబ్బుతో రత్నమ్మకు పెళ్ళి చేయ్యాలనుకున్నాడు హింద్ బాబు.

"అమ్మా! రత్తికి సంబంధం చూస్తున్నాను." అని తల్లితో ప్పగానే "ఇప్పుడు డబ్బేడదిరా!" అంది అన్నమ్మ బాధగా.

"ఎలాగో సర్దుతానులేవే! అసలే దానిమీద లేనిపోని నింద చ్చి పడుతున్నాయే! తొందరగా చేసేస్తేనే మంచిది."

"జయన్నా! ఎట్టాగో, అట్టా దానికి పెళ్లి అయిందని ంచెయ్యి. నాకిక చీకూ చింతలే వుండవు" అంది అన్నమ్మ బాధగా.

అతిప్రయత్నంమీద సంబంధం కుదిర్చాడు జయన్న. అన్ని విషయాలూ మాట్లాడుకున్నాడు. అంతా నిశ్చయమయింది. పెళ్ళికి ముహూర్తంకూడా నిశ్చయించారు. పెళ్ళి ఏర్పాట్లు ఉన్నదానిలో ఉన్నంత క్లుప్తంగా బాగానే జరిపించాడు జయన్న.

అందరి హృదయాలూ ఏదో కీడును శంకిస్తూ దడదడలాడుతున్నాయ్. తనవాళ్ళ మనస్సుల్లోంచి ఆ భావం పోగొట్టాలని జైహింద్ బాబు చేసిన ప్రయత్నం వృధా అయిపోయింది.

ముహూర్తం దగ్గిరపడుతోంది. పెళ్ళివారు రాలేదు. అందరూ

పెళ్లికూతురి వేషంలో వున్న రత్నమ్మను చూస్తూ వాళ్ళల్లో వాళ్ళు గుసగుసలాడుకుంటున్నారు.

లేని ఓపికతో లేచి తిరుగుతోంది అన్నమ్మ. ముహూర్తం సమీపిస్తున్నకొద్దీ అన్నమ్మకు శరీరమంతా చెమటలు పట్టసాగాయి. ముహూర్తం దగ్గిరవుతున్నకొద్దీ పెళ్ళివారు రాలేదని తెలుసుకుని నిలువునా వణికిపోసాగింది.

"అమ్మా! నువ్వు కూచో. ఈ పనులు మేం చూసుకుంటాంలే!" అని జై హింద్ బాబు నచ్చచెప్పినా అన్నమ్మ కూచోలేక పోతోంది. తల్లిని చూస్తోన్నకొద్దీ జై హింద్ బాబుకి భయం వెయ్య సాగింది. కానీ ఏవిధంగానూ తల్లిని స్థిమితపరచలేక పోయాడు.

ముహూర్తం సమీపించింది. పెళ్ళివారు రాలేదు. రత్నమ్మ శిలలా కూచుని పెళ్లి పందిరినే చూస్తోంది.

ముహూర్తం దాటి పోయింది. పెళ్ళివారు రాలేదు. అంత వరకూ గుస గుసలు చెప్పుకొంటూన్న బంధు వర్గం పైకే అనుకో సాగారు.

"ఒక్కోరి జాతకం అంతే!....ఏదనుకొంటే అదే మట్టవు తాది!"

"అదేం కరమో, రత్తికి యెప్పుడు పెళ్ళనుకున్నా, ఎవరో ఒకరు సావవలసిందే!"

"ఈసారి ఎవరికి మూడిందో?"

అన్నమ్మ చెవుల్లో ఇవన్నీ పడుతూనే ఉన్నాయి కానీ, ఏం చెయ్యగలదు? ఆ నోళ్ళు తను ముయ్యలేదు.

పెళ్ళి పందిరి ఉంచాలా? పీకెయ్యాలా? అసలు పెళ్ళి జరుగుతుందా, జరగదా అని అందరూ తర్జన-భర్జనలు జరుగుపుకొంటుండే ఎప్పటికో సాయంత్రానికి పెళ్ళివారి దగ్గిరనుంచి కబురు వచ్చింది....



వాళ్ళ బస్సులు బయలుదేరి వస్తోంటే, వాగు పొంగి రోడ్డు మీదకు రావటంవల్ల బస్ ఆగిపోవలసి వచ్చిందట! పెళ్ళివారికి ఇది చాలా అపశకునంగా తోచిందట!తీరా పెళ్ళి అయిపోతే, ఇంకా ఏం మూడుతుందోనని భయపడుతున్నారట! అంచేత వెనక్కి వెళ్ళిపోయారట! ఈ పెళ్ళి చేసుకోరట!

ఈ వార్త వినగానే విరుచుకు పడిపోయింది అన్నమ్మ.... జై హింద్ బాబు ప్రాణాలు పైన పోయాయి.

ఒక్కొక్కసారి మూర్ఖత్వాలు కూడా మనుష్యలను కాపాడ గలవు.ఇలాటిదేదో జరుగుతుందని అన్నమ్మ లోలోపల మొదటినుండీ భయపడుతూనే ఉండటంవల్ల ఈ దెబ్బకు తట్టుకో గలిగింది. నలుగురూ చేరి ఉపచారాలు చెయ్యగానే కోలుకుంది. అన్నమ్మని మంచం మీద పడుకోబెట్టి ఎక్కడి వాళ్ళక్కడ వెళ్ళిపోయారు.

రత్నమ్మకి పెళ్ళి కాలేదు. కాని జై హింద్ బాబుకి రెండు వందల రూపాయలు ఖర్చయ్యాయి. రత్నమ్మకి ఏడవటానికి కూడా శక్తి లేకపోయింది. తన పెళ్ళి బట్టలు విప్పేసి మామూలు చీరతో తనకు జావ తీసుకొచ్చిన రత్నమ్మను చూడగానే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కడుపులో ఏదో ఉక్రోషం చెలరేగింది. అది ఎలా బయట పెట్టుకోవాలో తెలియక రత్నమ్మ మీదే విరుచుకు పడింది.

"పోయే పో! అవతలికి పో! ముదనష్టపు జాతకం నీది.... శని జాతకం నీది....దరిద్రపు జాతకం నీది....నువ్వెక్కడడుగేస్తే అక్కడ భగ్గుమని పోతాది! అసలు నీమూలంగానే మాకిన్ని కష్టాలు! నువ్వు విరగయిపోతే, మా శనీ విరగడవుద్ది—పో! పో!"

తల్లి ధోరణికి జై హింద్ బాబు భయపడి పోతూ అడ్డు పడి "అదేంటమ్మా! రత్తినాడి పోసుకుంటావు దేనికి? అదేం చేసింది?" అన్నాడు.

"ఇంకేం సెయ్యాలి? దాని ముఖంలోనే ఉన్నాయి పంచ మహా పాతకాలు-ఇది సస్తే కాని, ఈకొంపకి పట్టిన శని వదల్దు...." మంచం కోడుకి తల బాదుకుని ఏడవసాగింది అన్నమ్మ.

జైహింద్ బాబు అడ్డుపడి అతికష్టంమీద తల్లిని ఒదార్చ గలిగాడు.

రత్నమ్మ పాపం, మొదటినుంచీ, ఎంతో ఎంతో సహిస్తూ వచ్చింది, చెల్లెలు బల్లదుకాణంమీద కూచుని హాయిగా గడుపుతూంటే తను పొద్దుటినుండీ, సాయంత్రంవరకూ పనికి కుదురుకుని, ఒళ్ళు దాచుకోకుండా పనిచేసి తన తిండికూడా అక్కడేతిని జీతం తెచ్చి తల్లిచేతి కిచ్చింది-తనకంటె చిన్నదయిన చెల్లెలు తనను ఈసడిస్తూ, తనకంటె ముందు మరొకర్ని పెళ్ళిచేసుకుని వెళ్ళిపోయినా సహించింది....అందరూ తనను శని జాతకురాలని మొహంమీదే అవమానిస్తున్నా సహించింది.

కానీ, ఏ తల్లిని ఇన్నాళ్ళుగా తన పనికూడా మానుకుని సేవించిందో, ఏ తల్లి మాత్రమే తనకు ఈ లోకంలో అండ అనుకుందో, ఆ తల్లికూడా ఈసడించుకుని ఛీకొట్టేసరికి భరించలేకపోయింది. అదీకాక, తనే శని జాతకురాలనీ, తన కారణంగానే ఆ కుటుంబం కష్టాలకు లోనవుతున్నదనీ....తను పోతే కుటుంబానికి, కష్టాలు పోతాయనీ,తల్లి నిందించటం రత్నమ్మను భయపెట్టింది-అది నిజమేనేమో అనిపించ సాగింది-ఆ ఆలోచన భరించ లేకపోయింది—అర్ధ రాత్రివేళలేచి అందరూ నిద్ర పోతున్నారనుకుని ఇంట్లోంచి బయలు దేరింది.

రత్నమ్మ ఏం చేస్తుందోనని జైహింద్ బాబుకి అనుమానంగానే ఉంది-పది నిముషాల కొకసారి లేచి రత్నమ్మ నిద్రపోతోందో, లేదోనని గమనిస్తోనే ఉన్నాడు. రత్తి పక్కలో అటు ఇటు, దొర్లటం, కొంగులో ముఖం దాచుకుని ఏడవటం అంతా గమనిస్తూనే



ఉన్నాడు-ఓదార్చి నందువల్ల దుఃఖం మరింత ఎక్కువవుతుందని, తనే స్తిమిత పడుతుందని, అలాగే పడుకున్నాడు—అలిసిపోయిన జైహింద్ బాబుకి కొద్దిగా కునుకు పట్టింది.

అశాంతితో అలమటించి పోతున్న అతని మనసు అతణ్ణి తట్టిలేపింది. ఆరాటంగా రత్నమ్మ పడుకున్న వైపుచూశాడు-రత్నమ్మ లేదు-గుండె ఝల్లుమంది....కేకలు వేస్తే తల్లి లేస్తుందేమో ననే భయంతో తన ఉద్వేగాన్ని నిగ్రహించుకుంటూ గుడిసె బయటికి వచ్చాడు-చుట్టు పక్కల రత్తి కనపడలేదు—దడ దడలాడుతన్న గుండెలతో ముందుకు నడిచాడు.

అల్లంత దూరంలో ఒక స్త్రీ మూర్తి పరిగెడుతూ కనిపించింది-అది రత్తేనని నిర్ధారణ చేసుకున్న జైహింద్ బాబు "రత్తీ!" అని అరిచాడు-ఆ అరుపుకు ఒక్కసారి వెనక్కు తిరిగిచూసి మరింత వేగంగా పరుగు పెట్టసాగింది రత్తి....జైహింద్ బాబు అంతకంటె వేగంగా పరుగుపెట్టి రత్తిని కలుసుకుని దాని చెయ్యి పట్టుకుని "ఏం పనే ఇది రత్తీ!" అన్నాడు.

రత్తి ఏడుస్తూ అన్న గుండెలమీద వాలి "నన్ను సావనియ్యి జయన్నా. నేను శనిని—నా మూలంగానే మీకీ కష్టాలు!" అని ఏడవసాగింది.

గుండెల్లో బరువు తగ్గేవరకూ ఏడవనిచ్చాడు జైహింద్ బాబు-తరువాత నెమ్మదిగా బుజ్జగిస్తూ "ఈ శనీ, గినీ, ఇయ్యన్నీ ఒట్టిదే, మనోళ్ళకి ఏం లేకపోయినా, ఈ నమ్మకాలు మాత్రం మిగిలాయి, పట్టుకు వేళ్ళాడటానికి....ఇంటికిరా! నీది బంగారు జాతకమని నేను రుజువు చేస్తానుగా?" అన్నాడు!

అన్నమాట కాదనలేక, ఉద్రేకపు పొంగు తగ్గగానే ఒంటరిగా వెళ్ళటానికి భయంవేసి, గుడిసె కొచ్చేసింది రత్నమ్మ.

అప్పటికే అన్నమ్మకు మెలకువ వచ్చింది. పక్కమీద రత్నమ్మ లేకపోయేసరికి, ఆ తల్లి గుండె చెదిరింది. "రత్తీ! రత్తీ!" అని గుండె బాదుకుని ఏడవసాగింది.

రత్నమ్మ రాగానే అమాంతం రత్నమ్మను కౌగిలించుకుని "రత్తీ! నా కడుపులో చిచ్చు పెట్టబోకే! నన్ను అన్యాయం చెయ్యబోకే! పాపిష్టిదాన్ని! నీకు పెళ్ళి చెయ్యకపోగా, నిన్ను తిట్టి తిట్టిపోసానుగదే! అయ్యన్నీ కడుపులో పెట్టుకోమాకే తల్లీ! నువ్వన్నాయిమయిపోతే, ఇక నేనెట్టా బతుకుతానే అమ్మా!" అని కుమిలి కుమిలి ఏడ్చింది.

ఆ తల్లీ, కూతుళ్ళిద్దరూ, ఒకరి నొకరు ఓదార్చుకుంటూ ఇద్దరూ కలిసి చాలాసేపు ఏడ్చారు.

తనను కేంటీన్‌లో సర్వర్‌గా తీసేసినప్పుడు, తనకు జరిగిన అన్యాయాన్ని వ్యాసమూర్తితో చెప్పుకున్నాడు జైహింద్‌బాబు—"ఆ! ఇంత అన్యాయమా? దయానంద్‌ని అడుగుతానుండు!" అన్నాడు ఆవేశంగా వ్యాసమూర్తి—ఆ తరువాత వ్యాసమూర్తి ఆ విషయమే ఎత్తలేదు. వ్యాసమూర్తి దయానంద్‌తో మాట్లాడాడనీ, అయినా జరిగిన అన్యాయాన్ని అరికట్టలేక పోయాడనీ, అర్థం చేసుకో గలిగాడు జైహింద్‌బాబు. ఆ తరువాత అతడు వ్యాసమూర్తి నుండి తన ఉద్యోగం విషయంలో ఏ విధమయిన సహాయాన్నీ కోరలేదు—ఒక విషయం అన్యాయమని తెలిసేదాన్ని అరికట్ట గలిగేశక్తి సామర్థ్యాలుండే, మౌనంగా పరిస్థితులకు లొంగిపోయిన వ్యాసమూర్తి ప్రవర్తనకు జైహింద్‌బాబు మనసు కలుక్కుమంది. మళ్ళీ అతడి ముందే వాని స్వవిషయంలో చెయ్యి జాపటానికి మనస్కరించలేదు.

వారంరోజుల కొకసారైనా సరళని కలుసుకుని ఏదో పిచ్చాపాటీ మాట్లాడటం బాగా అలవాటై పోయింది జైహింద్‌బాబుకి—అలా సరళతో మాట్లాడుతూ రత్నమ్మ పెళ్ళి ఫాల్స్ అంతా చెప్పి



"చూడండి, సరళమ్మ! ఈ మూఢ నమ్మకాలకి ఎలా జీవితాలు బలిచేసుకుంటున్నామో? ఇక రత్తికి పెళ్ళవుతుందనే ఆశలేదు—నిజానికి మా ఇంట్లో అందరిలో అది చాలా మంచిది. మంచివాళ్ళకి మంచి జరుగుతుందనేది వొట్టి మాటేనేమో! దాని కర్మ అంతేనేమో!" అన్నాడు బాధగా.

జైహింద్‌బాబు వెళ్ళిపోయాక కూడా రత్నమ్మ గురించే ఆలోచిస్తూ కూచుంది సరళ. ఆవిడకు లీలగా ఒక ఆలోచన వచ్చింది. తన ఆలోచనకు తనకే భయం వేసింది మొదట. కానీ ఆ ఆలోచన ఆవిడ మనసును వదలలేదు. మళ్ళీ-మళ్ళీ ఆలోచించగా ఫరవాలేదని అనిపించింది. ఇంకా ఆలోచిస్తే దివ్యంగా ఉందనిపించింది....

సారధికి భోజనం వడ్డిస్తూ సరళ "సారధీ! నీకొక సంబంధం ఆలోచించాను-ఒప్పుకుంటావా?" అంది.

తన జీతం మొత్తం తన పేర బేంక్‌లో వేస్తూ "నీకు ఇల్లూ వాకిలీ ఏర్పడాలి. నాలా కాకుండా నువ్వయినా మంచి సంబంధం చేసుకుని సుఖంగా ఉండాలి!" అన్న అక్క మాటలు గుర్తుకొచ్చాయి సారధికి.

"నీమాట ఎప్పుడు కాదన్నానక్కా!" అన్నాడు.

సారధికీ పెళ్ళి చేసుకుని జీవితంలో స్థిర పడాలనే ఉంది.... అతడు ఇటీవలే లైఫ్ ఇన్స్యూరెన్స్ ఆఫీసర్ పదవుల కోసం నిర్వహించిన కాంపిటీటివ్ పరీక్షలు వ్రాశాడు. చాలా బాగా వ్రాశాననుకున్నాడు. కానీ, ఆ పదవుల్లో యాభై శాతం వెనుకబడిన కులాల వాళ్ళకు కేటాయించినట్లు తెలుసుకుని కొంత నిరుత్సాహం పొందాడు. ఇప్పుడు తన అక్క చూసే సంబంధం ఎలాటిదో? ఆ అమ్మాయి ఎవరైనా ఆఫీసర్‌గారి అమ్మాయి అయితే, ఆ ఆఫీసర్‌గారి పరపతి వల్ల తనకు మంచి ఉద్యోగం దొరికితే.... అలలు-అలలుగా సాగిపోతున్నాయి సారధి కలలు....

"సారథీ! ఇంతవరకూ నేను నిన్నేదీ అడగలేదు. ఈ లోకంలో నాకు నువ్వూ, నీకు నేనూ తప్ప ఎవరూ లేరు. నా మాట కాదనవు కదూ?"

"నువ్వింతగా చెప్పాలా అక్కా! ఈ లోకంలో నీకంటె నామేలు కోరే వాళ్ళెవరు?"

తన ఆలోచన బాగుందని ఎంతగా అనుకున్నా, వెంటనే విషయం సారథితో చెప్పలేక పోయింది సరళ.

సరళ సంకోచంచూసి సారథి బెదురుగా "ఏమిటక్కా! పెళ్ళి సంబంధం విషయం చెప్పటానికి ఇంత ఆలోచన దేనికి?" అన్నాడు.

"నేను ఎంతో ఎంతో ఆలోచించి ఈ నిర్ణయానికి వచ్చాను సారథీ! నువ్వూ, ఎంతో, ఎంతో ఆలోచిస్తేనే కాని, నా నిర్ణయాన్ని ఆమోదించలేవు—నువ్వు జయన్న చెల్లెలు రత్నమ్మని చేసుకోగలవా సారథీ?"

"ఛీ! రత్నమ్మనా?" మతిపోయినట్లే అరిచాడు సారథి—అతని 'ఛీ' లో ఎంత చీదరింపైనా ఉంది.

"ఇందులో అంత చీదరించుకో వలసిన అవసర మేముంది సారథీ?"

"అదేమిటక్కా? ఆ కూలిగుడిసెల్లో మనిషిని...."

"సారథీ! అన్నీ మరిచిపోయి మాట్లాడకు—మనకు ఒకనాడు ఆమాత్రం ఆశ్రయంకూడా లేనిరోజున ఆ కూలిగుడిసెలే మనకు నీడనిచ్చాయి...."

"ఛ! అకులం...."

"కులం!....అపనిందల పాలయి, కులంకాని వాడితో ఇల్లు వదిలి నడివీధిలో నిలబడిన నీ అక్కది ఏ కులం సారథీ? మిలటరీ కేంటీన్‌లో చేపలూ, మాంసమూ వండటానికి సహాయంచేసి ఆ



జీతం డబ్బులతో తమ్ముణ్ణి చదివించుకున్న నీ అక్కదే కులం సారథీ? పురిటి రోజులువచ్చి, ఉన్న ఆ కాస్త ఆధారమూ పోతుందేమోనని భయపడిన రోజుల్లో, రత్నమ్మ ఆసరాతో కష్టకాలం గడుపుకొన్న నీ అక్కదే కులం సారథీ?"

అక్క తీవ్రమైన ధోరణికి బెదిరిపోయాడు సారథి.

"అదికాదక్కా! ఎంతైనా రత్నమ్మను భార్యగా చేసుకోవాలంటే-" అని నసిగాడు.

"అవును—చాటుమాటుగా నిలబడి తినేసేలా చూడటానికి రత్నమ్మ బాగుంటుంది కాని, భార్యగా బాగుండదు—నా తమ్ముడు కూడా అందరిలాంటి మొగవాడే!"

సారథి వంచిన తలఎత్తలేదు—అప్పటికీ మాట్లాడలేదు—
"సరే! నీకునచ్చిన సంబంధమే నువ్వు చేసుకో! నీ పెళ్ళి విషయంలో ఇంక నేను కల్పించుకోను—నా పొలంలో కొంత అమ్మిఅయినా సరే, రత్నమ్మకి పెళ్ళి జరిపించి, ఈ రకంగానయినా జయన్న రుణం తీర్చుకుంటాను—మనిషిగా జన్మించినందుకు నాకూ కాస్త విశ్వాసం ఉందని నిరూపించుకుంటాను."

"అలా కష్టపెట్టుకోకక్కా! అందరూ రత్నమ్మది శని జాతకం అంటున్నారుగా! నీకు భయంగాలేదూ?"

"లేదు—నువ్వు శ్రీవైష్ణవుడివేగా! నీకూ శాంతులూ, హోమాలూ, అన్నీ తెలుసుగా! ఏదో శాంతి జరిపించెయ్యి—శని వదిలిపోతుంది."

"అక్కా!"

"ఏం? ఆ శాంతిలో నమ్మకంలేదు. కాని, ఈ శనిలో నమ్మకం ఉంది కదూ! దేవుడంటే విశ్వాసం ఉన్నా, లేకపోయినా, దెయ్యాన్ని తలుచుకుంటే భయపడవలసిందే! సారథీ! అందరూ

నిన్నూ చిన్నప్పుడు శనిజాతకుడి వన్నారు. నేను నమ్మలేదు—భయపడలేదు—నిన్ను దూరం చేసుకోలేదు"

"నాతో నీ అనుబంధమూ, ఇదీ ఒకటేనా అక్కా?"

"ఏం? జయన్న నాకు తమ్ముడికంటే ఏం తక్కువ? తమ్ముడు అంతకంటే ఆదుకుంటాడు?"

మనసు చివుక్కుమంది సారధికి.

"సరే అక్కా! నీ యిష్టం వచ్చినట్లే జరగనీ!"

"వద్దు సారధీ! అలా కష్టపెట్టుకోవద్దు—బలవంతాన ఒప్పుకోవద్దు—నువ్వే స్థిమితంగా ఆలోచించుకో! దాని రూపురేఖలు నీకు తెలుసు-మనిషి మంచితనం, అనువర్తన నాకు తెలుసు-మన మధ్య మసిలి మాటలో ఏస పోయింది-శుచి, శుభ్రత నేర్చుకుంది-మన ఇంటికొస్తే మన అలవాట్లు నేర్పించుకోవచ్చు-వినయంతో నేర్చుకుంటుందనే నమ్మకం ఉంది-అలాకాక నీ కింకెవరినయినా చేసుకోవాలని ఉంటే చేసుకో!"

సారధి ఆ రాత్రంతా ఆలోచిస్తూనే ఉన్నాడు-రత్నమ్మ రూపం అతనికి గిలిగింతలు పెట్టకపోలేదు—ఆ గుడిసెల మధ్య రత్నమ్మని చూడకపోతే, రత్నమ్మ ఏ కాలేజీలోనో తనకు కనిపిస్తే రత్నమ్మను ప్రేమించి వర్ణాంతరమైనా సరే, చేసుకోవటానికి తనకు అభ్యంతరం ఉండేది కాదు—రత్నమ్మను చేసుకోననటం తేలికే? కానీ, తనకు పిల్లనియ్యటానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు? తను కులం, గోత్రం ఆలోచిస్తే తనకు పిల్లనిచ్చేవాళ్ళు మాత్రం ఆలోచించరా? తన అక్క గతాన్నీ. తనగతాన్నీ తవ్వకుండా, ఎద్దేవా, చెయ్యకుండా, ఎవరు పిల్లనిస్తారు తనకి? ఏదో ఒకలోపం ఉంటేతప్ప అలా ఎవరూ ఇవ్వరు-అంతనంటె రత్నమ్మనే చేసుకోవటం మంచిదికదూ? రూపం ఉంది. గుణంఉంది-అలవాట్లు నేర్పితే వస్తాయి. ముఖ్యమయినది అక్క చాలా సంతోషిస్తుంది—చిన్నప్పటినుంచీ తనకోసం అష్ట



ష్టాలూ పడ్డ అక్కకి ఈ మాత్రం ఆనందం కలిగించిన వాడవు దు.

ఆ మరునాడు సారధితో పెళ్ళి విషయం ఏమీ ప్రస్తావించ దు సరళ.

సారధి గారాబంగా "నామీద కోపంవచ్చిందా అక్కా!" న్నాడు.

గారాబంగా, ఆ అడుగుతున్న ధోరణికి నవ్వొచ్చింది సరళకి-లేదు సారధీ! నిజంగా నీమీద నాకేమీ కోపంలేదు-ఎప్పుడూ రాదు" ంది వాత్సల్యంగా.

తనమాట కాదన్నా తనమీద కోపం తెచ్చుకోని అక్కమీద ౌరవంతో నిండిపోయింది సారధి మనసు.

"మరి, ఈ సారధికేనా, నీమీద ప్రేమలేదు? అక్కా! ఈ మ్ముడు నీ ఆనతి జవదాటడు-రత్నమ్మని పెళ్ళి చేసుకుంటాడు-" అన్నాడు నాటక ఫక్కీలో.

సరళ ఎంతో ఆనందించింది—వాత్సల్యంగా "నీ కిష్టంలేకపోతే పెళ్ళి చేసుకోవద్దులే తమ్ముడూ! నేనేమీ అనుకోను-" అంది.

"రత్నమ్మంటే నా కిష్టమే అక్కా!"

తమ్ముడి ముఖంతో వెలుగుచూసి ఆ మాటలు మనసారానే అంటున్నాడని నమ్మింది సరళ.

జయన్నని పిలిపించి సంగతి వివరించింది సరళ-తన చెవులని తను నమ్మలేక పోయాడు జైహింద్‌బాబు.

"ఇది—ఇది సాధ్యమేనా?" అన్నాడు సంభ్రమంగా.

"అంత అసంభవాని కేముంది ఇందులో? రత్నమ్మకేం తక్కువయింది? నా కష్టాల్లో ఎన్నోసార్లు ఆదుకుని మా ఇంటి మనిషిలా కలిసిపోలేదూ?"

మాట్లాడలేక సరళకు రెండు చేతులూ జోడించి నమస్కారం చేశాడు జై హింద్‌బాబు.

విషయం విన్న అన్నమ్మ ఆనందంతో తబ్బిబ్బయింది— రత్నమ్మ మాత్రం భయంతో "నా శని ఆరికికూడా పట్టుకుంటాదేమో!" అంది.

"నోర్ముయ్!" అని చెల్లెల్ని ముద్దుగా కసిరాడు జై హింద్‌బాబు.

ఏ ఆడంబరాలూ లేకుండా, ఎవరినీ పిలవకుండా ఆర్య సమాజంలో పెళ్ళి కానిద్దామంది సరళ-జై హింద్‌బాబు సంతోషంగా ఒప్పుకున్నాడు-గుడిసెల్లో ఎవరినీ పెళ్ళికి పిలవలేదు-అన్నమ్మకి ఆ పెళ్ళి సంతృప్తిగాలేదు-"ఇదేం పెళ్ళి? ఏ యేడుకలూ లేకండా!..." అని గొణుక్కుంది. ఏదో ఒక విధంగా రత్నమ్మ పెళ్ళియిందే చాలునని సంతృప్తి పడింది. పెళ్ళియిపోయాక గుడిసెల్లో అందరికీ విషయం తెలిసి ఆశ్చర్యంగా బుగ్గలు నొక్కుకున్నారు.

సారధికి యల్. ఐ. సి. లో ఇంటర్వ్యూ వచ్చింది. ఇంటర్వ్యూలో తన బయోడేటా ఇస్తూ తను వెనుకబడ్డ జాతిలో పిల్లను పెళ్ళి చేసుకున్న విషయంకూడా చేర్చాడు-ఆ కారణంచేత అతనికి కూడా ప్రిఫరెన్స్ ఇచ్చారు-కొంచెం రోజుల్లోనే సారధి ఆఫీసర్‌గా సెలెక్ట్ అయినట్లు ఆర్డర్స్ వచ్చాయి. పరమానందంతో ఆ ఆర్డర్స్ సరళకి చూపించి సరళ పాదాలకు నమస్కారం చేశాడు సారధి.

సరళకూడా ఎంతో ఆనందించింది.

"సారధీ! నువ్వు రత్నమ్మను చేసుకోకుండా ఉంటే, ఇంత మంచి ఉద్యోగం నీకు రావటం అనుమానమే? ఇప్పుడు చెప్పు, రత్నమ్మది శనిజాతకమా?"

"కాదక్కా! రత్న మనింటికి నిజంగా రత్న దీపంలాగే వచ్చింది."



తన కలలుపండిన పారవశ్యంలో తన అదృష్టానికి పరోక్ష రకురాలయిన ఇల్లాలిని మనసారా మెచ్చుకున్నాడు సారధి.

# 18

మ్మకు పెళ్ళయి కాపురానికి వెళ్ళిపోయి నప్పటినుంచీ చంద్రి, టు తన తండ్రినీ, అటు అన్నమ్మనీ కనిపెట్టుకుని ఉంటోంది.

నాగమ్మ తన అవసరం కొద్దీ చాలా మారిపోయింది-చంద్రి మ్మ దగ్గిరకు వెళ్తానన్నప్పుడు తిట్టడంలేదు సరికదా, "మీ య్యకాడ నేనుంటాలే! యెల్లు-" అని పంపుతోంది.

మొదట్లో వెంకడు తోటమీద వచ్చిన డబ్బు తనకిస్తాడో, ద్యడో, అని భయపడింది నాగమ్మ-కానీ, వాడు ఏ రోజు కూర మ్మగా వచ్చిన డబ్బు, ఆరోజు చేతులో పోస్తోంటే, వెంకడంటే లా నమ్మకం కుదిరింది...."మా పెద్దోడు-" అంటోంది, వెంకణ్ణి ంచి చుట్టుపక్కల వారితో మాట్లాడేటప్పుడు.

తన కుటుంబం ఈ రకంగా కాస్త కుదుట పడటానికి హింద్‌బాబే కారణమన్న కృతజ్ఞతాభావం నాగమ్మ మనసులో పడింది. జైహింద్‌బాబుని చాలా ఆదరంగా చూస్తోంది. ఆ డు కుటుంబాల మధ్య రాకపోకలు ఎప్పటిలా సాగటం మొద ంది.

ఒకరోజు జై హింద్‌బాబు వచ్చినప్పుడు "జయన్నా! పెద్దక్క ప్పు కట్టేసి మా చెంద్రిని పెళ్ళాడియ్యి-" అంది నవ్వుతూ నవ్వుతూ న్నట్లుగా.

"తప్పా! తప్పెందుకు కట్టాలి? ఏం తప్పుచేస్తున్నాననీ?" షంగా అడిగాడు జై హింద్‌బాబు.

చంద్రి భయంగా చూసింది-

"అదేంటి జయన్నా! వరసకాని పెళ్ళి చేసుకుని కట్టు తప్పి
తప్పు కట్టొద్దా!" అమాయకంగా అడిగింది నాగమ్మ.

"నాకిది తప్పుగా అనిపించటంలేదు—నేను తప్పు కట్టను."
కచ్చితంగా అన్నాడు జై హింద్ బాబు.

నాగమ్మకు కోపం వచ్చింది. అది ఎంతైనా సహిస్తుంది
కట్టు తప్పుతానంటే సహించదు. అది తప్పుకాదంటే, అ
చేసుకోలేదు.

"అదేంటి నాగన్నా! పెద్ద సదువులు సదువుతున్నావు. రేపో
మాపో, పెద్ద దొరనాటి ఉద్యోగం వస్తాది. ఈ మాత్తరం తప్పు
కట్టలేవా?" అంది నవ్వుతూనే.

గతుక్కు మన్నాడు జై హింద్ బాబు. 'ఏమిటిది?' అన్నట్లు
చంద్రి వంక చూశాడు.

చంద్రి ప్రాధేయ పూర్వకంగా చూస్తూ రెండు చేతులూ
జోడించింది.

జై హింద్ బాబు మనసంతా చికాకు పడిపోయింది. తన
చదువు మానేసినట్లు నాగమ్మ కింకా తెలీదు—తను ఏదో చదువుక
పెద్ద ఉద్యోగస్థుణ్నవుతాననే ఆశతోనే, చంద్రిని చేసుకోమని అడుగు
తోంది. ఒకటి-మోసంచేసి పెళ్ళి చేసుకోవటం; రెండు-ఏదో
తప్పు చేస్తున్నట్లుగా పెద్దకి తప్పుకట్టి, ఆ డబ్బుతో పెద్దలంతా తాగి
తందనా లాడితే తన తప్పు పోయిందను కోవటం. ఈ రెంటిలో
దేనికీ జై హింద్ బాబు మనసు అంగీ కరించటంలేదు. ఈ విషయంలో
చంద్రి జై హింద్ బాబుని ప్రాధేయ పడవలసి వచ్చింది.

"బావా! అమ్మకి నువ్వు చదువుకున్నా, చదువు లేకపోయినా
ఒక్కటే! అమ్మకి కావలసిందల్లా నువ్వు మంచి ఉద్యోగంలో



ండటం-బాగా డబ్బు సంపాదించటం. పెళ్ళయిపోయాక నువ్వు
దువు మానేసినట్లు తెలిసినా అంతగా బాధపడదు-ఇందులో మోస
ముందీ? అసలు మనలో చదువుకున్న వాళ్ళెవరు?"

"ఇదే నా మనసుకి నచ్చటంలేదు. ఇంకా తప్పు కట్ట మం
ంది మీ అమ్మ—మన వాళ్ళందరిలో మూర్ఖత్వాన్నీ, మూఢచారా
, పోగొట్టాలని తాపత్రయపడే నేను, అందరికంటె మూర్ఖంగా
యి తాగి తందనాలాడమని పెద్దకి తప్పు కట్టనా?"

"వద్దు! తప్పుకట్టకు-మనం వీళ్ళందరినీ వదిలి ఎక్కడికైనా
దాం, పద!"

"చంద్రి!"

"నాకు తెలుసు బావా! నువ్వు అత్తయ్యని వదిలి రాలేవని
గా తెలిసే ఆ మాట అన్నాను. నేను మాత్రం రోగిష్టి తండ్రినీ,
రిబాగుల అమ్మనీ వదిలి రాగలనా? మనం మన వాళ్ళతోనే ఉండా
నుకుంటే, మన సంఘాన్నెదిరించి బ్రతకలేం బావా! ఒక్క మాట
ంటాను- స్తిమితంగా విను. మూర్ఖత్వాలూ, మూఢాచారాలూ మనలో
నా ఉన్నాయి? ఎంతో చదువుకుని ఎంతెంతో సంస్కారవంతు
కునే వాళ్ళలో ఎలాంటి మూర్ఖత్వాలున్నాయో తెలుసునా? నా
న్నప్పటి స్నేహితురాలు ఇప్పుడు బి. ఏ పాసయింది. తననెంతో
శాల హృదయమని నిరూపించుకోవటానికి నన్ను వాళ్ళింటికి
మ్మంది. స్నేహం కోసం ఆశ పడి వెళ్ళాను. వెళ్ళినప్పటినుంచి
చ్చేవరకూ 'నువ్వు నాకంటె చాలా తక్కువ దానివి సుమా!'
న్నట్లే ప్రవర్తించింది. తను కమ్యూనిస్టనని చెప్పుకుంటుంది.
డబ్బు మీద ఇంతా అంతా ఆశ కాదు. కూచున్న కొంచెంసేపూ ఒక్తి
సెట్టూరి అప్పలమ్మలా, చీరల గురించీ, నగల గురించీ తప్ప
మరొక దాని గురించి మాట్లాడలేదు. దేవుడు లేడంటుంది. ఎవరో

బాబా వచ్చాడని చూడటానికి పోయింది. ఆ బాబా తనలో దేవీ కళ ఉందన్నాడని తలుచుకుని తలుచుకుని మురిసి పోయింది. సంస్కారపు ముసుగుల్లో దాక్కున్న నిజస్వరూపాలి లాటివి! ఎక్కడోదాకా ఎందుకూ? మన సరళమ్మ సంగతే చూడు! ఆవిడ నిరాశ్రయురాలై నడివీధిలో నిలబడితే ఒక్కరు ఆదుకోలేదు. తన బ్రతుకు తెరువు కోసం మిలటరీ కేంటీన్‌లో వంట మనిషిగా చేరిందని ఆ కులాల వాళ్ళందరూ సరళమ్మని వెలేశారు! ఇప్పుడు చెప్పు-మూఢాచార ఉన్నది మనలోనేనా? మూర్ఖత్వం మనవాళ్ళ కేనా ఉన్నది? ఇం మనవాళ్ళ మూర్ఖత్వంలో అమాయికత్వం ఉంది. ఆ పై వాళ్ళ మూర్ఖత్వంలో ప్రాణాలనైనా కరకర నమిలి మ్రింగాలనే కక్షలూ, కార్పణ్యాలూ ఉన్నాయి. మనలో ఎన్ని మూఢాచారాలున్నా, కష్ట సుఖాల్లో ఒకరి నొకరు ఆదుకునే సమతాభావం ఉంది. వాళ్ళలో తోటివాళ్ళు కష్టాల పాలయితే లోలోపల ఆనందించే వారే తప్ప ఆదుకునే వారుండరు!"

జైహింద్‌బాబు ఆశ్చర్యంగా విన్నాడు.

"నువ్వింత జాగ్రత్తగా ఈ విషయాలన్నా ఆలోచిస్తావా, చంద్రీ!"

"ఆలోచిస్తాను బావా! ఈమధ్య కాలంలో ఎలాగో ఒకలాగ స్నేహితుల దగ్గిరనుండి పుస్తకాలు సంపాదించి చదవటం, వాటి గురించి ఆలోచించటమే నా పని!....బావా! ఈ లోకాన్నంతా నువ్వొక్క రోజులో మార్చలేవు. పరంపరగా వచ్చే మూర్ఖత్వాల నుండి బయటపడి స్వతంత్రంగా ఆలోచించటానికి మనిషి ఎంతో విశాల హృదయుడై ఉండాలి. మహా సాహసి కావాలి. అలాంటి వాళ్ళు కోటి కొక్కరుంటారు....ప్లీజ్ బావా! లేనిపోని ఆలోచనలతో నన్ను దూరం చేసుకోకు! ప్రస్తుతానికి తప్పు కట్టేసి నన్ను పెళ్ళి



సుకో! ఆ తరువాత ఇద్దరమూ కలిసి అర్థం లేని ఈ ఆచారాలు లా రూపు మాపాలో ఆలోచిద్దాం!"

జైహింద్‌బాబు అప్పటికీ తటపటాయిస్తూ ఊరుకున్నాడు. ంద్రి తన చిట్ట చివరి మహాస్త్రం ప్రయోగించింది.

"నువ్విలా ఆలోచిస్తూ కూచుంటే, మా అమ్మ నన్నెవరికో చ్చి కట్టబెట్టేస్తుంది. అప్పుడు అత్తయ్యానెవరు చూసుకుంటారో, ఆలోచించుకో!"

ఈ అస్త్రం జైహింద్‌బాబు మీద బాగా పని చేసింది.

"అలాగే చంద్రీ! తప్పు కట్టి నిన్ను పెళ్ళి చేసుకుంటాలే! కానీ, కొంచెం రోజులాగాలి! తప్పు కట్టడానికైనా నా దగ్గిర డబ్బులు లేవు...."

"అలాగే బావా! అసలు నువ్వు కొంచెం రాజీకి వచ్చి తప్పు కట్టడానికి ఒప్పుకోవాలే గాని, డబ్బెంతలో సంపాదిస్తావ్!"

పరమానందంతో వెళ్ళిపోయింది చంద్రి.

కానీ, డబ్బు సంపాదించటం చంద్రి అన్నంత తేలిగ్గా కనిపించ లేదు, జైహింద్‌బాబుకి. ఉద్యోగం కోసం ఎంతగా ప్రయత్నించినా దొరకటం లేదు. కూలి పని ఒక్కొక్క రోజున దొరుకుతుంది; ఒక్కొక్క రోజున దొరకటం లేదు. దొరికిన రోజున ఆ రోజు కూలి ఆ రోజు ఖర్చులకే సరిపోతోంది. చేసిన అప్పుకి వడ్డీ పెరుగుతోంది.

తను ఏదీ సాధించలేక పోతున్నాడు. అప్పులు చెయ్యటం ఎంత దారుణమైన శాపమో తెలిసినా వడ్డీలకి అప్పు చెయ్యటం మానలేక పోయాడు. తప్పు కట్టడం ఎంత మూర్ఖత్వమో తెలిసినా, తప్పు కట్టడానికి సిద్ధ పడుతున్నాడు.

పని కోసం తెగ తిరుగుతోంటే, తెలిసినవాళ్ళు రైల్వే బ్రిడ్జి రంగు వేసే పని ఉందని చెప్పారు. పని కొంచెం ప్రమాదకర మయింది. కానీ, కూలి కూడా ఎక్కువే! రోజుకి పన్నెండు రూపా యలు.... వెంటనే ఆ పనిలోకి వెళ్ళాడు జైహింద్‌బాబు.

రైల్వే బ్రిడ్జికి క్రింది భాగంలో రంగు వెయ్యాలి.... బ్రిడ్జి అడుగున సన్నని బల్ల చెక్కలు అమర్చి వాటిమీద నిలబడి రంగు వేస్తున్నారు కూలీలు.... అది చాలా ప్రమాదకరం! ఆ బల్ల చెక్కలు స్థిరంగా లేవు. ఊగిస లాడుతున్నాయి.

అడుగున మురికి కాలువ నగరంలో మురికినంతా తనలో నింపుకుని నిండుగా ప్రవహిస్తోంది. పైన బ్రిడ్జి మీదనుంచి రైళ్ళు పరుగెడుతూనే ఉన్నాయి. ఒక్కొక్కసారి రైలు నడిచినప్పుడల్లా ఇంజన్ మరుగుతోన్న వేడినీళ్ళను నాలుగుపక్కలకూ చిమ్ముతోంది. ఆ వేడినీళ్ళ బారినుంచి తప్పుకుంటూ, క్రింద బల్ల చెక్కమీదనుంచి కాలు జారకుండా చూసుకుంటూ రంగు వెయ్యాలి.

న్యాయానికి అంత ప్రమాదకరమయిన పరిస్థితుల్లో బ్రిడ్జి కింద బల్ల చెక్కలను స్థిరంగా బిగించవలసిన బాధ్యత కాంట్రాక్టర్‌ది.... కానీ, అందుకు చాలా డబ్బవుతుంది. అంతకంటె కూలి పెంచి ఎక్కువ కూలి కోసం ఆశ పడి వచ్చిన కూలివాళ్ళ చేత పని చేయించుకోవటం లాభదాయకం. కూలీల ప్రాణం పోవచ్చు. అందువల్ల కంట్రాక్టర్‌కేం నష్టం? ఎక్కువ కూలి కాశ పడి కూలీలే ప్రాణాలకు తెగించి వస్తున్నప్పుడు కాంట్రాక్టర్ తప్పేముంది?

ఎక్కువ కూలికి ఆశించి అలాటి ప్రమాదకరమయిన పనికి ఒప్పుకున్నంతమాత్రాన పాపం, కూలీలకు ప్రాణభయం లేకపోలేదు.



ందుకే వాళ్ళంతా అక్కడ వెలసిన కట్టమైసమ్మకి ఘనంగా పూజలు సి కొబ్బరికాయ కొట్టి, ఆ కుంకం ముఖానికి పెట్టుకుని మరీ పనిలోకి గుతారు. అంతగా పూజలు చేసినా ఆ మురికి కాలువలో పడి చచ్చి యిన ఇద్దరు ముగ్గురు పనివాళ్ళని కట్టమైసమ్మ తన చేతులు జాపి పాడలేదు. వాళ్ళు చచ్చినా మిగిలిన వాళ్ళు కూలికి రావటం మాన ము. కట్టమైసమ్మకి పూజలూ మానలేదు.

రోజుకి పన్నెండు రూపాయల కూలి అనగానే వెనుకముందు లోచించక పనిలో చేరిపోయాడు జైహింద్‌బాబు. రెండురోజుల్లో వై నాలుగు రూపాయలు సంపాదించగానే ఆనందంతో వళ్ళు తెలీ దు జైహింద్‌బాబుకు....

"చంద్రీ! బాగా సంపాదిస్తున్నానే, ఇలా ఒక్క నెల పని శానంటే తప్పు కటేసి నిన్ను పెళ్ళి చేసుకుంటాను" అన్నాడు ంద్రితో ఉత్సాహంగా. చంద్రి కూడా పొంగి పోయింది. పెళ్ళికి రెండు మూడు కొత్త చీరలు కూడా కొని దాచుకుంది.

ఆ రోజు జైహింద్‌బాబు క్రింద నుండి రంగు వేస్తుండగా పైనుండి రైలు పోసాగింది.

రంగు వేస్తున్న జైహింద్‌బాబు భుజం మీదా, ముఖం మీదా మరుగుతోన్న నీళ్ళు పడ్డాయి. ఆ బాధకు తటుకోలేక పక్కకు తప్పుకోబోయాడు. స్థిరంగా లేని బల్ల చెక్క కదిలిపోయింది. పట్టు తప్పి క్రింద ఉన్న మురికి నీళ్ళలో పడిపోయాడు.

దురదృష్టవశాన ఆ మురికి నీళ్ళలో ఉన్న బండమీద పడ్డాడు జైహింద్‌బాబు. అలా పడటంతోనే గుండెకు దెబ్బ తగిలింది....

వెంటనే తేరుకోలేక పోయాడు. ఫేంట్ చిరిగి కాళ్ళకు అడ్డు పడట
వలన ఈదలేక పోయాడు....

అన్ని విధాలుగా ప్రతిఘటించాలని ప్రయత్నించినా, ప్రతిఘ
టించగలిగే శక్తి సామర్థ్యాలున్నా అరకంగా ఆ యువకుడు తన
చిండు జీవితాన్ని నగరంలోకి 'మురికి'కి ఆహుతి చేసుకున్నాడు.

చూసినవాళ్ళు కేకలు వేశారు. కంగారు పడ్డారు. ఒక రకంగా
ఇంతటి దారుణమూ అక్కడి వాళ్ళకి సాధారణమయి పోయింది. ఆ
మరు నాటికి కాని జైహింద్‌బాబు శవాన్ని బయటికి తియ్యలేక
పోయారు....అప్పటికి సంగతి తెలిసి అందరూ వచ్చారు.

అన్యాయమని తెలిసితెలిసి అన్యాయాన్నే సమర్థించిన దయా
నంద్....

అన్యాయాలను ఎదుర్కోవటానికి పూనుకొని, మిత్రుణ్ణి ఎది
రించలేక పోయిన వ్యాసమూర్తి....

ఇద్దరూ కన్నీరు కార్చారు. ఆ ఇద్దరికీ జైహింద్ అంటే
ప్రాణమే! కానీ, అతడి మరణానికి తామే కారకులా?

జైహింద్‌బాబు మరణవార్త విని "వాడి అంతు తేలుస్తాను"
అని రోషంతో వచ్చిన సుధీర్‌బాబు ఆ ప్రదేశానికి రాగానే ఆ కాంట్రా
క్టర్‌ని చూడగానే నోట మాట రాక కొయ్యబారిపోయి నిలబడ్డాడు—
ఆ కాంట్రాక్టర్‌కి రైల్వే బ్రిడ్జి కాంట్రాక్ట్ రావటానికి కారణం తనే!
మామూలుగా తన మామూలు తను తీసుకునే కంట్రాక్టర్‌కి ఆ
కాంట్రాక్ట్ వచ్చేలా చేశాడు. ఇప్పుడా కంట్రాక్టర్‌ని తనేం చెయ్య
లేడు. తీగ కదిలిస్తే డొంకంతా కదులుతుంది....







చచ్చిపోయిన జైహింద్‌బాబు గుండెలను అంటిపెట్టుకుని
ఉంది చిన్ననాడు తను బహుమానంగా ఇచ్చిన ఆంజనేయస్వామి
రక్షరేకు....

ఆ ఆంజనేయస్వామి తనను చూసి విరగబడి నవ్వుతున్నాడు.
"నాకు దేవుడిలో నమ్మకం లేదు. మన స్నేహంలో నమ్మకం
ఉంది...." అంటున్నాడు, ప్రాణం పోయినా రక్షరేకు వదలని
జైహింద్‌బాబు.

"నేను గజ ఈతగాణ్ణి. ఎంతటి మహా ప్రవాహంలోనయినా
ఈదగలను. కానీ ఈ 'మురికి'లో ఈదలేక పోయాను...." అంటు
న్నాడు, వంటి నిండా మురికితో నిస్సహాయంగా ప్రాణాలు వదిలిన
జైహింద్‌బాబు.

ఆ నాడు తన బిడ్డను సాహసంతో రక్షించిన జైహింద్‌బాబు
ఈ నాడు ఇలా 'మురికి'కి బలి కావటానికి తనే కారణమా?

"అన్నమ్మకూడా వచ్చింది. "నాబిడ్డ సావలేదు—సావడు....
ఆడు దొర....పెద్ద దొర...." అని ఏడుస్తూ నవ్వసాగింది.

"ఇహిహీ....చచ్చిపోతే చావ లేదంటోంది వెర్రిబాగులది!"
అని నవ్వాడు నాదముని.

దైవికంగా మనో వికాసానికి నోచుకోని నాదమునినీ, అమా
నుషాలకు తట్టుకోలేక మతి పోగొట్టుకున్న అన్నమ్మనూ, మార్చి
మార్చి చూసి తన కొడుకు కిరణ్‌ని దగ్గిరగా లాక్కుంది సరళ,
భయంతో, బాధతో.

చంద్రి జైహింద్‌బాబు తాలూకని తెలుసుకున్న కంట్రాక్టర్ కొంత డబ్బు తీసి "ఇది ఖర్చుల కుంచండి!" అని చంద్రి కియ్య బోయాడు.

"ఆ డబ్బు మా పెద్ద కియ్యండి! తప్పు కట్టండి! నన్ను మా బావ కిచ్చి పెళ్ళి చెయ్యండి!...." అని జైహింద్‌బాబు శవం మీద విరుచుకు పడిపోయింది చంద్రి.

———